శ్రీమద్రామాయణము

కిష్కింధాకాండము

సంస్కృత మూలము

భగవాన్ వాల్మీకి మహర్షి

తేటతెలుగులో

మొదలి వెంకట సుబ్రహ్మణ్యం

2-31, చైతన్యపురి,

హైదరాబాదు 500060

ఫో: 24048104

సెల్: 9391134792

కిష్కింధా కాండము

మొదటి సర్గ.

రామ లక్ష్మణులు పంపా సరస్సును సమీపించారు. ఆ సరస్సు చూడటానికి చాలా మనోహరంగా ఉంది. సరస్సునిండా పద్మములు,కలువలు వికసించి ఉన్నాయి. ఆ సరస్సు అందాలు చూడగానే రాముని హృదయం అంతా బాధతో నిండి పోయింది.

“లక్ష్మణా! ఈ సరస్సు చూడు ఎంత హృదయానందాన్ని కలిగిస్తూ ఉందో. కాని సీతా వియోగంతో బాధపడుతున్న నాకు ఈ సరస్సు అందాలు ఏమాత్రం సంతోషాన్ని కలిగించడం లేదు. సీతా వియోగంతో బాధపడుతున్న నాకు ఈ ప్రకృతి అందాలు ఇంకా దు:ఖమును ఎక్కువ చేస్తున్నాయి. నా మనోవ్యధ ఎప్పుడు తీరుతుందో ఏమో! కాని లక్ష్మణా! ఈ వనములో ఉన్న పుష్పముల మీదినుండి వీచు గాలి మనకు మార్గాయాసమును పూర్తిగా తొలగించినది.

లక్ష్మణా! ఆ కోయిలలు చూడు ఎలా కూస్తున్నాయో. సీత కూడా ఆ కోయిల కూతలు విని నన్ను పిలిచి ఆ కోయిల కూతలు నాకూ వినిపించేది. నా సీత నాకు దొరకని పక్షంలో, నా సీతను నేను చూడని పక్షంలో నేను బతికి ఉండటం వృధా! ఇటువంటి సుందర దృశ్యములు ఎన్ని చూచినా సీతను చూచిన దానితో సాటి రావు కదా! పైగా ఈ వసంత ఋతువు దృశ్యములు, ఈ మలయమారుతము, వసంత శోభ నా వ్యధను ఎక్కువ చేస్తున్నాయి. నా సీతను ఆ రాక్షసుడు ఎత్తుకొని పోకపోయి ఉంటే నేను కూడా సీత తో కలిసి ఈ

వసంత ఋతువు శోభను తనివితీరా అనుభవించేవాడిని కదా!

లక్ష్మణా! సీత బతికి ఉంటే, సీత ఉన్న చోటున కూడా ఈ వసంత ఋతువు ఉంటుంది కదా! సీత కూడా నా మాదిరే విరహవేదన అనుభవిస్తూ ఉంటుంది కదా! నా మాదిరే సీత కూడా ఈ వసంత శోభను అనుభవించలేదు కదా! అవును. ఈ మనోహర దృశ్యములు ఆమెకు కూడా ఏమాత్రం ఆనందాన్ని కలిగించలేవు. ఎందుకంటే నేను, సీత దేహాలు వేరైనా మా మనసులు ఒకటే. నా మనస్సు ఆమె మీద, ఆమె మనస్సు నా మీదా లగ్నం అయి ఉన్నాయి.

లక్ష్మణా! నేను సీత కలిసి ఉన్నప్పుడు మా ఇద్దరికీ ఆహ్లాదమును కలిగించిన ఈ మలయమారుతము ప్రస్తుతము నాకు అగ్ని వీచికలవలె తాకుతూ ఉన్నాయి. లక్ష్మణా! చూచావా! ఆ కాకి ఎలా అరుస్తూ ఉందో! నాకు మరలా సీతా సంయోగం కలుగుతుందని చెబుతూ ఉన్నట్టు లేదూ! సీతకు పద్మములు అంటే ఎంతో ఇష్టం. ఈ పంపా సరోవరములో ఉన్న పద్మములను చూచి సీత ఎంత సంతోషించేదో కదా! సీత లేకుండా నేను ఈ పద్మముల శోభను అనుభవించలేకున్నాను.

లక్ష్మణా! సీత నా దగ్గరగా ఉన్నప్పుడు నాకు ఏ యే వస్తువులు, దృశ్యములు ఆనందాన్ని కలిగించాయో అవే వస్తువులు,అవే దృశ్యములు ఇప్పుడు నాకు ఖేదాన్ని కలిగిస్తున్నాయి. లక్ష్మణా! సీత నాకు కనపడితే, సీతతో సహా నేను ఇక్కడనే స్థిరనివాసము ఏర్పరచు కొనవలెనని కోరికగా ఉంది. సీతతో సహా ఇక్కడ ఉంటే, నాకు దేవేంద్రపదవి కూడా అక్కరలేదు అనిపిస్తూ ఉంది. అయోధ్యకు కూడా

తిరిగి వెళ్లను. ఇక్కడే ఉండిపోతాను. ఈ వనసీమలలో, ఈ సరోవర తీరములలో, పచ్చికబయళ్లలో సీతతో విహరిస్తూ ఉంటే, నాకు ఏ చింతా ఉండదు. ఏ వస్తువూ కావాలని అనిపించదు. ఈ అందమైన పంపాసరస్సులో నేను సీత జలకాలాడటం కన్నా ఆనందం ఏముంటుంది చెప్పు.

లక్ష్మణా! నేను లేకుండా నా సీత ఇంకా ప్రాణాలతో ఉంటుందంటావా! ఏమో! ఆలోచించే కొద్దీ నా మనసు వికలం అవుతూ ఉంది. సీత తండ్రి జనకమహారాజు వచ్చి నా సీత ఏదీ అని అడిగితే ఏమని చెప్పాలో అర్థంకావడం లేదు. నా దురదృష్టం కొద్దీ నేను రాజ్యాన్ని పోగొట్టుకొని అడవులకు వచ్చాను. సీత కూడా నా వెంట రావాలా! ఒకవేళ వచ్చినా రాక్షసుల చేత అపహరింపబడాలా! అంతా నా దురదృష్టం కాకపోతే మరేమిటి! రాజ్యభ్రష్టుడు, బుద్ధిలేని వాడు అయిన నన్ను నమ్ముకొని నా వెంట వచ్చిన సీత లేకుండా నేను ఎలా జీవించేది!

లక్ష్మణా!సీత ఎంత మధురంగా మాట్లాడేది. నాతో పరిహాసమాడేది. అటువంటి సీత పలుకులు మరలా ఎప్పుడు వింటానో కదా! నాతో పాటు అడవిలో ఎన్నో కష్టములు అనుభవించుచున్నా, సీత తాను ఏ కష్టములు పడనట్టుగా ఆనందించుచున్నట్టు కనపడేది. నా తో ఎంతో సంతోషంగా మాటలాడుతూ ఉండేది. అటువంటి సీతను వదిలి నేను ఒంటరిగా అయోధ్యకు వెళితే, నా తల్లి కౌసల్య “రామా! నా కోడలు సీత ఎక్కడ. ఆమెను ఎక్కడ వదిలి వచ్చావు”అని అడిగితే నేను ఏమని సమాధానము చెప్పాలి.

ఓ లక్ష్మణా! నేనుసీత లేకుండా అయోధ్యకు రాలేదు. కాబట్టి

నీవు ఒంటరిగా అయోధ్యకు వెళ్లు. నేను ఈ అరణ్యములలోనే సీతా వియోగంతో ఆ తనువు చాలిస్తాను." అని విలపించాడు రాముడు.

ఆ మాటలు అన్నీ ఓపిగ్గా విన్నాడు లక్ష్మణుడు. "ఓ రామా! ఉత్తమకులములో పుట్టిన వాడవు. అమిత పరాక్రమవంతుడవు. నీవే ఇలా అధైర్యపడితే ఎలా! నీ వంటి నిర్మల బుద్ధి కలవారికి ఈ ప్రకారము మందబుద్ధితో ఆలోచించడం శోభించదు. రామా! మనకు ఎక్కువ ప్రియమైన వాళ్లు దూరమైనపుడు దు:ఖముకలగడం సహజము. దానికి ఉపాయం వెతకాలి కానీ, ఇలా దు:ఖించడం వలన ప్రయోజనము లేదు. ముందు మనము ఆ రావణునిజాడ కనుక్కోవాలి. వాడు ఆకాశంలో ఉన్నా పాతాళంలో ఉన్నా వాడిని వదిలేది లేదు. వాడు సీతను తెచ్చి అప్పగించాలి. లేకపోతే మనచేతిలో చావాలి.

అన్నిటికన్నా ముందు నీవు ధైర్యంగా ఉండాలి. ఈ దీనత్వాన్ని వదిలిపెట్టాలి. కార్యరంగంలోకి దూకాలి. దానికి తగిన ఉత్సాహమును తెచ్చుకోవాలి. మానవ శరీరానికి ఉత్సాహాన్ని మించిన బలం వేరొకటి లేదు. ఉత్సాహవంతునకు లభించనిది ఏదీ లేదు. ఉత్సాహవంతుడు ఓటమిని ఎరుగడు. కాబట్టి రామా! నీవుకూడా ఉత్సాహమును తెచ్చుకో. సీతను తిరిగి సాధించుటకు ప్రయత్నము చెయ్యి. నీ పరాక్రమాన్ని గుర్తుకు తెచ్చుకో. నీ శోకాన్ని పక్కనపెట్టు. మనస్సును నిగ్రహించుకో." అని రామునికి హితబోధ చేసాడు లక్ష్మణుడు.

లక్ష్మణుని మాటలతో రాముడు తన శోకాన్ని విడిచిపెట్టాడు. ధైర్యము, ఉత్సాహాన్ని తెచ్చుకున్నాడు. రాముడు, లక్ష్మణుడు

పంపాసరోవరమును దాటారు.

వీరిద్దరినీ ఋష్యమూక పర్వతము పైనుండి సుగ్రీవుడు అనే వానర రాజు చూస్తున్నాడు. సుగ్రీవునికి భయం పట్టుకుంది. ఆ మానవులు ఇద్దరూ వాలి పంపగా తనకోసం వచ్చారేమో, తనను చంపుతారేమో అని భయపడ్డాడు. ఆ భయంతో కుంగిపోయాడు సుగ్రీవుడు. వెంటనే సుగ్రీవుడు తన వెంట ఉన్న వానరులతో సహా అక్కడి నుండి పారిపోయాడు.

శ్రీమద్రామాయణము

కిష్కింధాకాండము మొదటి సర్గ సంపూర్ణము

ఓం తత్సత్ ఓం తత్సత్ ఓం తత్సత్

కిష్కింధాకాండము

రెండవ సర్గ.

రామ లక్ష్మణులను చూచి పారి పోయిన సుగ్రీవుడు ఇంకా భయపడుతూనే ఉన్నాడు. ఒక చోట నిలవడం లేదు. అన్ని దిక్కులా చూస్తున్నాడు. రామలక్ష్మణులు ఎటు వైపు నుండి వచ్చి తన మీద దాడి చేస్తారేమోనని భయంతో వణికిపోతున్నాడు. మహాబలవంతులు, ధనుర్బాణములు ధరించిన రామలక్ష్మణులను చూచి సుగ్రీవునకు ధైర్యం సడలిపోయింది. బాగా ఆలోచించాడు. తన బలం గొప్పదా లేక ఆ మానవుల బలం గొప్పదా అని తనలో తాను తర్కించుకుంటున్నాడు. తనతో పాటుగా ఉన్న మంత్రులను పిలిచాడు. వారికి రామలక్ష్మణుల గురించి చెప్పాడు.

"అదుగో అటు చూడండి. ఆ మానవులు ఇద్దరూ నారచీరలు కట్టుకొని, ధనుర్బాణములు ధరించి దేనికోసమో వెదుకుతున్నారు. వారు వాలి పంపిన వారు అని నా అనుమానము. లేకపోతే క్రూరమృగములు సంచరించు, మానవులు చొరరాని ఈ దుర్గమారణ్యములో ఈ మానవులకు ఏమి పని. వీరు నిశ్శంశయంగా వాలి నాకోసం పంపినవారే. మనము ఇక్కడి నుండి వేరు చోటికి వెళ్లడం మంచిది." అని అన్నాడు సుగ్రీవుడు.

సుగ్రీవుని మాట ప్రకారము ఆ వానరులు అందరూ వేరే ప్రదేశానికి వెళ్లారు. అక్కడ అందరూ వలయాకారంలో కూర్చున్నారు. మధ్యలో సుగ్రీవుడు కూర్చున్నాడు. ఆ వానరులలో హనుమంతుడు అనే పేరుగల వానరుడు, రామలక్ష్మణులను గురించి భయపడుతున్న సుగ్రీవుని చూచి ఇలా అన్నాడు.

"ఓ వానర రాజా! నీవు ఎందుకు వాలిగురించి భయపడ తావు. మనము మలయ పర్వతము మీద ఉన్నాము. వాలి ఈ పర్వతము మీదికి రాలేడు. కాబట్టి వాలి వలన మనకు భయం లేదు. అదీ కాకుండా మనకు కనుచూపు మేరలో వాలి కనపడటం లేదు కదా. మరి నువ్వు వాలి గురించి ఎందుకు భయపడుతున్నావు. నీ భయానికి నాకు కారణం కనిపించడం లేదు. నీవు వాలి గురించి అనవసరంగా భయపడుతున్నావు. ఆ భయం వలన నీకు బుద్ధి క్షీణించింది. పైగా వానరసహజమైన చపలత్వము నిన్ను ఆవహించింది.

సుగ్రీవా! నీవు వానర రాజువు. రాజే ఇలా భయపడితే ఎలాగ? నీ మనస్సును ధృఢంగా ఉంచుకో. అనవసరంగా

భయాందోళనలకు గురి కావద్దు. స్థిరమైన బుద్ధితో ఆలోచించు. స్థిరబుద్ధితో ఆలోచించ లేని రాజు ప్రజలను పాలించడానికి అర్హుడు కాడు. కాబట్టి భయపడటం మాను.” అని హితోపదేశం చేశాడు హనుమంతుడు.

హనుమంతుని మాటలతో సుగ్రీవుని భయం తగ్గింది. హనుమంతునితో సుగ్రీవుడు ఇలా అన్నాడు. “అది కాదు హనుమాన్! ఆ మానవులను చూడు. వారు ఆజానుబాహులు. ధృడకాయులు. ధనుర్బాణములు ధరించిన వారు. వారిని చూచి ఎవరికి భయం కలగదు చెప్పు. వారు వాలి పంపగా నాకోసం వచ్చినవారే. సందేహము లేదు. లేకపోతే ఆ మానవులకు ఈ ఘోరారణ్యములో ఏమి పని.

వాలికి ఎంతో మంది స్నేహితులు ఉన్నారు. వారిలో వీరూ ఒకరేమో! వీరిని వాలి పంపాడేమో! వాలిని నమ్మకూడదు. శత్రువులను ఒక కంటితో కనిపెట్టి ఉండటం రాజధర్మం కదా! అందులోనూ కపటంగా వ్యవహరించే వాలితో ఇంకా జాగ్రత్తగా ఉండాలి.   మనం భయపడకుండా, వారేం చేస్తారులే అని నిర్లక్ష్యంగా ఉంటే, అదును చూచి శత్రువులు మన మీద దెబ్బతీస్తారు. పైగా వాలి చాలా తెలివిగలవాడు. మన గురించి అన్ని విషయములను సేకరిస్తూ ఉంటాడు. అలాంటి వారి గురించి మనం చాలా జాగ్రత్తగా ఉండాలి.

కాబట్టి మనం ఒక పని చేద్దాము. ఓ వానర వీరుడా! హనుమా! నువ్వు సామాన్య మానవుని వేషంలో ఆ మానవుల వద్దకు వెళ్లు. వారి ఇంగితమును గ్రహించు. నీ మాటలతో వారు ఎవరో! ఎక్కడ నుండి వచ్చారో! ఇక్కడకు ఎందుకు వచ్చారో! ఎవరి కోసరం

వచ్చారో నేర్పుగా మాట్లాడి తెలుసుకో! వారిని నీ పొగడ్తలతో సానుకూల పరుచుకో. చక్కగా మాట్లాడు. వారి మనోభావాలను గుర్తించు. వారికి నీ మీద విశ్వాసం కలిగేటట్టు ప్రవర్తించు. అసలు వారు ఇక్కడకు ఎందుకు వచ్చారో తెలుసుకో. ఆ మానవులు ఏమైనా దురాలోచనలతో వచ్చారా! లేక నిర్మలమైన మనస్సులతో వచ్చారా అనే విషయం గ్రహించు. అసలు వాళ్లు మంచి వాళ్లా లేక చెడ్డ వాళ్లా అనే విషయాన్ని వారి మాట్లాడే మాటలను బట్టి పసిగట్టు. వెళ్లు. కార్యము సానుకూలం చేసుకొని రా!" అని సుగ్రీవుడు హనుమంతుని రామలక్ష్మణుల వద్దకు దూతగా పంపాడు.

శ్రీమద్రామాయణము

కిష్కింధాకాండము రెండవ సర్గ సంపూర్ణము

ఓం తత్సత్ ఓం తత్సత్ ఓం తత్సత్

కిష్కింధాకాండము

మూడవ సర్గ.

సుగ్రీవుడు చెప్పిన మాటలను జాగ్రత్తగా విన్నాడు హనుమంతుడు. వెంటనే ఋష్యమూక పర్వతము నుండి రామలక్ష్మణులు ఉన్నచోటికి వెళ్లాడు. హనుమంతుడికి ఆ మానవులు ఎవరో తెలియదు. అందుకని నిజరూపంతో పోకుండా ఒక సన్యాసి వేషము ధరించాడు. రామలక్ష్మణుల ముందుకు వెళ్లాడు. రామ లక్ష్మణులు సన్యాసి వేషములో ఉన్న హనుమంతుని చూచి అభివాదము చేసారు.

రామలక్ష్మణులను చూచి హనుమంతుడు ఇలా అన్నాడు. "మీరు ముని కుమారులవలె ఉన్నారు. కాని మీ చేతిలో ధనుర్బాణములు ఉన్నవి. మీరు వీరుల వలె కనపడుతున్నారు. కాని జటాజూటములు ధరించి ఉన్నారు. మీరు ఒకరిని ఒకరు పోలి ఉన్నారు. కవలలవలె ఉన్నారు. మీరు దేవలోకము నుండి దిగివచ్చిన సూర్య చంద్రుల మాదిరి కనపడుతున్నారు. దేవతారూపములలో ఉన్న మానవుల మాదిరి కనపడుతున్నారు.

మీరు ఆజానుబాహులుకదా! మరి మీరు ఎటువంటి అలంకారములు ధరించలేదేమి? మిమ్ములను చూస్తుంటే మీరు ఈ భూమండలము అంతా పరిపాలించ గల సమర్థులు అని నమ్ముతున్నాను. మీ గురించి మాకు తెలపండి.

ఇంక నా గురించి చెబుతాను వినండి. నా పేరు హనుమంతుడు. వానర రాజు సుగ్రీవుడు మా ప్రభువు. ఈ ఋష్యమూక పర్వతము మీద ఉన్నాడు. ఆయన మీ గురించి తెలుసుకొని రమ్మని నన్ను పంపాడు. కాబట్టి మీ వివరాలు నాకు తెలియజేయండి." అని పలికాడు హనుమంతుడు.

ఆ మాటలకు రాముడు చాలా సంతోషించాడు. వెదకబోయిన తీగ కాలికి తగిలినట్టయింది అని అనుకున్నాడు. లక్ష్మణుని చూచి ఇలా అన్నాడు. "లక్ష్మణా! మనము ఎవరి కోసరం వెదుకుతున్నామో ఆ సుగ్రీవుని మంత్రి మనవద్దకు వచ్చాడు. ఈ వానరుని మాటలు చూడగా మనతో స్నేహము చేయవలెనని తలంపుతో ఉన్నట్టు కనపడుతూ ఉంది. ఇతడు చాకచక్యంగా

మాట్లాడటం తెలిసిన వాడు. మంచి స్నేహశీలి. కాబట్టి లక్ష్మణా! ఇతనితో నీవు మాట్లాడు. నాకు చూడగా ఇతడు నాలుగు వేదములు, వ్యాకరణశాస్త్రము చదివిన వాడులాగా కనపడుతున్నాడు. లేకపోతే ఇంత చాకచక్యముగా, ఒక్క అపశబ్దము కూడా లేకుండా మాటలాడలేడు.

లక్ష్మణా! ఇతని శరీరములో ఎక్కడా ఒక్క అవలక్షణము కూడా కనపడటం లేదు. సర్వలక్షణ సంపన్నుడు లాగా ఉన్నాడు. ఇతని మాటలు వింటుంటే ఇంకా వినాలని అనిపిస్తూ ఉంది కానీ విసుగురావడం లేదు. కాబట్టి నీవు అతనితో మాటలాడుము." అని అన్నాడు రాముడు.

అప్పుడు లక్ష్మణుడు హనుమంతునితో తాము వచ్చిన పని సూటిగా తెలిసాడు. " మేము అయోధ్యాధిపతి దశరథుని కుమారులము. ఇతను రాముడు. నా పేరు లక్ష్మణుడు. నా అన్న రాముని భార్యను ఎవరో రాక్షసుడు అపహరించాడు. ఆమెను మేము వెతుకుతున్నాము. మీ రాజు సుగ్రీవుడు కూడా ఇదే పరిస్థితిలో ఉన్నాడని తెలిసింది. అందువలన మీ రాజు సుగ్రీవునితో స్నేహము చేయవలెనని, పరస్పరసాయము చేసుకొనవలెనని అభిలషించుచున్నాము."అని సూటిగా బదులు చెప్పాడు లక్ష్మణుడు. లక్ష్మణుడు పలికినపలుకులు విన్న హనుమంతుడు చాలా సంతోషించాడు. తన రాజు సుగ్రీవుని పని కూడా సానుకూలము అవుతుందని మనసులో అనుకున్నాడు.

శ్రీమద్రామాయణముకిష్కింధాకాండము మూడవ సర్గ సంపూర్ణము

ఓం తత్సత్ ఓం తత్సత్ ఓం తత్సత్

కిష్కింధాకాండము

నాలుగవ సర్గ.

లక్ష్మణుని మాటలు విన్న హనుమంతుడు వారు తమకు శత్రువులు కారనీ, వాలి పంపిన వారు కారనీ, ఒక కార్యము నిమిత్తము తిరుగుతున్నారనీ, వీరి మైత్రితో సుగ్రీవుని కష్టములు కూడా గట్టెక్కుతా యని సంతోషించాడు. వీరు కూడా సుగ్రీవుని వలె కష్టములలో ఉన్నట్టున్నారు. వీరి కష్టములను సుగ్రీవుడు తీర్చగలడు. అప్పుడు వీరు కూడా సుగ్రీవునకు సాయము చెయ్యగలరు. వాలి నుండి సుగ్రీవునికి రాజ్యప్రాప్తి కలుగుతుంది." అని సంతోషించాడు.

తరువాత హనుమంతుడు లక్ష్మణుని చూచి ఇలా అన్నాడు. "మీరు చూడబోతే మునికుమారులవలె ఉన్నారు. కాని చేతిలో ధనుర్బాణములు ఉన్నవి. మీరు ఎవరికోసమో వెతుకుతున్నట్టు కనపడుతూ ఉంది. మీ గురించి వివరంగా చెప్పండి. మీ మాటలు నేను మా రాజుకు చెప్పాలి కదా!" అని అన్నాడు హనుమంతుడు.

అప్పుడు లక్ష్మణుడు హనుమంతునితో ఇలా అన్నాడు. "ఓహనుమా! ఈయన పేరు రాముడు. ఇక్ష్వాకు వంశములో జన్మించిన అయోధ్యాధిపతి దశరథుని పెద్ద కుమారుడు. గుణవంతుడు, రాజ్యము చేయుటకు అర్హుడు. కాని ఒకానొక కారణమున రామునికి రాజ్యము లభించలేదు. పైగా అరణ్యవాసము సంప్రాప్తించింది. రాముని భార్యపేరు సీత. సూర్యుని విడిచి కాంతి ఉండలేనట్టు, రాముని భార్య సీతకూడా, భర్తను విడిచి ఉండలేక, రామునితోపాటు అరణ్యములకు వచ్చింది.

కిష్కింధా కాండము

నేను రాముని తమ్ముడను. నా పేరు లక్ష్మణుడు. నేను నా అన్న వదిలను సేవించుకుంటూ వారి వెంట అరణ్యములకు వచ్చాను. మేము పర్ణశాలలో లేని సమయమున, సీత ఒంటరిగా ఉన్నప్పుడు, మాయావి అయిన ఒక రాక్షసుడు రాముని భార్య సీతను అపహరించాడు. మేము సీతను వెతుకుతూ ఉండగా, మా తండ్రి దశరథునికి మిత్రుడు అయిన జటాయువు అనే పక్షిరాజు కనిపించి, సీతను రావణుడు అనే రాక్షసుడు అపహరించి, దక్షిణ దిక్కుగా ఆకాశమార్గమున తీసుకొని వెళ్లాడు అని చెప్పాడు.

తరువాత మేము అడవిలో సీతను గూర్చి వెతుకుతూ ఉండగా, దనువు అనే వాడు శాపవశమున వికృతాకారముతో మమ్ములను కబళించడానికి ప్రయత్నించాడు. అతని వలన మాకు మీ రాజు సుగ్రీవుని గురించి తెలిసింది. సీతను అపహరించిన వారి గురించి తెలుసుకొనడంలో సుగ్రీవుడుసామర్థ్యము కలవాడు అని అతడు మాకు తెలిపాడు. సుగ్రీవుని వెతుకుతూ మేము ఇక్కడకు వచ్చాము.

నీ ప్రశ్నలకు సమాధానంగా నేను మా గురించి, ఇక్కడకు మా రాక గురించి వివరంగా చెప్పాను. మేము మీ రాజు సుగ్రీవుని సహాయము కోరుతున్నాము. నేను, రాముడు మీ రాజు సుగ్రీవుని శరణు పొందాము. అయోధ్యాధిపతిగా ఉన్నప్పుడు ఏ రాముడు తన ప్రజలకు ధనకనకవస్తువాహనములను విరివిగా పంచి పెట్టాడో, ఏ రాముడు ముల్లోకములకు రక్షకుడో ఆ రాముడు మీ రాజు సుగ్రీవుని సహాయము కోరుతున్నాడు. ఏ దశరథుడు అందరికీ శరణాగత రక్షకుడుగా ఉండేవాడో, ఆ దశరథకుమారుడు రాముడు మీ రాజు

సుగ్రీవుని శరణు కోరుతున్నాడు. ధర్మాన్ని పాలిస్తూ, లోకమునకు రక్షణ అందించిన నా రాముడు మీ రాజు సుగ్రీవుని శరణు కోరుతున్నాడు. ఏ రాముని అనుగ్రహంతో అయోధ్యాప్రజలు సుఖంగా ఉన్నారో ఆ రాముడు మీ రాజు సుగ్రీవుని అనుగ్రహాన్ని కాంక్షిస్తున్నాడు. ఏ దశరథ మహారాజు తన సామంతురాజులందరినీ అనుగ్రహదృష్టితో చూస్తుంటాడో, ఆ దశరథ మహారాజు కుమారుడు, రాముడు మీ రాజు సుగ్రీవుని అనుగ్రహ వీక్షణాల కోసం ఎదురు చూస్తున్నాడు. తన భార్య సీతా వియోగంతో బాధపడుతున్న రాముని మీద మీ రాజు సుగ్రీవుడు తన అనుగ్రహం చూపాలి." అని దీనంగా ప్రార్థించాడు లక్ష్మణుడు.

(పైనచెప్పబడిన లక్ష్మణుని దీనాలాపములు ప్రాచ్యప్రతిలో లేవు. ధీరోదాత్తుడైన లక్ష్మణుడు ఈ మాదిరి దీనంగా మాట్లాడటం అనుచితంగా ఉంది. కాబట్టి ఇవి తరువాత చేర్చబడినవిగా ఊహింపబడుతూ ఉంది.)

లక్ష్మణుని మాటలు విన్న హనుమంతుడు చాలా సంతోషించాడు. "మా సుగ్రీవుడు మీతో తప్పకుండా మైత్రి చేస్తాడు. సుగ్రీవుడు కూడా బాధలలో ఉన్నాడు. సుగ్రీవుడు తన అన్న వాలితో వైరము పెట్టుకున్నాడు. ఎందుకంటే, వాలి తన తమ్ముడు సుగ్రీవుని భార్యను అపహరించాడు. సుగ్రీవుని అవమానించాడు. రాజ్యము నుండి వెళ్లగొట్టాడు. మీ మాదిరి మా రాజు సుగ్రీవుడు కూడా అరణ్యములలో దీనంగా కాలం గడుపుతున్నాడు. మా రాజు సుగ్రీవుడు మాతో కలిసి సీతను వెదకడంలో మీకు సాయపడగలడు. మేమందరమూ కలిసి సీతను వెదుకుతాము. రండి మనం అందరము మా రాజు సుగ్రీవుని వద్దకు వెళదాము." అని అన్నాడు హనుమంతుడు.

ఆ మాటలు విన్న లక్ష్మణుడు రాముని చూచి "రామా! సుగ్రీవునికి కూడా మన అవసరము ఉంది. మనకూ సుగ్రీవుని అవసరము ఉంది. కాబట్టి మన కార్యము సఫలము అయినట్టే. ఇతని మాటలు ముఖ కళవళికలు చూస్తుంటే నాకు ఇతని మీద నమ్మకం కలుగుతూ ఉంది. ఇతని ముఖం చూస్తే ఇతడు అబద్ధం ఆడతాడు అని అనిపించడం లేదు. మనం వీరితో స్నేహం చేయవచ్చు." అని అన్నాడు లక్ష్మణుడు.

ఇంతలో హనుమంతుడు తన సన్యాసి రూపము విడిచి తన నిజరూపము అయిన వానర రూపము ధరించాడు. శరీరం పెంచాడు. రామలక్ష్మణులను తన బుజాల మీద ఎక్కించుకొని సుగ్రీవుని వద్దకు తీసుకొని వెళ్లాడు. హనుమంతుడు కూడా తన రాజు సుగ్రీవునికి మరలా రాజ్య ప్రాప్తి కలుగుతుందనే సంతోషంతో రామలక్ష్మణులను సుగ్రీవుని వద్దకు తీసుకొని వెళ్లాడు.

శ్రీమద్రామాయణము,
కిష్కింధా కాండము నాలుగవ సర్గ సంపూర్ణము
ఓం తత్సత్ ఓం తత్సత్ ఓం తత్సత్

కిష్కింధా కాండము
ఐదవ సర్గ.

హనుమంతుడు రామలక్ష్మణులను తన బుజముల మీద ఎక్కించుకొని ఋష్యమూక పర్వతము నుండి మలయ పర్వతమునకు తీసుకొని వెళ్లాడు. రామలక్ష్మణులను మలయ

పర్వతము మీద దించి, సుగ్రీవుని వద్దకు వెళ్లాడు.

"ఓ సుగ్రీవా! వీరు రాముడు లక్ష్మణుడు అనే పేర్లు గల రాజకుమారులు. నేనే వీరిని నా వెంట తీసుకొని వచ్చాను. రాముడు మహా పరాక్రమ వంతుడు. రాముడు ఇక్ష్వాకు వంశములో పుట్టిన వాడు. ధర్మము తెలిసిన వాడు. దశరథుని కుమారుడు. తండ్రి ఆజ్ఞప్రకారము వనవాసము చేస్తున్నాడు. రాముడు వనవాసము చేయుచుండగా రావణుడు అనే రాక్షసుడు ఈయన భార్య సీతను అపహరించాడు. ఆ రాముడు ప్రస్తుతము నీ శరణు కోరుతున్నాడు. రాముడు, లక్ష్మణుడు నీతో స్నేహము చేయవలెనని అభిలషిస్తున్నారు. వీరి స్నేహమును అంగీకరించు. దీని వలన మీ ఇద్దరికీ లాభము చేకూరుతుంది. వీరిరువురూ పూజింప తగిన వారు. వీరిని మిత్రులుగాస్వీకరించి పూజించు." అని పలికాడు హనుమంతుడు.

ఆ మాటలు విన్న సుగ్రీవుడు చాలా సంతోషించాడు. రాముని చూచి ఇలా అన్నాడు. "ఓ రామా! మీ గుణగణముల గురించి హనుమంతుడు నాతో చెప్పాడు. మీరు ఉత్తమ మానవులు. నేను వానరుడను. ఈ వానరుడితో స్నేహము కోరుతున్నారంటే, ఇది మీరు నాకు చేస్తున్న సత్కారముగా భావిస్తున్నాను. మీకు నాతో స్నేహం చేయడం ఇష్టం అయితే, నా చేతులు మీకోసం చాస్తున్నాను. మీ చేతితో నా చేతిని తాకండి. కరచాలనం చెయ్యండి." అని అన్నాడు సుగ్రీవుడు.

సుగ్రీవుడు పలికిన పలుకులు విన్న రాముడు చాలా సంతోషించాడు. సుగ్రీవుని హస్తము పట్టుకున్నాడు. సుగ్రీవునితో స్నేహం

అంగీకరించాడు. సుగ్రీవుని గాఢంగా కౌగలించుకున్నాడు. ఈ సన్నివేశము చూచి హనుమంతుడు చాలా ఆనందించాడు. రెండు కర్రలతో నిప్పుపుట్టించాడు. అగ్ని రగిల్చాడు. ఆ అగ్నిని రాముడు సుగ్రీవుని మధ్య ఉంచాడు. రాముడు, సుగ్రీవుడు ఆ అగ్ని చుట్టు ప్రదక్షిణము చేసారు. అగ్నిసాక్షిగా రాముడు సుగ్రీవులు మిత్రులయ్యారు.

సుగ్రీవుడు రామునితో ఇలా అన్నాడు. “మనము ఇద్దరమూ సమానమైన దు:ఖములో ఉన్నాము. ఒకరి దు:ఖములను ఒకరం పంచుకుందాము. ఇకమీదట మన సుఖదు:ఖములను సమానంగా పంచుకుందాము.” అని అన్నాడు సుగ్రీవుడు. సుగ్రీవుడు పక్కనే ఉన్న సాల వృక్షము నుండి ఒక కొమ్మను విరిచాడు. కింద పరిచాడు. రాముడు సుగ్రీవుడు దాని మీద కూర్చున్నారు. తరువాత హనుమంతుడు ఒక చందన వృక్షము కొమ్మను తెచ్చి లక్ష్మణునికి కానుకగా ఇచ్చాడు. సుగ్రీవుడు రాముని చూచి ఇలా అన్నాడు.

“ఓ రామా! నా అన్న వాలి నన్ను చాలా అవమానించాడు. నాతో శతృత్వము పెంచుకున్నాడు. నా నుండి నా భార్యను లాక్కున్నాడు. నన్ను రాజ్యము నుండి తరిమేసాడు. నేను, నా అన్న వాలికి భయపడి, అపరిమిత మైన దు:ఖమును అనుభవిస్తూ, ఈ ఋష్యశృంగ పర్వతము మీద నివసిస్తున్నాను. రామా! ఇప్పుడు నాకు నీ అభయము కావాలి. నాకు వాలి నుండి రక్షణ కావాలి. నా రాజ్యము నాకు కావాలి. నా భార్య నాకు కావాలి. ఇదంతా నీ వల్లే జరగాలి.” అని అన్నాడు సుగ్రీవుడు.

రాముడు సుగ్రీవుని మాటలకు నవ్వుతూ ఇలా అన్నాడు.

“నేను నీకు తప్పకుండా సాయము చేస్తాను. నీ భార్యను అపహరించిన వాలిని చంపి నీ భార్యను నీకు తెచ్చి అప్పగిస్తాను. ఈ బాణములు చూచావు కదా. ఇవి అమోఘమైనవి. వీటితో వాలిని వధిస్తాను.” అని అన్నాడు రాముడు.

రాముని మాటలు విని సుగ్రీవుడు పరమానంద భరితుడయ్యాడు. “ఓ రామా! నీ మాటలు వింటుంటే నాకు నా భార్యను తిరిగి పొందినంత ఆనందంగా ఉంది. నాకు వాలి వలన కలిగిన భయాన్ని శాశ్వతంగా తొలగించు. వాలి నన్ను మరలా ఎటువంటి బాధ పెట్టకుండా చెయ్యి.” అని అన్నాడు సుగ్రీవుడు.

శ్రీమద్రామాయణము
కిష్కింధా కాండము ఐదవ సర్గ సంపూర్ణము
ఓం తత్సత్ ఓం తత్సత్ ఓం తత్సత్

కిష్కింధా కాండము
ఆరవ సర్గ.

సుగ్రీవుడు రాముని చూచి ఇలా అన్నాడు. “రామా! నీ గురించి హనుమంతుడు నాకు అంతా చెప్పాడు. నీవు నీ సోదరుడు లక్ష్మణుడు ఈ అరణ్యవాసము ఎందుకు చేస్తున్నారో వివరంగా చెప్పాడు. నీ భార్య సీతను మీరు లేని సమయమున ఒక రాక్షసుడు అపహరించిన విషయం కూడా చెప్పాడు. నీవు నాకు మిత్రుడవు అయినావు. ఇంక నీ దు:ఖమును విడిచి పెట్టు. నీ భార్య సీత ఎక్కడ

ఉన్నా వెతికి తీసుకొని వచ్చి నీకు అప్పగిస్తాను. నీ దు:ఖాన్ని తొలగిస్తాను. నీ భార్య ఆకాశములో ఉన్నా, పాతాళములో ఉన్నా వెతికి తీసుకొని వస్తాను. ఇది సత్యము. నేను మాట తప్పను.

రామా! నీవు చెబుతుంటే నాకు ఒక విషయం గుర్తుకు వస్తూ ఉంది. ఒక రోజు మేమందరమూ ఈ పర్వత శిఖరము మీద కూర్చుని ఉండగా ఒక రాక్షసుడు ఒక స్త్రీని అపహరించుకు పోవడం, ఆమె రామా, రామా అని అరవడం మేము చూచాము. ఆమె సీతయే. సందేహము లేదు. ఆ రాక్షసుడు రావణుడు అయి ఉంటాడు. ఆమె అలా ఏడుస్తూ తన పైనున్న వస్త్రములో కొన్ని ఆభరణములను మూటగా కట్టి జారవిడిచినది. ఆ మూట మా దగ్గర పడింది. మేము వాటిని మా దగ్గరే ఉంచాము. వాటిని నీకు చూపిస్తాను. ఆ ఆభరణములను నీవు గుర్తు పట్టగలవేమో చూడు."అని అన్నాడు సుగ్రీవుడు.

ఆ మాటలు విని రాముడు ఉత్సాహంగా "మిత్రమా! ఆ ఆభరణములు వస్త్రము త్వరగా తీసుకొనిరా. నా సీత ఆభరణములు, వస్త్రము నేను చూడాలి." అని ఆతురతగా అన్నాడు రాముడు.

సుగ్రీవుడు వెంటనే పక్కనేఉన్న గుహలోకి వెళ్లాడు. క్షణములో ఒక ఉత్తరీయములో కట్టబడిన ఆభరణములను తీసుకొని వచ్చాడు. "రామా! ఇదే ఆ వస్త్రము. ఇవే ఆ ఆభరణములు. చూడు. ఇవి నీ భార్య సీతకు చెందినవేమో!"అని అన్నాడు.

రాముడు ఆ ఉత్తరీయమును, ఆభరణములను చూచాడు. రాముని కళ్లనిండా నీళ్లు కమ్మాయి. ఏమీ కనిపించడం లేదు మనసు

వశం తప్పింది. "హా సీతా!" అంటూ కిందపడి పోయాడు. రాముడు ఆ ఆభరణములను ఉత్తరీయమును తన గుండెలకు హత్తుకున్నాడు. రాముని శ్వాస భారంగా వస్తూ ఉంది. నోట మాట రావడం లేదు. ఉద్వేగంతో ఉన్నాడు. రాముని కళ్ల నుండి నీరు ధారాపాతంగా కారుతూ ఉంది. ఏడుస్తూ లక్ష్మణుని వంక చూచాడు.

"లక్ష్మణా! సీతను ఆ రాక్షసుడు అపహరించుకు పోతున్నప్పుడు సీత జారవిడిచిన ఆభరణములు, ఉత్తరీయము చూడు. ఇవి మెత్తని గడ్డి మీద పడి ఉంటాయి. అందుకనే విరిగిపోకుండా ఉన్నాయి. లక్ష్మణా! సీత ఆభరణములను నీవు గుర్తు పట్టగలవా!"అని అడిగాడు. అప్పుడు లక్ష్మణుడు రామునితో ఇలా అన్నాడు.

"రామా! నాకు సీత ధరించే ఏ ఆభరణముల గురించి అంతగా తెలియదు. నేను ప్రతిరోజూ ఆమెకు పాదాభివందనము చేయునపుడు ఆమె కాళ్లకు ధరించే నూపురములు చూస్తూ ఉంటాను. కాబట్టి అవి మాత్రమే గుర్తు పట్టగలను." అని అన్నాడు. (లక్ష్మణుడు చెప్పినట్టుగా రాయబడి ఉన్న ఈ శ్లోకము ప్రాచ్య ప్రతిలో లేదు అని పండితుల అభిప్రాయము.)

ఆ ఆభరణములను చూచి రాముడు సుగ్రీవునితో ఇలా అన్నాడు. "సుగ్రీవా! ఇవి నిస్సంశయముగా నా సీత ఆభరణములే. ఇది నా సీత ధరించిన ఉత్తరీయము. సీతను అపహరించిన ఆ రాక్షసుడు సీతను ఏ దేశమునకు తీసుకొని వెళ్లాడో చెప్పగలవా? ఆ రాక్షసుడు ఎక్కడ ఉంటాడో చెప్పగలవా? వాడి మూలంగా రాక్షస జాతి అంతా సర్వనాశనం అవుతుంది. ఇది సత్యము. సీతను అపహరించి ఆ

రాక్షసుడు తన మృత్యువును తానే కొని తెచ్చుకున్నాడు. సుగ్రీవా! చెప్పు. ఆ రాక్షసుడి గురించిన వివరాలు చెప్పు. వాడు ఎక్కడ ఉంటాడో చెప్పు. ఇప్పుడే వాడిని సంహరిస్తాను." అని కోపావేశంతో ఊగిపోతూ అన్నాడు రాముడు.

శ్రీమద్రామాయణము
కిష్కింధాకాండము ఆరవ సర్గ సంపూర్ణము
ఓం తత్సత్ ఓం తత్సత్ ఓం తత్సత్

కిష్కింధాకాండము
ఏడవ సర్గ

రాముని పలుకులు విన్న తరువాత సుగ్రీవునకు కూడా దు:ఖము ముంచుకొచ్చింది. దు:ఖముతో పూడుకుపోయిన గొంతుతో సుగ్రీవుడు ఇలా అన్నాడు.

"రామా! సీతను అపహరించిన ఆ రాక్షసుని నివాసము గానీ, వాడి పరాక్రమము గానీ, బలము కానీ నాకు తెలియదు. కాని నా శాయశక్తులా ప్రయత్నించి వాడిని గురించి తెలుసుకుంటాను. నీ దు:ఖమును విడిచి పెట్టు. నన్ను నమ్ము. నిశ్చింతగా ఉండు. నీ భార్యను నీకు తెచ్చి ఇచ్చే బాధ్యత నాది. ఇదే నా ప్రతిజ్ఞ. నీవు అతి త్వరలో సీతను అపహరించిన ఆ రావణుడు అనే రాక్షసుని చంపి సీతను పొందు తావు.

కాని ముందు నీవు ఈ దు:ఖమును, దీనత్వమును, వదిలి

పెట్టు. ధైర్యము అవలంబించు. నీ పరాక్రమాన్ని, వీరత్వాన్ని గుర్తుకు తెచ్చుకో. నీ వలెనే నా భార్యను కూడా ఎత్తుకు పోయారు. కానీ నేను నీ వలె దు:ఖించడం లేదు. క్రుంగి పోవడం లేదు. ధైర్యము విడిచి పెట్టలేదు.   నా భార్యను ఎత్తుకుపోయిన వాలిని ఎలా చంపాలా అని ఆలోచిస్తున్నాను. నా వంటి సాధారణ వానరుడే పోయిన భార్యను గురించి చింతించడం లేదంటే ఇంక నీ వంటి ధీరోదాత్తుడు, పరాక్రమవంతుడు, పండితుడు ఇలా దీనంగా భార్యకోసరం ధైర్యాన్ని విడనాడి దు:ఖించడం ఏమాత్రం తగదు.

బుద్ధిమంతుడైన వాడు ఆపదలలో గానీ, ధన నష్టము సంభవించి నప్పుడు గానీ, ప్రాణాపాయ స్థితిలో గానీ, ధైర్యమును విడిచిపెట్టడు. దు:ఖించడు. బుద్ధికి పదును పెట్టి తగిన ఉపాయము గురించి ఆలోచిస్తాడు. అలా కాకుండా మూర్ఖత్వముతో ఎల్లప్పుడూ దీనత్వముతో ఉండేవాడు, తన మనసును తన అధీనములో ఉంచుకోలేక, నడి సముద్రంలో నావలాగా మునిగిపోతాడు. కాబట్టి ఓ రామా! ఒక స్నేహితుడుగా నిన్ను వేడుకుంటున్నాను. దీనత్వాన్ని వదిలిపెట్టు. శోకానికి స్వస్తి చెప్పు. బుద్ధికి పదునుపెట్టు. పౌరుషాన్ని తెచ్చుకో. ఎందుకంటే అనుక్షణం శోకంతో కుమిలిపోయేవాడికి సుఖం ఎంతో దూరంలో ఉంటుంది. శోకార్తునకు అన్నీ సందేహాలే కలుగుతాయి. వాడు ఏ పనీ సక్రమంగా చెయ్యలేడు. ధైర్యవంతుడు అన్ని పనులు సక్రమంగా నిర్వహించగలడు. రామా! నేను నీకు నీతులు ఉపదేశించడం లేదు. కేవలం ఒక స్నేహితుడుగా నీ దు:ఖాన్ని పోగొట్టడానికి ప్రయత్నిస్తున్నాను.” అని సుగ్రీవుడు రామునికి సాంత్వన చేకూర్చడానికి ప్రయత్నించాడు.

కిష్కింధా కాండము

సుగ్రీవుని మాటలకు రాముడు స్వస్థత పొందాడు. సుగ్రీవుని కౌగలించుకొని ఇలా అన్నాడు. "మిత్రమా సుగ్రీవా! నా హితమును కోరే స్నేహితుడు ఎలా చేస్తాడో అదే నువ్వు చేసావు. నీ సాంత్వన వచనములతో నాకు స్వస్థత లభించింది. నీ వంటి స్నేహితుడు, బంధువు నాకు దొరికినందుకు చాలా ఆనందంగా ఉంది. నీవు నాకు ఇచ్చిన మాట ప్రకారము, సీతను, ఆ రావణుడు అనే రాక్షసుని వెతికే ప్రయత్నం చెయ్యాలి. దానికి ప్రతిఫలంగా నేను నీకు ఏం చెయ్యాలో వివరంగా చెప్పు. మన ఇరువురి కార్యములు సఫలం అవుతాయి అనే నమ్మకం నాకు ఉంది. నా సాయం గురించి నీవు సందేహించకు. నేను ఇప్పటి దాకా అబద్ధము చెప్పలేదు. ఇంక మీదట చెప్పను కూడా. నీకు సాయం చేస్తాను అని ప్రతిజ్ఞచేస్తున్నాను." అని అన్నాడు రాముడు.

రాముని మాటలు విని సుగ్రీవుడు, హనుమంతుడు ఎంతో సంతోషించారు. రాముడు చేసిన ప్రతిజ్ఞను విని సుగ్రీవుడు తన పని సఫలం అయినట్టే అని ఎంతో సంతోషించాడు. తరువాత రాముడు, సుగ్రీవుడు ఒక ఏకాంత ప్రదేశములో కూర్చుని తమ కష్టసుఖములు ఒకరితో ఒకరు చెప్పుకున్నారు.

శ్రీమద్రామాయణము
కిష్కింధాకాండము
ఏడవ సర్గ సంపూర్ణము
ఓం తత్సత్ ఓం తత్సత్ ఓం తత్సత్

కిష్కింధాకాండము

ఎనిమిదవ సర్గ .

అలా మాట్లాడు కోడంలో సుగ్రీవుడు తనకూ, తన అన్న వాలికి శత్రుత్వము ఎందుకు వచ్చిందీ అన్న విషయం రామునితో చెప్పసాగాడు. “ఓ రామా! నీవు నా స్నేహితుడవు కావడం నా అదృష్టం. దేవతలు నా మీద కరుణ చూపడం వలననే నీవు నా మిత్రుడివి అయ్యావు. నీవు నాకు మిత్రుడుగా, నాకు అండగా ఉంటే నేను ఒక్క కిష్కింధా రాజ్యమే కాదు, స్వర్గలోక ఆధిపత్యము కూడా పొందగలను.

ఓ రామా! నీతో స్నేహం చేయడం వలన నాకు నా బంధుమిత్రులలో గౌరవం పెరిగింది. నా గురించి, నా గుణగణముల గురించి నేను చెప్పుకోకూడదు కానీ, నేను నీకు మంచి స్నేహితుడిని అవుతాను అని మాత్రం చెప్పగలను. ఎందు కంటే అతడు ధనికుడైనా, పేద వాడైనా, సుఖాలలో మునిగి తేలుతున్నా, దు:ఖాలలో కుంగి పోతున్నా, మంచి వాడైనా, చెడ్డ వాడైనా, ఎటువంటి వాడికైనా స్నేహితుడే దిక్కు. స్నేహమునకు మించినది ఈ లోకములో ఏదీ లేదు. స్నేహాన్ని గురించి బాగా తెలిసిన వాళ్లు తన స్నేహితుని కొరకు ధనమును గానీ, సుఖములను గానీ, సంపదలను కానీ ఆఖరుకు ఉన్న ఊరును కానీ, త్యజించుటకు వెనుకాడరు. అటువంటి స్నేహము మనది.”అని అన్నాడు సుగ్రీవుడు. రాముడు నవ్వి “మిత్రమా! నువ్వు చెప్పినది యదార్థము.” అని అన్నాడు.

(స్నేహాన్ని గురించి వాల్మీకి ఇచ్చిన అద్భుత నిర్వచనము ఈ నాటికీ అనుసరణీయము. మన సినిమా రచయితలు తమ డైలాగులలో వాల్మీకి చెప్పిన పదాలనే అటు ఇటు తిప్పి తిప్పి వల్లె వేస్తుంటారు).

కిష్కింధా కాండము

“రామా! నా సోదరుడు వాలి నన్ను అవమానించాడు. నా భార్యను నా నుండి లాక్కున్నాడు. నన్ను రాజ్యము నుండి వెళ్ల గొట్టాడు. వాలికి భయపడి నేను ఇక్కడ తలదాచుకున్నాను. కాబట్టి నీవు నాకు ఉపకారము చెయ్యాలి” అని మరలా గుర్తు చేసాడు సుగ్రీవుడు.

“మిత్రమా! స్నేహమునకు ఫలము ఒకరికి ఒకరు సాయం చేసుకోవడమే కదా! ఒకరికి ఒకరు అపకారము చేసుకోవడం శత్రువుల లక్షణము. నేను నీ మిత్రుడను కాబట్టి నీకు అపకారము చేసిన వారిని వధించి, నీకు మేలు చేస్తాను.” అని తన ప్రతిజ్ఞను గుర్తు చేసాడు రాముడు.

సుగ్రీవుడు చాలా దీన స్థితిలో ఉన్నాడు అందుకని రామునికి పదే పదే గుర్తు చేస్తున్నాడు. వానరులు చపల స్వభావులు కదా! “రామా! నీవు నా స్నేహితుడవు. అందుకని నా కష్టములను నీతో చెప్పుకుంటున్నాను. సాయం చెయ్యమని పదే పదే అడుగుతున్నాను. ఏమీ అనుకోకు. నీతో నా కష్టములు అన్నీ చెప్పాలని ఉంది. కాని నోరు పెగలడం లేదు.” అని కళ్ల నిండా కన్నీరు కారుస్తున్నాడు సుగ్రీవుడు. అతి కష్టం మీద తన దు:ఖమును ఆపుకుంటూ, సుగ్రీవుడు రామునితో ఇలా అన్నాడు.

“నీకు చెప్పాను కదా! వాలి నా అన్న. చాలా బలవంతుడు. నన్ను తిట్టాడు. అవమానించాడు. రాజ్యము నుండి వెళ్ల గొట్టాడు. నేను నా భార్యను నా ప్రాణం కంటే ఎక్కువగా ప్రేమించాను. అటువంటి భార్యను నా నుండి దూరం చేసాడు. నా అన్న వాళ్లందరినీ బంధించాడు. నన్ను చంపడానికి ఎంతో మందిని పంపాడు. నేను

వారి నందరినీ చంపాను. అందుకే నిన్ను చూచినప్పుడు కూడా నీవు వాలి పంపిన వాడివి అని అనుమానించాను. భయపడ్డాను.

శరీరంలో భయం ఉంటే, దేనిని చూచి అయినా భయపడడం, మానవ స్వభావము కదా! ఇంక మా వానరుల సంగతి చెప్పాలా! ఇదుగో! హనుమంతుడు మొదలగు వారు నా వెంట ఉన్నారు కాబట్టి ధైర్యంగా ఉండగలుగుతున్నాను. వీళ్లే నేను నమ్మిన స్నేహితులు. అనుక్షణం నన్ను కంటికి రెప్పలా కాపాడుతున్నారు. ఇదీ నా వృత్తాంతము. ఇంతకన్నా వివరాలు అనవసరము అనుకుంటున్నాను.

వాలి నాకు శత్రువు. వాలి నా సోదరుడే అయినప్పటికీ, వాలి చస్తేనే గానీ నా దు:ఖము ఉపశమించదు. నా సమస్తదు:ఖములకు కారకుడు వాలి. నా సుఖజీవనము వాలి మరణం మీద ఆధారపడి ఉంది. రామా! నా దు:ఖమునకు కారణము, నా దు:ఖము ఎలా తీరుతుందో వివరంగా చెప్పాను. కష్టాలలో ఉన్న మిత్రుడికి మిత్రుడే గతికాబట్టి, ఒక మిత్రుడుగా నాకు సాయం చెయ్యి." అని అన్నాడు సుగ్రీవుడు.

రాముడికి ఒక విషయం బోధపడటం లేదు. సుగ్రీవుడు ఇన్ని విషయాలు చెబుతున్నాడు కానీ అసలు తనకూ, వాలికీ ఎందుకు వైరం వచ్చిందో చెప్పడం లేదు. అడిగితే గానీ చెప్పేట్టు లేడు అని అనుకున్నాడు.

"మిత్రమా! సుగ్రీవా! నీకూ నీ అన్న వాలికీ వైరం ఎందుకు, దేని గురించి, ఏ కారణం చేత కలిగింది. వివరంగా చెప్పు. అప్పుడు

మీ ఇద్దరిలో తప్పు ఒప్పు నిర్ణయించడానికి వీలు కలుగుతుంది. అసలు వైరకారణం తెలిస్తే గానీ, మా బలాబలములను సరి చూచుకోడానికి వీలు ఉండదు కదా! అప్పుడు వాలిని సులభంగా అంతమొందించ వచ్చును. నీకు నీ అన్న వలన జరిగిన అవమానమును విని నాకూ కోపం తారస్థాయిని చేరుకుంది. నేను నీ అన్నను చంపేలోగా మీ ఇద్దరి మధ్య ఉన్న వైరమునకు కారణం తెలుసుకోగోరుతున్నాను. నా మీద విశ్వాసము ఉంచి మీ ఇరువురి మధ్య ఉన్న విరోధమునకు కారణం చెప్పు" అని అన్నాడు రాముడు.

ఇంక తప్పదని సుగ్రీవుడు రామునికి తనకు అన అన్న వాలితో ఎందుకు విరోధము వచ్చిందో వివరంగా చెప్పనారంభించాడు.

శ్రీమద్రామాయణము
కిష్కింధాకాండము ఎనిమిదవ సర్గ సంపూర్ణము
ఓం తత్సత్ ఓం తత్సత్ ఓం తత్సత్

కిష్కింధా కాండము
తొమ్మిదవ సర్గ.

"రామా! వాలి, నేను, అన్నదమ్ములము. వాలి అంటే మా నాన్న గారికి ఎంతో ప్రేమ. నాకు కూడా వాలి అంటే ఎంతో ప్రేమ, అభిమానము. నా తండ్రి గారు చనిపోయిన తరువాత, పెద్ద కుమారుడు అయిన వాలిని కిష్కింధా రాజ్యమునకు పట్టాభిషిక్తుని చేసారు. వంశపారంపర్యముగా వచ్చిన రాజ్యమును వాలి పరిపాలిస్తూ ఉంటే, నేను వాలికి సేవకునిలా అతనిని సేవించేవాడిని. మయునికి

ఇద్దరు కుమారులు. వారు మాయావి, దుందుభి. మాయావికి, మా అన్న వాలికి ఒక స్త్రీమూలకంగా విరోధము ఏర్పడింది. ఒకరోజు అర్థ రాత్రి అందరమూ నిద్రపోతున్నాము. అప్పుడు మాయావి మా కోట వద్దకు వచ్చి పెద్దగా అరుస్తూ వాలిని యుద్ధానికి పిలిచాడు. పరాక్రమ వంతుడైన వాలి మాయావితో యుద్ధానికి సన్నద్ధుడయ్యాడు. అర్థరాత్రి శత్రువు యుద్ధానికి వచ్చాడంటే అందులో ఏదో మర్మం ఉంటుందని ఎంత నచ్చచెప్పినా వినకుండా వాలి మాయావితో యుద్ధానికి వెళ్లాడు. నేను కూడా వాలితో పాటు వెళ్లాను.

మా ఇద్దరినీ చూచి మాయావి పారిపోయాడు. నేను, వాలి, మా అనుచరులతో మాయావిని వెంబడించాము. ఆ మాయావి భూమిలో ఉన్న సొరంగములోకి ప్రవేశించాడు. ఆ సొరంగము గడ్డితో కప్పబడి ఉంది. నేను వాలి బయట నిలబడ్డాము. అప్పుడు వాలి నాతో ఇలా అన్నాడు. “తమ్ముడా! సుగ్రీవా! నేను ఈ బిలములో ప్రవేశించి, శత్రువును చంపి వస్తాను. నేను వచ్చువరకూ నీవు ఈ బిలము వద్ద నా కోసం వేచి ఉండు.” అని అన్నాడు.

దానికి నేను ఒప్పుకోలేదు. నేను కూడా తన వెంట వస్తానని ఎంత బతిమాలుకున్నా వాలి వినలేదు. తాను ఒక్కడే ఆ సొరంగము లోకి వెళ్లాడు. నేను సొరంగము బయట నిలబడి ఉన్నాను. దాదాపు ఒక సంవత్సర కాలము గడిచిపోయింది. వాలి బయటకు రాలేదు. నేను ఓపికగా ఆ సంవత్సరకాలము సొరంగము బయట వేచి ఉన్నాను. నాలో ఏదో శంక మొదలయింది. వాలి మహావీరుడు. కానీ సంవత్సరకాలము రాకపోవడంతో నామనసు కీడు శంకించింది. అయినా గుండె నిబ్బరంతో ఎదురు చూచాను.

కిష్కింధా కాండము

కొంత కాలానికి ఆ సొరంగము నుండి నురుగతో కూడిన రక్తం మడుగులాగా బయటకు ప్రవహించింది. రాక్షసులు గట్టిగా అరుస్తున్నట్టు ధ్వనులు వినబడ్డాయి. కాని నా సోదరుడు అరుస్తున్న గొంతు వినబడలేదు. నా సోదరుడు వాలి ఆ రాక్షసుని చేతిలో చంపబడినట్టు నిర్ధారణ చేసుకున్నాను. ఇంక అక్కడ ఉండి చేసేది ఏమీ లేకపోవడంతో, నేను ఆ బిలమును పెద్ద పెద్ద బండ రాళ్లతో మూసి వేసాను. నా అన్న వాలికి జలతర్పణములు కూడా విడిచాను. తరువాత కిష్కింధకు తిరిగి వచ్చాను.

నా అన్న వాలి మరణాన్ని ఎవరికీ చెప్పకుండా దాచి పెట్టాను. కాని మంత్రులు ఆ విషయాన్ని పసిగట్టారు. తెలుసుకున్నారు. నేను ఎంత వద్దన్నా, అందరూ కలిసి నన్ను ఈ కిష్కింధకు రాజ్యాభిషిక్తుని చేసారు. ఆ విధంగా నేను కిష్కింధకు రాజునై ధర్మంగా పరిపాలిస్తున్నాను.

ఇంతలో వాలి ఆ రాక్షసుడు మాయావిని చంపి కిష్కింధకు తిరిగి వచ్చాడు. నన్ను కిష్కింధకు రాజుగా చూచాడు. తట్టుకోలేక పోయాడు. నా మీద ఆగ్రహించాడు. నా మంత్రులను బంధించాడు.

నేను వాలి అంతటి పరాక్రమ వంతుడనైనా, అన్నగారి మీద గౌరవంతో నేను వాలిని ఎదిరించలేదు. నా అన్నకు అభివాదము చేసాను. గౌరవించాను. కాని వాలి నన్ను ఆదరించలేదు. నా మీద ఆగ్రహించాడు.

నేను వాలి పాదాల మీద పడి ప్రార్థించాను. కాని వాలికి నా మీద కోపం పోలేదు. నన్ను అనుగ్రహించలేదు.

శ్రీమద్రామాయణము
కిష్కింధాకాండము తొమ్మిదవ సర్గ సంపూర్ణము
ఓం తత్సత్ ఓం తత్సత్ ఓం తత్సత్

కిష్కింధాకాండము
పదవ సర్గ.

నేను నా అన్నకు జరిగిన విషయము వివరంగా చెప్పాను. నా మీద కోపగించవద్దని బతిమాలుకున్నాను.

“అన్నయ్యా! నేను చెప్పేది విను. నీవు మన శత్రువును సంహరించి విజయోత్సాహంతో తిరిగి వచ్చావు. నాకు చాలా సంతోషంగా ఉంది. మా కందరికీ ఇప్పటికీ నీవే రక్షకుడవు. నీవే ఈ సింహాసనము అధిష్టించు. నేను నీ వెనక నిలబడి ఛత్రము పట్టి నిల్చుంటాను. అన్నా! నీవు ఆదేశించినట్టు నేను ఆ బిలము బయట ఒక సంవత్సరము పాటు వేచి ఉన్నాను. నీవు రాలేదు. ఇంతలో ఆ బిలము లో నుండి రక్తం ఏరులుగా ప్రవహించింది. అది చూచి నాకు భయం వేసింది. నిన్ను ఆ రాక్షసుడు చంపి ఉంటాడని అనుకున్నాను. ఆ బిలమును పెద్ద పెద్ద బండరాళ్లతో మూసివేసాను. కిష్కింధకు తిరిగి వచ్చాను. నేను ఎంత వద్దన్నా, ఈ మంత్రులు నన్ను రాజును చేసారు. ఇది అన్నా జరిగిన సంగతి.

నేను ఈ కిష్కింధకు రాజుగా తగను. నీవే రాజువు. నీవు వచ్చేవరకూ నేను ఈ రాజ్యాన్ని నీ బదులు సంరక్షిస్తూ ఉన్నాను. ఇప్పుడు నీ రాజ్యమును నీకు అప్పగిస్తున్నాను. నేను ఇదివరకటి మాదిరి నిన్ను సేవిస్తూ ఉంటాను. నా మీద కోపించకు. శాంతం వహించు. నీ పాదాల పడి ప్రార్థిస్తున్నాను. అన్నయ్యా! మరొకసారి చెబుతున్నాను. నేను నాకుగా ఈ రాజ్యానికి అభిషిక్తునిగా కాలేదు. మంత్రులు, ప్రజలు, రాజ్యమునకు రక్షకుడు లేకుండా ఉండకూడదని, నన్ను రాజుగా చేసారు. ఇందులో నా తప్పు ఏమీ లేదు. ” అని ఎన్నోవిధాలుగా వాలిని వేడుకున్నాను.

కాని నా అన్న వాలి నా ప్రార్థనలను పెడచెవిని పెట్టాడు. నన్ను ఛీ కొట్టాడు. “ఏరా! ఒకనాడు అర్థరాత్రి మాయావి వచ్చి నన్ను యుద్ధానికి పిలిచాడు అని నీకు తెలుసు కదా! అప్పుడు వాడితో తలపడడానికి నేను వెళ్లాను కదా! అప్పుడు క్రూరుడవైన నీవు నా వెంట వచ్చావు కదా! మన ఇద్దరిని చూచి ఆ రాక్షసుడు పారిపోయాడు కదా! ఒకబిలములో ప్రవేశించాడు కదా! “నేను ఈ రాక్షసుడిని చంపి గానీ కిష్కింధకు తిరిగిరాను. నేను వచ్చువరకు నీవు ఈ బిలము బయట వేచి ఉండు” అని ఆదేశించి నేను ఆ బిలములో ప్రవేశిం చాను కదా!

నీవు బిలము వద్ద ఉన్నావు కదా అనే ధైర్యముతోనే కదా నేను బిలములోకి ప్రవేశించింది. నేను వాడి కోసరము సంవత్సరము పాటు వేచి ఉండి, వాడిని వాడి బంధుమిత్రులను సమూలంగా సంహరించాను. వారి రక్తముతో ఆ బిలము పూర్తిగా తడిసిపోయింది. నడవడానికి కూడా వీలు కాలేదు. అందువల్ల నేను బయటకు

రావడం ఆలస్యం అయింది. నేను బిలద్వారము దగ్గరకు వచ్చాను. కాని అది మూసి ఉంది. "సుగ్రీవా! సుగ్రీవా" అంటూ అరిచాను. కేకలు పెట్టాను. కాని నీవు అక్కడ లేవు. నాకు దు:ఖము వచ్చింది. ఎంతో ప్రయాస పడి నీవు బిలద్వారమునకు అడ్డుగా పెట్టిన రాళ్లను తొలగించి బయటకు వచ్చాను.

క్రూరుడు, దుర్మార్గుడు అయిన నా తమ్ముడు సుగ్రీవుడు నా అడ్డు తొలగించుకొని ఈ రాజ్యమును అపహరించవలెననే దురుద్దేశముతో నన్ను ఆబిలములో బంధించి, సమాధి చేసాడు అని అర్థం అయింది. ఇప్పుడు తెలిసిందా నీవు చేసిన తప్పు ఏంటో! కాబట్టి నీవు ఈ రాజ్యములో ఉండ తగవు." అంటూ నా అన్న వాలి నన్ను కట్టుబట్టలతో రాజ్యము నుండి వెడలగొట్టాడు. నా భార్యను తన వద్దనే ఉంచుకున్నాడు.

నేను వాలికి భయపడి ఈ భూమి అంతా చుట్టబెట్టాను. ఎక్కడా నాకు వాలి నుండి ఆశ్రయం దొరకలేదు. కారణాంతరాల వల్ల వాలి ఈ ఋష్యమూక పర్వతము మీదకు రాలేడని తెలిసింది. అందువల్ల ఇక్కడ తలదాచుకుంటున్నాను. రామా! విన్నావు కదా నా కథ. ఇందులో నా తప్పు ఏమీ లేకపోయినా, నా అన్న వాలి నన్ను రాజ్యభ్రష్టుని చేసాడు. నా భార్యను అపహరించాడు. వాలికి భయపడి నేను ఈ పర్వతము మీద నివసిస్తున్నాను." అని పలికాడు సుగ్రీవుడు.

రాముడు సుగ్రీవునితో ఇలా అన్నాడు. "మిత్రమా! సుగ్రీవా! వాలిని చంపడానికి తగిన కారణం దొరికింది. నా బాణములతో వాలిని చంపుతాను. వాలి నా కంటపడనంతవరకే జీవించి ఉంటాడు. నిన్ను

మరలా కిష్కింధకు రాజుగా చేస్తాను. నీ భార్యను నిన్ను చేరుకుంటుంది. నా మాట నమ్ము." అని అన్నాడు రాముడు.

శ్రీమద్రామాయణము
కిష్కింధా కాండము పదవ సర్గ సంపూర్ణము
ఓం తత్సత్ ఓం తత్సత్ ఓం తత్సత్

కిష్కింధాకాండము
పదకొండవ సర్గ.

తనలో సంతోషాన్ని వృద్ధి చెందేట్టు రాముడు పలికిన మాటలకు సుగ్రీవుడు ఎంతో ఆనందించాడు. "రామా! నాకు ఆ మాత్రం తెలియదా! నీకు కోపం వస్తే ముల్లోకములనే భస్మం చేయగల శక్తి, సామర్థ్యము నీకు ఉంది. కాని వాలికి ఎంత పౌరుషము, పరాక్రమము ఉందో తెలుసుకొని దానికి తగ్గట్టుగా చేయమని నా కోరిక. రామా! వాలి సూర్యోదయానికి ముందే లేచి, ఏ మాత్రం శ్రమలేకుండా నాలుగు సముద్రములకు వెళ్లి, సంధ్యావందనము చేస్తాడు.

(ఇక్కడ ఒక చమత్కారము ఉంది. కన్యాకుమారి దగ్గరకు వెళితే, మూడు సముద్రాలు పక్క పక్కనేఉన్నాయి. ఇంక నాలుగో సముద్రం అప్పట్లో ఉండేమో తెలియదు. ప్రస్తుతం హిమాలయాలు ఉన్నాయి. కాబట్టి అది అతిశయోక్తి కావచ్చును. పైగా పంపానది, ఋష్యమూకము కన్యాకుమారికి దగ్గరగానే ఉన్నాయి. వాలి ఏ మాత్రం శ్రమ లేకుండా మూడు సముద్రాలలో సంధ్యావందనము చేసాడు అనేది సంభవమే కదా! ఆలోచించండి.).

వాలి పర్వతముల మీద ఎక్కి పెద్ద పెద్ద రాళ్లను బంతుల మాదిరి పైకి ఎగరవేసి ఆడుకుంటూ ఉంటాడు. వాలి తన బల ప్రదర్శన కొరకు పెద్ద పెద్ద వృక్షములను పెకలించి వేస్తూ ఉంటాడు.

దుందుభి అనే రాక్షసుడు ఉండేవాడు. వాడు మహా బలవంతుడు. పెద్ద కొండ వంటి శరీరము కలవాడు. గర్వముచే మదించిన వాడు. వాడు ఒక సారి సముద్రుని వద్దకుపోయి తనతో యుద్ధానికి రమ్మని సముద్రుని పిలిచాడు. సముద్రుడు ఆ రాక్షసునితో ఇలా అన్నాడు. "ఓ దుందుభీ! నేను నీతో యుద్ధము చేయలేను. కానీ నీతో యుద్ధము చేయగల వీరుడి గురించి చెపుతాను. హిమవంతుడు అనే పర్వత రాజు ఉన్నాడు. ఆయన సాక్షాత్తు మహాశివునికి మామగారు. ఆయన ఎంతో మంది మునులకు, ఋషులకు తపస్సుచేసుకోడానికి ఆశ్రయం ఇచ్చాడు. నీతో యుద్ధము చేయుటకు ఆయన సమర్థుడు." అని చెప్పాడు సముద్రుడు.

సముద్రుడు తనకు లొంగి పోయాడు అనే గర్వంతో దుందుభి హిమవంతుని వద్దకు వెళ్లాడు. హిమవంతుని పర్వత శిఖరములను పడగొట్టాడు. నలుమూలలకూ విసిరివేసాడు. అప్పుడు హిమవంతుడు దుందుభితో ఇలా అన్నాడు. ఎందుకు నా శిఖరము లను ధ్వంసం చేస్తావు. నా శిఖరముల మీద ఎంతో మంది మునులు, ఋషులు తపస్సు చేసుకుంటున్నారు. వారి తపస్సుకు ఆటంకము కలిగించకు. నేను సాత్వికుడను. నాకు యుద్ధం చేయడం చేతకాదు." అని అన్నాడు.

ఆ మాటలకు దుందుభి ఇలా అన్నాడు. “నీవు నాతో యుద్ధం చేయగలవనే నీ దగ్గరకు వచ్చాను. నీవు నాతో యుద్ధం చెయ్యి లేకపోతే నాతో యుద్ధం చేయగల పరాక్రమవంతుడు ఎవరో చూపించు.” అని అన్నాడు.

“ఓ దుందుభీ! ఇంద్రుని కుమారుడు, కిష్కింధ రాజ్యాధిపతి, అమిత ప్రతాపవంతుడు, వాలి నామధేయుడు ఉన్నాడు. అతడు నీతో యుద్ధము చేయగల సమర్థుడు. వెంటనే అతని వద్దకు పోయి అతనితో యుద్ధము చెయ్యి. కాని ఇంతవరకూ యుద్ధములో వాలిని ఎవరూ గెలవ లేదు. అది గుర్తుపెట్టుకో.” అని చురక అంటించాడు హిమవంతుడు.

దుందుభికి కోపం మిన్ను ముట్టింది. మారు మాటాడకుండా దుందుభి వాలి వద్దకు వెళ్లాడు. దుందుభి మహిష రూపం(దున్నపోతు) ధరించాడు. కిష్కింధా పుర ద్వారము వద్ద నిల్చి పెద్ద పెద్దగా రంకెలు వేసాడు. పక్కనే ఉన్న వృక్షములను పెకలించాడు. సింహద్వారములను తన కొమ్ములతో కుమ్ముతున్నాడు. దుందుభి చేస్తున్న ఆగడాలు అంత:పురంలో ఉన్న వాలి దృష్టికి వచ్చాయి. వాలి తన అంత:పుర స్త్రీలతో కలిసి బయటకు వచ్చాడు. దుందుభిని చూచాడు.

“ఓ దుందుభీ! నువ్వా! నీ సంగతి నాకు తెలుసు కానీ, వెళ్లి నీ ప్రాణాలు కాపాడుకో. నాతో అనవసరంగా యుద్దం చేసి నీ ప్రాణాల మీదికి తెచ్చుకోకు.” అని అన్నాడు. ఆ మాటలకు దుందుభి కోపం మిన్నుముట్టింది. “వాలీ! అంత:పుర స్త్రీల ముందు ప్రగల్భాలు పలుకకు.

ధైర్యం ఉంటే నాతో యుద్ధం చెయ్యి. లేకపోతే ఓడిపోయానని ఒప్పుకొని అంత:పురానికి వెళ్లు. నీకు మరొక అవకాశము ఇస్తున్నాను. రాత్రి అంతా నీ అంత:పుర స్త్రీలతో కామ సుఖాలు అనుభవించు. నీ వాళ్లందరికీ వీడ్కోలు చెప్పు. నీ కిష్కింధను ఆఖరు సారిగా తనివితీరా చూసుకో. మరలా ఇంకొక సారి కామభోగములు అనుభవించు. రేపు ఉదయం నా వద్దకు రా! నాతో యుద్ధం చెయ్యి. నా చేతిలో నీకు చావు తప్పదు.

రేపటిదాకా ఎందుకు సమయం ఇస్తున్నాను అంటే ప్రస్తుతం నీవు మద్యం మత్తులో ఉన్నావు. అంత:పుర స్త్రీలతో కామ సుఖాలు అనుభవిస్తున్నావు. నీ చేతిలో ఏ ఆయుధమూ లేదు. ఆయుధములు లేని వానినీ, మద్యం మత్తులో ఉన్నవాడినీ, ఏమరుపాటుగా ఉన్న వాడినీ, నీ వంటి బలం లేని వాడినీ, ఓడి పోయిన వాడినీ, నీ లాగా కామసుఖాలలో మునిగి తేలుతూ సగంలో లేచి వచ్చిన వాడినీ చంపడం మహా పాపం అని నాకు తెలుసు. అందుకే రేపు ఉదయం రా!" అని గర్వంతో పలికాడు దుందుభి.

ఆ మాటలకు వాలి నవ్వాడు. తనతో ఉన్న అంత:పుర కాంతలను లోపలకు పంపాడు. దుందుభి వద్దకు వచ్చాడు. "నేను మద్యం మత్తులో లేను. యుద్ధం చేసే ముందు మద్యం సేవించడం ఆచారం. అదే నేను చేసాను. నాతో యుద్ధానికి రా!"అని దుందుభిని యుద్ధానికి పిలిచాడు.

తన తండ్రి దేవేంద్రుడు తనకు ఇచ్చిన మాలను మెడలో వేసుకున్నాడు. దుందుభి కొమ్ములు పట్టుకున్నాడు. దుందుభిని పట్టుకొని గిరా గిరా తిప్పి నేలకేసి కొట్టాడు. దుందుభికి దిమ్మ తిరిగింది.

చెవులలో నుండి రక్తం కారింది. పైకి లేచి వాలిని పట్టుకున్నాడు. వాలికి, దుందుభికి ఘోర యుద్ధం జరిగింది. ఒకరిని ఒకరు పిడికిళ్లతో గుద్దుతూ, కాళ్లతో తన్నుతూ, వృక్షములు, బండరాళ్లు ఒకరి మీద ఒకరు విసురుకుంటూ యుద్ధం చేసారు.

యుద్ధం చేసే కొద్దీ దుందుభి బలం తగ్గుతూ ఉంది. వాలి బలం పెరుగుతూ ఉంది. వాలి, దుందుభిని పైకి ఎత్తి నేల మీద పడవేసి తొక్కుతున్నాడు. దుందుభి నవ రంధ్రముల నుండి రక్తం ధారాపాతంగా కారిపోతూ ఉంది. వాలి బలానికి తట్టుకోలేక దుందుభి ప్రాణాలు విడిచాడు. వాలి దుందుభి శరీరాన్ని రెండు చేతులతో పైకి ఎత్తి ఒక యోజన దూరంలో పడేట్టు విసిరి వేసాడు.

ఆ మాదిరి విసిరి వేయడంలో దుందుభి శరీరం నుండి కారిన రక్తం మతంగాశ్రమము మీద చల్లినట్టు పడింది. ఆ రక్తపు బిందువులను చూచి మతంగ మహర్షి కోపించాడు. ఆ రక్తము చల్లిన వాడు ఎవడా అని చూచాడు. మహర్షికి దున్నపోతురూపంలో చచ్చి పడి ఉన్న దుందుభి మృతకళేబరము కనిపించింది. ఆ మహర్షి తన తపోబలంతో ఆ పని చేసిన వాడు వాలి అని గ్రహించాడు. అనవసరంగా ఆ రాక్షసుని మృతకళేబరమును తన ఆశ్రమ ప్రాంతంలో విసిరివేసిన వాలిని శపించాడు.

“నా ఆశ్రమ ప్రాంతంలో ఈ రాక్షసుని శరీరాన్ని విసిరి, నా ఆశ్రమంలోని వృక్షములను నాశనం చేసి, ఈ దుష్టుని రక్తంతో కలుషితం చేసిన వాలి నా ఆశ్రమ ప్రాంతంలోకి కానీ, నా ఆశ్రమము నకు ఒక యోజన విస్తీర్ణములో గానీ ప్రవేశించకూడదు. అలా ప్రవేశిస్తే

వెంటనే మరణిస్తాడు అంతే కాదు ఇప్పటి దాకా ఈ అరణ్యములో నివసించుచున్న వాలి అనుచరులు, వానరులు తక్షణమే ఈ వనమును విడిచి పెట్టి వెళ్లవలెను. నేను ఈ ఆశ్రమమును ఈ ఆశ్రమములోని వృక్షములను, లతలను కన్నబిడ్డలవలె కాపాడుకుంటున్నాను. ఆ వృక్షములను, లతలను వానరములు పాడుచేస్తున్నారు. కాబట్టి వానరజాతి అంతా ఈ ప్రాంతమును విడిచిపెట్టి వెళ్లాలి. వారికి ఒక్కరోజు గడువు ఇస్తున్నాను. ఒక్కరోజు లోగా వానరులందరూ వెళ్లకపోతే వారిని కూడా శపించవలసి వస్తుంది. రేపటి నుండి నా కంటబడిన వానరుడు శిల అయి పోతాడు." అని వాలికి, వాలికి శాపం ఇచ్చాడు మతంగ మహర్షి.

ముని శాపము విషయం తెలుసుకొని వానరములు అన్నీ మతంగ మహర్షి వనము విడిచిపెట్టి వాలి వద్దకు వెళ్లాయి. "మీరంతా ఇక్కడకు ఎందుకు వచ్చారు. మీకు క్షేమమే కదా!"అని అడిగాడు. అప్పుడు ఆ వానరులు వాలికి, మతంగ మహర్షి ఇచ్చిన శాపము గురించి చెప్పారు. వెంటనే వాలి పరుగు పరుగున మతంగ ముని వద్దకు వెళ్లాడు. ఆయన కాళ్ల మీద పడి క్షమించమని ప్రార్థించాడు. కాని మహర్షి కనికరించలేదు.

ఆ నాటి నుండి వాలి శాపగ్రస్తుడయ్యాడు. ఈ ఋష్యమూక పర్వతము మీదికి వచ్చుటకు కానీ, కనీసము ఈ పర్వతము వంక కన్నెత్తి చూచుటకు కానీ భయపడేవాడు. నా అన్న వాలి ఇక్కడకు రాలేడని తెలిసి, నేను ఇక్కడ నివాసము ఏర్పరచుకొని నిర్భయంగా జీవించుచున్నాను. రామా! అదుగో ఆ నాడు వాలి విసిరిన దుందుభి అస్థిపంజరము కొండవలె ఎలా పడి ఉన్నదో చూడు. దాని పక్కనే ఏడు

సాల వృక్షములు ఉన్నవి. వాలి అప్పుడప్పుడు వాటిని ఊపి వాటికి ఉన్న ఆకులు, పండ్లు రాలగొడుతూ ఉంటాడు.

మిత్రమా రామా! వాలి గురించి అతని బల పరాక్రమముల గురించి నీకు వివరంగా చెప్పాను. అటువంటి వాలిని నీవు చంప గలవా! ఆలోచించుకో!" అని రాముని మనసులో సందేహాన్ని రేకెత్తించాడు సుగ్రీవుడు.

ఆమాటలు విని లక్ష్మణుడు నవ్వాడు. "ఓ సుగ్రీవా! నీవు చెప్పావు సరే. ఇప్పుడు రాముడు ఏమి చేస్తే, నీవు రాముడు వాలిని చంపగలడు అని నమ్మగలవు" అని అడిగాడు.

ఇప్పుడు సుగ్రీవుడు తన మనసులో మాట బయట పెట్టాడు. "రామా! పూర్వము వాలి ఈ సాలవృక్షములు ఏడింటిని అటు ఇటు ఊపేవాడు అని చెప్పాను కదా! రాముడు తన బాణముతో ఈ సాల వృక్షములలో ఒక దానిని పడగొట్ట గలిగితే, రాముడు వాలిని చంపగలడు అని నమ్మడానికి అవకాశము ఉంది. పోనీ రాముడు అక్కడ ఉన్న దుందుభి అస్థిపంజరమును తన కాలితో ఎత్తి రెండు వందల ధనుస్సు ప్రమాణముల అవతల విసర గలిగితే అప్పుడు కూడా రాముడు వాలిని చంపగలడు అని నమ్ముతాను." అని అన్నాడు సుగ్రీవుడు.

(ధనుస్సు పొడుగు 6 అడుగులు. అంటే రెండు గజాలు. 200 ధనుస్సులు అంటే 400 వందల గజాలు.).

సుగ్రీవుడు ఇంకా ఇలా అన్నాడు. "రామా! మరొక మాట. వాలి మహా బలవంతుడు. పరాక్రమశాలి. ఇప్పటి వరకూ ఎవరి చేతిలోనూ ఓడిపోవడం అనేది ఎరుగడు. వాలి దేవతలకు కూడా అజేయుడు. అందుకనే వాలికి భయపడి నేను ఇక్కడ తలదాచుకుంటున్నాను. వాలిని ఓడించుటకు కానీ, జయించుటకు కానీ ఎవరికీ సాధ్యము కాదు. ఇంక నా మాట చెప్పడం ఎందుకు. అందుకే ఎప్పుడు ఏ ఆపద వస్తుందో అని అనుక్షణం భయపడుతూ నా మంత్రులతో సహా ఇక్కడ దాక్కున్నాను.

ఇదంతా ఎందుకు చెబుతున్నాను అంటే. నాకు వాలి పరాక్రమము గురించి తెలుసు. కానీ నీ పరాక్రమము గురించి నాకు తెలియదు. అని చెప్పి నిన్ను పరీక్షించవలెనని గానీ, నీ పరాక్రమమును వీరత్వమును శంకించిగానీ నేను ఇలా అనడం లేదు. వాలి వలన కలిగిన భయంతోనే ఇలా మాట్లాడుతున్నాను. కాని నిన్ను, నీ ఆకారాన్ని, నీ ధనుస్సును చూస్తే నీవు వాలిని చంపగలవని నమ్మకం నాకు ఉంది. నీ తేజస్సు అటువంటిది." అని తాను చెప్పదలచుకున్నది స్పష్టంగా చెప్పాడు సుగ్రీవుడు.

రాముడు సుగ్రీవుడు చెప్పిన మాటలు అన్నీ శ్రద్ధగా విన్నాడు. "మిత్రమా సుగ్రీవా! నీవు నా మీద నమ్మకం పెట్టు. నీకు నా పరాక్రమము మీద నమ్మకము లేకుంటే. నేను నీకు నమ్మకం కలిగేట్టు చేస్తాను." అని అన్నాడు.

వెంటనే దుందుభి అస్థిపంజరము వద్దకు వెళ్లాడు. తన కాలి బొటనవేలితో ఆ అస్థి పంజరమును పదియోజనముల దూరం

పడేటట్టు విసిరాడు. అది చూచిన సుగ్రీవునికి మనసులో మరొక సందేహము కలిగింది. . రాముని చూచి ఇలా అన్నాడు.

"మిత్రమా! వాలి ఈ కళేబరమును విసిరినపుడు ఇది పూర్తిగా రక్త మాంసములతో బరువుగా ఉండింది. ఇప్పుడు ఎండిపోయి, అస్థిపంజరంగా మారింది. తన మునుపటి బరువును కోల్పోయింది. దీనిని బట్టి నీ బలము అధికమా, వాలి బలము అధికమా అని నిర్ణయించలేము కదా! అందుకని, నీవు ధనుస్సుకు బాణము సంధించి ఆ సాలవృక్షమును కొట్టినచో నాకు నమ్మకము కలుగుతుంది. రామా! నాకు తెలుసు. నీవు ఆ సాలవృక్షమును కొట్టగలవు. ఈ ఒక్కపని చేసి. నాలో ఉన్న సందేహమును తొలగించు." అని తన మనసులో ఉన్న సందేహమును బయట పెట్టాడు సుగ్రీవుడు.

శ్రీమద్రామాయణము

కిష్కింధాకాండము పదకొండవ సర్గ సంపూర్ణము

ఓం తత్సత్ ఓం తత్సత్ ఓం తత్సత్

కిష్కింధాకాండము

పండ్రెండవ సర్గ.

సుగ్రీవుని మాటలను విన్న రాముడు, అతని మనసులో ఉన్న సందేహమును నివారించ నిశ్చయించుకున్నాడు. .మారుమాటాడ కుండా తన ధనుస్సును చేత బట్టుకున్నాడు. శరమును సంధించాడు. ఒకే ఒక బాణంతో ఒక సాల వృక్షము కాదు, వరుసగా ఉన్న ఏడు సాలవృక్షములను పడగొట్టాడు. సుగ్రీవునికి నోట మాట రాలేదు.

ఆశ్చర్యపోయాడు. తాను ఒక్క వృక్షమును కొట్ట మంటే ఏడు వృక్షములను కొట్టాడు రాముడు. రాముని కాళ్ల మీద సాష్టాంగ పడ్డాడు.

"రామా! చాలు చాలు. నీవు సాక్షాత్తు ఇంద్రుడినే చంపగల సమర్ధుడవు. నీకు వాలి ఒక లెక్కా! ఏడు సాలవృక్షములను కూల్చిన నీముందు ఎవడు నిలిచి యుద్ధము చేయగలడు? నీవు నాకు మిత్రుడుగా లభించినందుకు నా మనసంతా ఆనందంతో నిండి పోయింది. రామా! చేతులుజోడించి ప్రార్థిస్తున్నాను. వాలిని చంపి నాకు మనశ్శాంతిని చేకూర్చు." అని అన్నాడు సుగ్రీవుడు.

"మిత్రమా! సుగ్రీవా! నీవు చెప్పినట్టే చేద్దాము. ముందు నీవు కిష్కింధకు వెళ్లు. నీ వెనువెంటనే మేము వస్తాము. నీవు వెళ్లి వాలిని యుద్ధానికి రమ్మని పిలువు. వాలితో యుద్ధము చెయ్యి. నేను చాటుగా ఉండి నా బాణముతో వాలిని చంపుతాను." అని అన్నాడు రాముడు.

రాముని మాటల మీద నమ్మకంతో సుగ్రీవుడు కిష్కింధకు వెళ్లాడు. సుగ్రీవుని మంత్రులు, రాముడు, లక్ష్మణుడు అతని వెంటనే వెళ్లి సమీపములో ఉన్న పొదల మాటున దాగి ఉన్నారు. సుగ్రీవుడు పెద్దగా అరుస్తూ వాలిని యుద్ధానికి పిలిచాడు. సుగ్రీవుని పిలుపు విని వాలి బయటకు వచ్చాడు.

తాను ఇంతకాలము ఎవరి కోసరం వెతుకుతున్నాడో ఆ సుగ్రీవుడు కంటపడేసరికి, వాలికి కోపం ముంచుకొచ్చింది. సుగ్రీవునితో తలపడ్డాడు. ఇద్దరూ ఘోరంగా యుద్ధం చేసుకుంటున్నారు. రాముడు

పొదల మాటున నిలబడి వాలిని తన బాణంతో కొట్టవలెనని శతవిధాలా ప్రయత్నించాడు. కానీ వాలి, సుగ్రీవుడు ఒకే రూపంలో ఉండటం వలన ఎవరు వాలి, ఎవరు సుగ్రీవుడు అని పోల్చుకోలేకపోయాడు. వాలికి బదులుగా సుగ్రీవుని కొడతానేమో అని భయపడ్డాడు. అందువలన బాణప్రయోగము చేయలేదు.

ఈ లోపల వాలి సుగ్రీవుని చావ చితక కొట్టాడు. వాలి కొట్టిన దెబ్బలకు సుగ్రీవుని శరీరం అంతా రక్తసిక్తము అయింది. ఆ దెబ్బలు తట్టుకోలేక సుగ్రీవుడు ఋష్యమూక పర్వతము మీదికి పారిపోయాడు. వాలి సుగ్రీవుని కొంత దూరం తరిమాడు. కాని సుగ్రీవుడు ఋష్యమూక పర్వతము మీదికి పోవడం చూచి, శాపానికి భయపడి వెనుదిరిగి పోయాడు. సుగ్రీవుని వెంట అతని మంత్రులు, రామలక్ష్మణులు వెళ్లారు.

రాముని చూచి సుగ్రీవుడు ఇలా అన్నాడు. “ఓ రామా! ఏమిటీ పని! వాలిని యుద్ధానికి పిలువ మన్నావు. వాలిని చంపుతానని నన్ను నమ్మించావు. కాని వాలి చేత నన్ను కొట్టించావు. చావు దెబ్బలు తిని పారిపోయి వచ్చాను. ఇలా ఎందుకు చేసావు. నేను వాలిని చంపను అని ముందే చెప్పి ఉంటే నేను అసలు వాలితో యుద్ధానికి పోను కదా!” అని దీనంగా పలికాడు.

సుగ్రీవుని చూచి రాముడు జాలి పడ్డాడు. “మిత్రమా! నేను ఏ పరిస్థితులలో బాణం వెయ్యలేదో వివరిస్తాను. కోపం లేకుండా విను. నీవు, వాలి, ఎత్తు, లావు, శరీర ఛాయ అన్నిటిలోనూ ఒకే విధంగా ఉన్నారు. నిన్ను, వాలిని, పోల్చుకోలేకపోయాను. నేను వదిలిన బాణం

నీకు తగిలి నీవు మరణిస్తావేమో అని భయపడ్డాను. అప్పుడు మిత్రునికి ద్రోహం చేసినవాడిని అవుతానుకదా! అందుకని బాణం వదలలేదు. నా తొందరపాటుతో గానీ, పొరపాటున గానీ, ఆ బాణం నీకు తగిలితే. శాశ్వతంగా నీ వంటి మంచి మిత్రుని పోగొట్టుకున్నవాడిని అవుతాను కదా!

నేను నీకు అభయం ఇచ్చాను. వాలిని చంపకపోయినా బాధ లేదు కానీ నిన్ను చంపితే అభయం ఇచ్చిన వాడిని చంపిన పాపం నాకు చుట్టుకుంటుంది. నీవు లేకపోతే మాకు ఎవరు దిక్కు. కాబట్టి నీవు మరలా వాలిని యుద్ధానికి పిలువు. కాని నిన్ను గుర్తించుటకు ఒక ఆనవాలు పెట్టుకో. ఆ ఆనవాలు సాయంతో నేను వాలిని ఒకే ఒక బాణంతో నేలకూలుస్తాను. నీవు నిశ్చింతగా ఉండు." అని అన్నాడు రాముడు.

రాముడు చుట్టూ చూచాడు. రామునికి ఎదురుగా ఒక పుష్పములతో కూడిన ఒక తీగ కనపడింది. "లక్ష్మణా! పుష్పములతో కూడిన ఆ తీగను తెచ్చి సుగ్రీవుని మెడలో హారంగా అలంకరించు." అని అన్నాడు. వెంటనే లక్ష్మణుడు పోయి గజపుష్పములతో నిండి ఉన్న తీగను తీసుకొని వచ్చి సుగ్రీవుని మెడలో వేసాడు. ఎర్రగా ఉన్న ఆ పూలు సుగ్రీవుని మెడలో మెరిసిపోతున్నాయి. అందరూకలిసి తిరిగి కిష్కింధకు వెళుతున్నారు.

శ్రీమద్రామాయణము

కిష్కింధాకాండము పండ్రెండవ సర్గ సంపూర్ణము

ఓం తత్సత్ ఓం తత్సత్ ఓం తత్సత్

కిష్కింధా కాండము

పదమూడవ సర్గ.

అందరూ కిష్కింధకు వెళుతున్నారు. ముందు లక్ష్మణుడు నడుస్తున్నాడు. తరువాత ధనుర్ధారియై రాముడు నడుస్తున్నాడు. రాముని వెనక సుగ్రీవుడు, హనుమంతుడు, నలుడు, నీలుడు, తారుడు నడుస్తున్నారు. వారుకొండలను గుహలను, సరస్సులను దాటుకుంటూ వెళుతున్నారు. మార్గమధ్యంలో రాముడు ఒక వనమును చూచాడు. దాని గురించి సుగ్రీవుని అడిగాడు. సుగ్రీవుడు ఆ వనము గురించి ఇలా చెప్పసాగాడు.

“ఓ రామా! ఇక్కడ సప్తజనులు అనే మునులు ఉండేవారు. వారు జలములో తలకిందులుగా తపస్సు చేస్తూ ఉండేవారు. వారు ఆహారము తీసుకొనేవారు కాదు. ఏడురోజులకొక సారి గాలి మాత్రం పీల్చుకొనే వారు. ఆ ప్రకారంగా వారు ఏడు వందల సంవత్సరములు తపస్సుచేసి శరీరంతో స్వర్గమును చేరుకున్నారు. ఆ మునుల తపస్సు ప్రభావంతో ఈ వనములోకి దేవతలు గానీ, మనుషులు గానీ, జంతువులు గానీ ప్రవేశించలేవు. ఒకవేళ ప్రవేశిస్తే తిరిగి వెళ్లలేవు. ఈ వనములో నిత్యమూ మూడు అగ్నిహోత్రములు అనగా దక్షిణాగ్ని, గార్హపత్యము, ఆహవనీయము మండుతూ ఉంటాయి. వాటినుండి వెలవడే పొగ అదుగో అలా కనపడుతూ ఉంటుంది. రామా! మీరు ఆ మునులకు నమస్కారం చేయండి. మీకు మేలుజరుగుతుంది.” అని అన్నాడు సుగ్రీవుడు.

రాముడు, లక్ష్మణుడు ఆ మునులకు భక్తితో

నమస్కరించారు. తరువాత వారందరూ కిష్కింధకు చేరుకున్నారు.

శ్రీమద్రామాయణము

కిష్కింధా కాండము పదమూడవ సర్గ సంపూర్ణము

ఓం తత్సత్ ఓం తత్సత్ ఓం తత్సత్

కిష్కింధా కాండము

పదునాల్గవ సర్గ.

అందరూ కిష్కింధా నగరము ప్రవేశించారు. సుగ్రీవుడు రామునితో ఇలా అన్నాడు."రామా! ఇదే కిష్కింధా నగరము. ఇక్కడ ద్వారములు అన్నీ బంగారంతో నిర్మించారు. ఇక్కడ అనేక యంత్రములు అమర్చబడ్డాయి. వాలిని చంపడానికి తగిన కాలము సమీపించింది. నీవు దానిని సఫలం చేస్తావని ఆశిస్తున్నాను." అని అన్నాడు అనుమానంగా అన్నాడు సుగ్రీవుడు.

సుగ్రీవుని మనసులోని సందేహాన్ని గ్రహించాడు రాముడు. అతని మనసులోని సందేహ నివృత్తి కోసరం ఇలా అన్నాడు.

"సుగ్రీవా! ఈ సారి వాలిని గుర్తు పట్టడంలో పొరపాటు జరగదు. ఎందుకంటే నీ మెడలో ఉన్న గజమాల నువ్వు సుగ్రీవుడు అని తెలియజేస్తుంది. ఒకే ఒక బాణంతో నేను వాలిని చంపుతాను. నీవు నిశ్చింతగా ఉండు. ఈ సారి వాలి నా కంటబడి తప్పించుకుంటే, నువ్వు నన్ను తప్పు పట్టు. నన్ను నిందించు. నీ ఎదురుగానే కదా నేను ఏడు సాలవృక్షములను ఛేధించాను. ఈ వాలిని చంపడం పెద్ద కష్టమేమీ

కాదు. నన్ను నమ్ము.

నేను ఎన్ని కష్టములలో ఉన్నా ఎప్పుడూ అసత్యము చెప్పలేదు. ఇక మీదట కూడా అసత్యము చెప్పను. చెప్పలేను. నేను నా ప్రతిజ్ఞను నెరవేర్చుకుంటాను. ఇది సత్యము. నీలోని భయాన్ని వదిలిపెట్టు. ధైర్యంగా వాలితో యుద్ధం చెయ్యి. వాలిని యుద్ధానికి పిలువు. అతడు బయటకు వచ్చేట్టు చెయ్యి. నీవు యుద్ధమునకు పిలవగానే వాలి బయటకు వస్తాడు. ఎందుకంటే అతడు ఇప్పటి దాకా ఓటమి ఎరుగడు అని నువ్వే చెప్పావు కదా!

అతనికి తన బలము మీద పరాక్రమము మీద నమ్మకము ఎక్కువ. తనను తాను పొగుడుకుంటూ ఉంటాడు. కాబట్టి నీతో యుద్ధానికి వస్తాడు. నా చేతిలో చస్తాడు. మరొక విషయం. అతను ఇప్పుడు స్త్రీలతో కామభోగములు అనుభవిస్తూ ఉంటాడు. స్త్రీల మధ్య ఉన్న వాలి తనను ఎవడైనా ఎదిరిస్తే సహించలేడు. వెంటనే బయటకు వస్తాడు. కాబట్టి సుగ్రీవా! వాలిని యుద్ధానికి పిలువు." అని అన్నాడు రాముడు సుగ్రీవునికి ధైర్యం చెబుతూ.

రాముడు పలికిన ధైర్యవచనాలకు సుగ్రీవుడు పొంగిపోయాడు. గట్టిగా గర్జించాడు. తొడ చరిచి వాలిని యుద్ధానికి పిలుస్తూ పెద్ద పెద్దగా రంకెలు వేసాడు. సుగ్రీవుడు అరుస్తున్న అరుపులకు, వేస్తున్న రంకెలకు, కిష్కింధ అదిరిపోయింది. వాలి బయటకు వచ్చేవరకూ సుగ్రీవుడు అలా అరుస్తూనే ఉన్నాడు.

శ్రీమద్రామాయణము కిష్కింధాకాండము

పదునాల్గవ సర్గ సంపూర్ణము ఓం తత్సత్ ఓం తత్సత్ ఓం తత్సత్

కిష్కింధా కాండము

పదునైదవ సర్గ.

సుగ్రీవుడు అంత:పురంలో తన భార్య వద్ద ఉన్నాడు. ఇంతలో సుగ్రీవుని అరుపులు గావు కేకలు వినిపించాయి. దిగ్గున లేచాడు వాలి. సేవించిన మద్యం మత్తు దిగిపోయింది. కోపం వచ్చింది. యుద్ధానికి సన్నద్ధం అయ్యాడు. అంత: పురము నుండి బయటకు వచ్చాడు. వాలి వెంట ఆయన భార్య తార కూడా వచ్చింది. వాలిని వారించింది. వాలిని ప్రేమతో కౌగలించుకొని ఇలా చెప్పింది.

"నాధా! నీకు అకాల కోపము పనికి రాదు. కోపము వదిలిపెట్టి ప్రశాంతంగా ఆలోచించు. ఇప్పుడే యుద్ధం చెయ్యాలా. రేపు చెయ్యవచ్చు కదా! నీ శత్రువు ఎక్కడకు పోడుకదా! పైగా యుద్ధానికి వచ్చింది ఒక్కడే కానీ పదిమంది కాదుకదా! నీవు పరాక్రమము లేని వాడవు, దుర్బలుడవు కాదు కదా! అయినా నీవు అకాలంలో యుద్ధమునకు పోవడం నాకు ఎంత మాత్రమూ ఇష్టం లేదు. దానికి కారణం చెబుతాను విను.

ఇంతకు ముందే నీవు నీ తమ్ముని సుగ్రీవుని యుద్దంలో ఓడించావు. చావగొట్టి పంపించావు. చావు తప్పి పారిపోయాడు సుగ్రీవుడు. కాని వెంటనే యుద్ధానికి వచ్చాడు. ఈ కొద్దికాలంలో అతని బలం ఎలా పెరిగింది. ఆలోచించు. ఇంత కొద్దికాలంలో అతను నీ కన్నా బలవంతుడు అయ్యాడంటే నాకు నమ్మకం కుదరం లేదు. ఇందులో ఏదో మోసం ఉంది. సుగ్రీవునికి బయట నుండి సాయం అందుతూ

ఉంది. ఆ సాయం ఎవరు, ఏ రూపంలో చేస్తున్నారో తెలియదు. ఇంతకూ సుగ్రీవునికి సాయం చేసే వాళ్లు ఎవరు? ఎక్కడ నుండి వచ్చారు? సుగ్రీవునికి సాయం చెయ్యాల్సిన అవసరం వారికి ఏముంది? బయట నుండి సాయం లేకుండా సుగ్రీవుడు ఇంతధైర్యంగా మరలా నీ మీదికి యుద్ధానికి కాలు దువ్వడు.

సుగ్రీవుడు బలవంతుడు కాకపోయినా బుద్ధిమంతుడు. నేర్పు కలవాడు. తనకు ఏ లాభమూ లేకుండా ఎవరితోనూ స్నేహం చెయ్యడు. ఇప్పుడు సుగ్రీవుడు ఎవరితో స్నేహం చేసాడో తెలుసుకోవడం అవసరం కదా! ఇటీవల మీ కుమారుడు అంగదుడు నాకు ఒక వార్త చెప్పాడు. దానిని ఇప్పుడు నీకు చెబుతున్నాను. మన సరిహద్దుల్లో కాపలా ఉండే గూఢచారులు అంగదునికి ఈ వార్త చెప్పారట.

అదేమిటంటే....... ఇక్ష్వాకు వంశములో పుట్టిన వారు, దశరథుని కుమారులు, రామ లక్ష్మణులు అనే పేరు గల వాళ్లు మన వనములో సంచరిస్తూ ఉన్నారట. వారితో సుగ్రీవునికి స్నేహం కలిసిందట. వారు సుగ్రీవుని కోరిక తీర్చడానికి ఒప్పుకున్నారట. ఇంక ఆ రాముడు ధనుస్సును ప్రయోగించడంలో గొప్ప నేర్పరి. బాణములను వేగంగా వేయగలడు. ఆ రాముడు ధర్మపరుడు. ఆపదలలో ఉన్నవారిని కాపాడే గుణం కలవాడు. మంచి లౌకిక జ్ఞానము శాస్త్రజ్ఞానము కలవాడు. తండ్రి ఆజ్ఞను పాలించేవాడు. రాముని యుద్ధంలో జయించడం అసాధ్యం అని తెలిసింది.

అటువంటి వాడు ఇప్పుడు నీసోదరుడు సుగ్రీవునికి సాయం చేస్తున్నాడట. కాబట్టి రామునితో నీకు విరోధము తగదు అని

నా భావన. నీవు నా మీద కోపం తెచ్చుకోకపోతే నీకు ఒక విషయం చెబుతాను. సావధానంగా విను.

నీకు తెలుసు. సుగ్రీవుడు ఏ తప్పూ చేయలేదు. కాబట్టి నీ తమ్ముని ఆదరించు. అతని రాజ్యము అతనికి ఇవ్వు. సుగ్రీవునితో విరోధము మాను. నీవు సుగ్రీవునితోస్నేహం చేసుకుంటే, రాముడు కూడా నీకు స్నేహితుడు అవుతాడు. నాధా! సుగ్రీవుడు పరాయివాడు కాదు కదా! నీకు స్వంత తమ్ముడు. అతని మీద ప్రేమ చూపించాలి గానీ ద్వేషించకూడదు. ప్రస్తుతము నీకు నీ సోదరుడు సుగ్రీవునితో సంధి చేసుకోనడం తప్ప వేరు మార్గము లేదు. నేను నీ హితము కోరి ఈ మాటలు చెబుతున్నాను. నీవు నా భర్త కాబట్టి, నీ క్షేమమును నేను సదా కోరుతాను కాబట్టి చెబుతున్నాను. కోపము, ద్వేషము విడిచి పెట్టు. నా మాటవిను. సుగ్రీవునితో యుద్ధము మాను. " అని తార తన భర్త వాలికి హితోపదేశము చేసింది. కాని తార మాటలు వాలికి రుచించలేదు.

(ఇది విదురుడు సుయోధనునికి హితము చెప్పినట్టు ఉంది కదా! వాలి-- సుయోధనుడు. సుగ్రీవుడు-- ధర్మరాజు. సుగ్రీవునితో రామునికి మైత్రి కుదిరింది. ధర్మరాజుతో కృష్ణునికి బంధుత్వతము మైత్రి రెండు ఉన్నాయి. ఇద్దరి మధ్యా రాజ్యము వలన తగాదా వచ్చింది. సుగ్రీవుని భార్యను వాలి అవమానిస్తే, ధర్మరాజు భార్యను సుయోధనుడు అవమానించాడు. వాలి సుగ్రీవుని అడవులకు తరిమితే, సుయోధనుడు ధర్మరాజును అడవులకు పంపాడు. అరణ్య వాసం తరువాత ధర్మరాజు యుద్ధం చేస్తే, అరణ్యవాసం తరువాత సుగ్రీవుడు వాలితో యుద్ధం చేసాడు. రాముని సాయంతో సుగ్రీవుడు వాలిని చంపితే, కృష్ణుడు

చెప్పిన ఉపాయంతో భీముని చేతిలో సుయోధనుడు చచ్చాడు. కృష్ణుడు ఏ పక్కన ఉంటే అక్కడ జయం ఉంటుంది. రాముడు ఎక్కడ ఉంటే అక్కడ జయం ఉంటుంది. విదురుడు సుయోధనునితో సంధి చేసుకోమంటే, ఇక్కడ తార కూడా వాలిని సంధిచేసుకోమని చెప్పింది. యుగాలు మారినా, కథలు వేరైనా, ధర్మం ఒకటే. అదే కలియుగంలో చిన్న సామెత రూపంలో ఉంది. పోరు నష్టము పొందు లాభము.)

శ్రీమద్రామాయణము
కిష్కింధాకాండము పదునైదవ సర్గ సంపూర్ణము
ఓం తత్సత్ ఓం తత్సత్ ఓం తత్సత్

కిష్కింధా కాండము
పదునారవ సర్గ.

తార చెప్పిన మాటలు వాలి పెడచెవిని పెట్టాడు. తారను నాకు చెప్పేంత దానివా అని కసురుకున్నాడు. విదిలించి కొట్టాడు. పురుషాహంకారము అతని ఆలోచనా శక్తిని హరించి వేసింది.

“నా కన్నా బలహీనుడు నన్ను యుద్ధానికి రమ్మని పిలుస్తుంటే నేను ముందూ వెనకా ఆలోచిస్తూ కూర్చోవాలా! కుదరదు. నీవు భయస్తురాలవు. పిరికిదానికి. నా వంటి వీరుడు శూరుడు యుద్ధానికి వెనుదియ్యడం కన్నా మరణించడం మేలు. శత్రువు యుద్ధానికి కాలు దువ్వుతుంటే, ఓర్పుతో ఉండటం మరణం కన్నా సహించరానిది. ఇంక రాముని గూర్చి నాకు భయం లేదు. నీవే అన్నావు కదా. రాముడు ధర్మాత్ముడు. ఆర్తజనులను రక్షించేవాడు అని.

అటువంటి రాముడు అధర్మానికి ఎలా ఒడిగడతాడు. సుగ్రీవుని కోసరం పాపం ఎలా చేస్తాడు? ఏదో స్త్రీసహజమైన చాపల్యంతో నీకు తోచింది చెప్పావు. ఇంకచాలు లోపలకు వెళ్లు.

పిచ్చిదానా! నేను నా సోదరుని చంపుతాను అనుకున్నావా! లేదు. నేను కేవలం సుగ్రీవుని అహంకారము అణిచి బుద్ధి చెప్పి పంపేస్తాను. అంతే. ప్రస్తుతము సుగ్రీవుడు రాజ్యం కోరడం లేదు. యుద్ధం కోరుకుంటున్నాడు. వాడు కోరుకున్న యుద్ధాన్ని వాడికి ఇస్తాను. నీకు నా మీద ఉన్న ప్రేమకొద్దీ, నీ బుద్ధికి తోచిన ఉపాయము చెప్పావు. అది చాలు. ఇంక లోపలకు వెళ్లు. నేను చిటికలో సుగ్రీవుని గర్వము అణిచి అతనిని పారిపోయేట్టు చేసి వస్తాను." అని పలికాడు వాలి.

తార ఇంక చేసేది లేక దు:ఖిస్తూ వాలికి ప్రదక్షిణపూర్వక నమస్కారము చేసింది. భర్త విజయాన్ని కాంక్షిస్తూ అతనికి వీరతిలకము దిద్దింది. అంత:పుర కాంతలతో సహా లోపలకు వెళ్లింది. వాలి కోపంతో బుసలు కొడుతూ నగరం బయటకు వచ్చాడు. సుగ్రీవుడు ఎక్కడ ఉన్నాడా అని నలుదిక్కులా చూస్తున్నాడు. అల్లంత దూరంలో నడుముకు ధట్టీకట్టుకొని ధైర్యంగా నిలబడి రంకెలు వేస్తున్న సుగ్రీవుని చూచాడు. వాలి కోపంతో సుగ్రీవుని వైపుకు వెళ్లాడు.

వాలి మెడలో ఇంద్రుడు ఇచ్చిన బంగారు మాల ఉంది. సుగ్రీవుని మెడలో రాముడు వేసిన గజపుష్పమాల ఉంది. సుగ్రీవుని చూచి వాలి ఇలా అన్నాడు. "ఒరేయ్ సుగ్రీవా! ఈ పిడికిలితో గట్టిగా గుద్దితే చస్తావురా! నాతో ఎందుకురా నీకు" అని అన్నాడు.

"ఓ వాలీ! నాకూ పిడికిలి ఉంది. నేనూ నీ తల మీద ఒక గుద్దు గుద్దితే తలపగిలి చస్తావు." అని మాటకు మాట బదులు చెప్పాడు సుగ్రీవుడు.

ఇంక వాలి ఊరుకోలేకపోయాడు. సుగ్రీవుని పిడికిలితో మోదాడు. సుగ్రీవునికి ఒళ్లంతా రక్తసిక్తము అయింది. సుగ్రీవుడు పక్కనే ఉన్న సాలవృక్షమును పీకి వాలి మీదికి విసిరాడు. ఆ వృక్షము దెబ్బకు వాలి కదిలిపోయాడు. వాలి సుగ్రీవులు ద్వంద్వయుద్ధమునకు తలపడ్డారు. ఒకరితో ఒకరు ఘోరంగా పోరాడుతున్నారు. తన మెడలో ఉన్న సువర్ణమాల మహిమతో వాలి బలము క్షణక్షణము వృద్ధి చెందుతుంటే, సుగ్రీవుని బలము క్షీణించసాగింది. కాని పట్టుదలతో యుద్ధం చేస్తున్నాడు. రాముని సాయం కోసం ఎదురు చూస్తున్నాడు.

వాలి సుగ్రీవులు కొమ్మలతోనూ, రాళ్లతోనూ, చెట్లతోనూ, గోళ్లతోనూ, పిడికిళ్లతోనూ ఒకరితో ఒకరు యుద్ధం చేసుకుంటున్నారు. ఇద్దరి దేహముల నుండి రక్తం కారుతూ ఉంది. వాలి దెబ్బకు తట్టుకోలేక సుగ్రీవుడు దిక్కులు చూస్తున్నాడు. సుగ్రీవుని బలం సన్నగిల్లింది అని గ్రహించాడు రాముడు. వాలిని చంపడానికి బాణం ఎక్కుపెట్టాడు. ధనుస్సును ఆకర్ణాంతము లాగి, వాలి మీదికి గురి చూచి, బాణమును వదిలాడు. రాముడు వదిలిన బాణము సరిగ్గా వాలి వక్షస్థలమును చీల్చుకుంటూ వీపు నుండి బయటకు వచ్చింది. ఆ బాణము దెబ్బతిన్న వాలి, పక్షిమాదిరి నేలకూలాడు. ఆ రోజు ఆశ్వయుజ శుద్ధపౌర్ణమి. ఆరోజు వాలి నేలకూలాడు.

వాలికి క్రమ క్రమంగా స్పృహ తప్పుతూ ఉంది. గొంతులో

గుర గుర శబ్దం వస్తూ ఉంది. వాలియుద్ధరంగంలో దీనంగా పడి ఉ న్నాడు.

శ్రీమద్రామాయణము
కిష్కింధా కాండము పదునారవ సర్గ సంపూర్ణము
ఓం తత్సత్ ఓం తత్సత్ ఓం తత్సత్

కిష్కింధా కాండము
పదునేడవ సర్గ.

రాముని బాణం దెబ్బ తిన్న వాలినేల మీద పడిపోయాడు. శరీరం పడిపోయింది కానీ అతని తేజస్సు తగ్గలేదు. వాలి మెడలో ఉన్న ఇంద్రమాల, అతని గుండెల్లో గుచ్చుకున్న రామ బాణము అతనిలో ఉన్న తేజస్సును సడలిపోనివ్వడం లేదు.

తన బాణము దెబ్బకు వాలి పడి పోగానే, రాముడు, లక్ష్మణుడు వాలి దగ్గరకు వెళ్లారు. వాలి ముందు గౌరవ సూచకంగా తలవంచి నిలబడ్డారు. కొన ఊపిరితో ఉన్న వాలి రాముని చూచాడు. యుద్ధంలో గెలిచాను అన్న గర్వంతో ఉన్న రామునితో తనలో ఉన్న గర్వం తగ్గని వాలి ఇలా అన్నాడు. వాలి మాటల్లో రాముని పట్ల వినయం ఉంది. కాని పౌరుషం తగ్గలేదు. ధర్మబద్ధంగా మాట్లాడుతున్నాడు వాలి.

"నేను సుగ్రీవునితో యుద్ధం చేస్తూ నీ మూలంగా మరణిస్తున్నాను. నేను నీతో యుద్దం చేయడం లేదు కదా! నీవంక తిరిగి నీ తో యుద్ధం చేయని వాడిని చంపి నీవు ఏం సాధించావు?

నేను విన్నదానిని బట్టి రాముడు కులీనుడు. సత్త్వగుణ సంపన్నుడు. తేజస్వి. వ్రతనిష్ట కలవాడు. రాముడు కరుణామయుడు. ఎల్లప్పుడూ ప్రజలహితం కోరేవాడు. ఇతరుల పట్ల జాలి, దయ కలవాడు. ఉత్సాహవంతుడు. సమయస్ఫూర్తి కలవాడు. ధృడమైన బుద్ధికలవాడు. ఈ లోకంలో ఉన్న వారంతా నిన్ను పై గుణములతో కీర్తిస్తుంటారు కదా! పైగా నీవు రాజువు. రాజైన వాడు ఇంద్రియనిగ్రహము, ఓర్పు, ధైర్యము, బలము, పరాక్రమము, తప్పుచేసిన వారిని దండించే గుణము కలిగి ఉండాలి.

నీవు సుగ్రీవునికి అండగా, మిత్రుడుగా ఉన్నావని తార చెప్పింది. కానీ సకల సద్గుణ సంపన్నుడవైన నీవు తప్పు చేయవని నేను సుగ్రీవునితో యుద్ధానికి తలపడ్డాను. నేను సుగ్రీవునితో యుద్ధం చేసేటప్పుడు నీవు నాకు కనపడలేదు. (అంటే రాముడు చెట్టు చాటునో పొదలమాటునో దాక్కుని ఉన్నాడని వాలి అంటున్నాడు.) కాని నీ బాణం దెబ్బనాకు తగిలింది. అంటే నేను సుగ్రీవునితో యుద్దం చేస్తుంటే, నీవు నాకు కనపడకుండా మాటు వేసి నన్ను కొట్టావు అని నేను అనుకుంటున్నాను.

ధర్మాత్ముడవు అని పేరుగాంచిన నీ బుద్ధి ఇంత చెడ్డదనీ, నీవు ధర్మాత్ముడు అనే ముసుగులో అధర్మాలను ఆచరించే దుర్మార్గుడవు అనీ, పాపాత్ముడవనీ, గడ్డితో కప్పబడిన నేలబావి లాంటి వాడివనీ నాకు తెలియక, నేను సుగ్రీవునితో ధర్మయుద్ధానికి తలపడ్డాను. రామా! నీవు సాత్వికుని వేషంలో ఉన్న పాపాత్ముడివి, నివురు కప్పిన నిప్పులాంటి వాడివి అని తెలుసుకోలేకపోయాను.

రామా! నేను నీ దేశానికి రాలేదు. నీ నగరానికి రాలేదు. నీ దేశంలో కానీ, నీ నగరంలో కానీ ఏ నేరమూ, తప్పూ చేయలేదు. నిన్ను నేను ఎన్నడూ అవమానించలేదు. నీకు ఎటువంటి అపకారము చేయలేదు. నామానాన నేను అడవులలో ఉంటూ ఫలములు, మూలములు తింటూ బతుకుతున్నాను. నీవు నరుడవు. నేను కాయలు పండ్లు తినే వానరమును. పాపం చెయ్యడం అంటే ఏమిటో నాకు తెలియదు. నేను నీతో యుద్ధం చేయడం లేదు. మరొకరితో యుద్ధం చేస్తున్నాను. అటువంటి నన్ను ఏ కారణంతో చంపావు?

రామా! నీవు రాజులలో ప్రసిద్ధుడవు. ఎన్నో శాస్త్రములను చదివావు. ప్రస్తుతము జటలు, నారచీరలు ధరించి మునివేషములో ఉన్నావు. ముని వేషములో ఉన్న నీవు ఇటువంటి క్రూరమైన పని చేయడం తగునా!

రామా! నీవు రఘు వంశములో పుట్టావు. పైకి మాత్రం ధర్మానికి ప్రతిరూపంగా కనపడతావు. కాని లోలోపల దుష్టుడివి. నీవు క్రూరత్వానికి ప్రతిరూపం. లోకానికి మాత్రం ధర్మాత్ముడు, మంచి వాడు అని చెప్పుకుంటూ తిరుగుతున్నావు. రామా! రాజుకు ఉండవలసిన గుణములు ఏవంటే---సామము, దానము, క్షమ, ధర్మగుణము, సత్యము పలకడం, పరాక్రమము, ధైర్యము. ఇవీ రాజుకు ఉండవలసిన గుణములు. రామా! మేము అడవులలో ఉంటూ ఆకులు, కాయలు, పండ్లు తిని బతికే వానరులము. నీవు నరుడివి. నరులకు రాజువు. మీకు అనుభవించడానికి రాజ్యము, వెండి, బంగారము కావాలి. కాని ఎక్కడో మారుమూల ఉన్న నా అరణ్యరాజ్యము నీకు ఎందుకు?

నీతిగా ఉంటడం, వినయము కలిగి ఉండటం, దండించతగినవారిని దండించడం, నిరపరాధులను విడిచిపెట్టడం, ఇవీ రాజు పాటించవలసిన ధర్మములు. రాజులు ఈ ధర్మములకు లోబడి ప్రవర్తించాలి కానీ వారి ఇష్టము వచ్చినట్టు ప్రవర్తించరాదు. కాని నీవు రాజువై ఉండీ పై ధర్మములను పాటించలేదు. నీ ఇష్టం వచ్చినట్టు ప్రవర్తించావు. నీకు నీ కోరికలు తీరాలి. దాని కోసం ఏమి చెయ్యడానికైనా వెనుదీయవు. పైగా నీకు కోపం ఎక్కువ. నీ మనస్సు నిలకడలేదు. రాజధర్మములను ఆచరించడంలో నీకు స్థిరమైన బుద్ధిలేదు. ఆయుధము నీ చేతిలో ఉంది కదా అని అందరినీ చంపుకుంటూపోతావు. అదీ నీ తత్త్వము.

ఓ మనుజేశ్వరా! రామా! నీకు ధర్మాచరణములో శ్రద్ధ, భక్తి లేవు. నీవు కామానికి దాసుడవు. నీ కోరికలు ఎటు లాగితే అటు వెళతావు. నాకు తెలిసీ నేను ఏ అపరాధమూ చెయ్యలేదు. అటువంటి నన్ను అకారణంగా చంపావు. ఈ చర్యను లోకుల ముందు, సాటి రాజుల ముందు, ఎలా సమర్ధించుకుంటావు?

ఓ రామా! రాజును, బ్రాహ్మణుని, గోవును, అమాయకమైన జంతువులను నిర్దాక్షిణ్యంగా చంపేవాడు, వేదప్రమాణమును నమ్మని వాడు, ఇతరుల మీద చాడీలు చెప్పేవాడు, మిత్రుడికి ద్రోహం చేసేవాడు, గురువుగారి భార్యను కామించేవాడు, నరకానికి వెళతారు. నేను మనిషినికాను జంతువును. నన్ను అకారణంగా చంపావు. నీకు ఏ గతి పడుతుందో ఆలోచించుకో?

నేను జంతువును కాబట్టి నన్ను వేటాడావు అని అనుకోడానికీ వీలు లేదు. ఎందుకంటే నన్ను వేటాడి, చంపినందువలన నీకు ఏమన్నా ప్రయోజనము ఉందా అంటే అదీలేదు. నా చర్మము దేనికీ పనికిరాదు. నా వెంట్రుకలు, ఎముకలు, మీ వంటి మంచివారు తాకను కూడా తాకరు. నా మాంసము తినడానికి పనికిరాదు. ఏ ప్రయోజనమూ లేకుండా నన్ను ఎందుకు వేటాడావు?

రామా! నీ క్రూర బుద్ధిని ఊహించిన నా భార్య నాకు హితోపదేశము చేసింది. కానీ గర్వాంధుడనై ఆమె ఉపదేశము పెడచెవిని పెట్టాను. తగిన ఫలితము అనుభవించాను. ఒక శీలవతికి దుర్మార్గుడైన భర్త ఉన్నా ఒకటే లేకా ఒకటే. అలాగే నీ రాజ్యానికి, ఈ భూమికి, దుర్మార్గుడైన, శీలవంతుడుకాని నీవంటిరాజు ఉన్నా ఒకటే లేకపోయినా ఒకటే! దొంగచాటుగా దెబ్బతీసేవాడివి, ఇతరులకు అకారణంగా హాని చేసేవాడివి, నీచ బుద్ధి కలవాడివి, పైకి మాత్రం మంచి వాడిగా కనిపిస్తూ లోపల కుచ్ఛితమైన బుద్ధి కలవాడివి, పాపాత్ముడవు అయిన నీవు ఆ దశరథునికి కుమారుడిగా ఎలా జన్మించావో అర్థం కావడం లేదు. సత్పురుషులు, యోగ్యులు అయిన వాళ్లు నిందించే పనిని నీవు చేసావు. వారి ముందు నీ చర్యను ఎలా సమర్థించుకుంటావు?

రామా! నేను నీకు శత్రువును కాను. మిత్రుడను కాను. నీవు నిజంగా వీరుడవు, పరాక్రమ వంతుడివి అయితే నీ శత్రువులతో యుద్ధం చేసి గెలువు. అదీ వీరత్వము అంటే! నేను నీకు శత్రువును అని నీవు అనుకుంటే, నాతో యుద్ధమే చేయాల్సింది. ఈ పాటికి నిన్ను

యమునికి అతిథిగా పంపి ఉండేవాడిని. నన్ను ఎదిరించి పోరాడే ధైర్యము లేక, చేత కాక, చాటున ఉండి నన్ను చంపావు.

మద్యము మత్తులో నిద్రించు వాడిని పాము కాటు వేసినట్టు, నువ్వు నన్ను చాటునుండి చంపావు. నీ భార్యను వెతికి పెట్టడానికి నీవు సుగ్రీవునితోస్నేహం చేసావు అని నాకు తెలిసింది. దానికి ప్రతిఫలంగా సుగ్రీవునికి మేలు చేయడానికి నన్ను చంపావు.

రాజ్యభ్రష్టుడైన సుగ్రీవునితో స్నేహం చెయ్యడానికికి బదులుగా నీవు నా వద్దకు వచ్చి నాతో స్నేహం చేసి ఉంటే నేను ఆ రావణుని కాళ్లు చేతులు కట్టితెచ్చి నీ పాదాల ముందు పడవేసేవాడిని. ఆకాశములో గానీ, పాతాళములోకానీ, నీ సీత ఎక్కడ ఉన్నా వెతికి తెచ్చి నీకు అప్పగించి ఉండేవాడిని.

రామా! సుగ్రీవుడు నాసోదరుడు. నా తరువాత కిష్కింధకు రాజు అవుతాడు. అది ధర్మమే. కానీ నీవు నన్ను చాటునుండి చంపడం మాత్రం అధర్మము. క్షమించరాని నేరము. నీకు చేతనయితే నీవు చేసిన కార్యము ధర్మబద్ధము అని నిరూపించుకో." అని పలికి వాలి మౌనంగా ఉండిపోయాడు.

శ్రీమద్రామాయణము

కిష్కింధా కాండము పదిహేడవ సర్గ సంపూర్ణము

ఓం తత్సత్ ఓం తత్సత్ ఓం తత్సత్

కిష్కింధా కాండము

పదునెనిమిదవ సర్గ.

వాలి అన్న మాటలు అన్నీ ఓపికగా విన్నాడు రాముడు. వాలి మౌనం వహించగానే రాముడు వాలి చేసిన ఆరోపణలను అన్నీ సమర్థవంతంగా తిప్పికొట్టాడు.

"ఓ వాలీ! నీకు ధర్మము, అర్థము, కామము అంటే ఏమిటో తెలియవు. లోక మర్యాదలు తెలియవు. నన్ను మాత్రము నీ ఇష్టం వచ్చినట్టు నిందించావు. నాతో మాట్లాడే ముందు. నన్ను నిందించే ముందు, నీవు నీ పెద్దలతో, పండితులతో చర్చించి ఉండాల్సింది.

ఈ అరణ్యములు, పర్వతములు, సమస్తజంతుజాలము అన్నీ ఇక్ష్వాకు వంశపు రాజులకు చెందినవి. ఈ అడవిలోని జంతు జాలమును. మనుష్యులను, రాక్షసులను రక్షించడానికి కానీ, శిక్షించడానికి కానీ, ఇక్ష్వాకు వంశము రాజులకే అధికారము కలదు. ప్రస్తుతము ఈ భూమినంతా భరతుడు పరిపాలిస్తున్నాడు. అతడు నిత్యసత్యవ్రతుడు. ధర్మము తెలిసినవాడు. దుష్టశిక్షణ, శిష్టరక్షణ చేయగల సమర్ధుడు. భరతుడు దేశ,కాల,మాన పరిస్థితులను గుర్తెరిగి పాలించే రాజు.

భరతుని ఆజ్ఞమేరకు, ధర్మరక్షణ చేయుటకు, మేము ఈ ప్రాంతం అంతా సంచరిస్తున్నాము. ధర్మనిరతుడైన భరతుని పాలనలో అధర్మమునకు తావు లేదు. ధర్మవిరుద్ధముగా ఎవరూ ప్రవర్తించరు. కాని మేము భరతుని ఆజ్ఞమేరకు ధర్మవిరుద్ధముగా ప్రవర్తించే వారిని

గుర్తించి, వారిని తగిన విధంగా శిక్షిస్తూ, ధర్మరక్షణ చేస్తూ ఉంటాము. ఆ క్రమంలో మేము నీ రాజ్యమునకు వచ్చాము. నీవు ధర్మాతిక్రమణ చేసినట్టు ఋజువు అయింది. కామభోగములకు ప్రాధాన్యము ఇచ్చి, నిందార్హమైన పనులుచేసినట్టు మా దృష్టికి వచ్చింది.

నీకు ధర్మం గురించి చెబుతాను విను. జన్మనిచ్చిన తండ్రి, తనకన్నా ముందు పుట్టిన అన్న, విద్య చెప్పిన గురువు, వీరు ముగ్గురూ కన్న తండ్రితో సమానము. అలాగే, తన కన్నా తరువాత పుట్టిన తమ్ముడు, తన కుమారుడు, తన శిష్యుడు. పుత్రసమానులు. ఓ వానరా! సత్పురుషులు ఆచరించే ధర్మమును కేవలము ఆత్మతో తెలుసువలెనే కానీ, బాహ్య కర్మల వలన తెలుసుకోలేరు. గుడ్డి వాడిని మరొక గుడ్డివాడు నడిపించినట్టు, చంచల స్వభావుడవైననీవు, నీ మాదిరే చంచల స్వభావులైన నీ తోటి వానరులతో ఆలోచించి ధర్మాధర్మనిర్ణయము చేయగలవా!

నీవు ఇంతవరకూ నేను నిన్ను చంపాను అన్న కోపంతో మాట్లాడావు. నేను నిన్ను ఎందుకు చంపానో చెబుతాను విను. నీ తమ్ముని భార్య నీకు కోడలి వంటిది. నీవు ధర్మము తప్పి నీ సోదరుడు జీవించి ఉండగానే అతని భార్య రుమను కామాంధుడవై నీ వద్ద ఉంచుకున్నావు. ఓ వానరా! నీవు ధర్మమును అతిక్రమించి నీ తమ్ముడి భార్మను కామవాంఛతో తాకావు కాబట్టి, నీవు చేసిన పాపమునకు నీకు మరణదండన విధించడమైనది. లోకాచారమును మరిచి, ధర్మవిరుద్ధముగా ప్రవర్తించు వారికి మరణ దండనే సరి అయిన ప్రాయశ్చిత్తము.

నేను ఉత్తమ కులములో పుట్టిన క్షత్రియుడను. ఇటువంటి అధర్మకార్యము సహించను. ఎవరైనా కామము చేత తన కుమార్తెను, సోదరిని, తమ్ముని భార్యను కోరితే, వారికి దండన విధించడం క్షత్రియ ధర్మము. ఆ ధర్మమే నేను నిర్వర్తించాను.

మరలా చెబుతున్నాను. ఈ భూమి అంతా భరతుని రాజ్యములోనిది. మేము భరతుని ఆజ్ఞను పాలిస్తున్నాము. ధర్మరక్షణ చేస్తున్నాము. నీవు ధర్మమార్గము తప్పి నడుస్తున్నావు అని తెలిసి కూడా నిన్ను ఎలా క్షమించగలము. ధర్మము ప్రకారము రాజ్యము చేయు భరతుడు అధర్మపరులను నాశనం చేస్తాడు. మేము భరతుని ఆజ్ఞమేరకు నీవంటి అధర్మపరులను శిక్షించడానికి కంకణము కట్టుకున్నాము.

ఓ వానర రాజా! నీవు అన్నట్టు నేను సుగ్రీవునితో స్నేహం చేసాను కానీ, ధర్మబద్ధంగా స్నేహము చేసాను. దానికి మూలము రాజ్యము, నా భార్యసీత. సుగ్రీవుడు నాకు సాయం చేస్తాడు. నేను అతనికి సాయం చేస్తాను. రెండూ ధర్మబద్ధంగా చేసే సహాయాలే. నేను వానరుల ఎదుట, నిన్ను చంపి సుగ్రీవునికి రాజ్యము ఇప్పిస్తానని ప్రతిజ్ఞ చేసాను. ఆ ప్రతిజ్ఞను నెరవేర్చుకున్నాను. ఇందులో తప్పేముంది. ధర్మబద్ధంగా చేసిన ప్రతిజ్ఞనునెరవేర్చడం క్షత్రియ ధర్మం కదా!

నేను పైన చెప్పిన కారణముల వలన నీకు ధర్మబద్ధంగా తగిన దండన విధింపబడింది. ఆ దండన నీవు అంగీకరించక తప్పదు. నీకు దండన విధించడం ధర్మసమ్మతము అని నీవు గ్రహించాలి. నేను ధర్మమును పాటిస్తున్నాను కాబట్టి స్నేహితుడ వైన నీకు దండన విధించి

ఉపకారమే చేసాను.

ఈ సందర్భంలో నీకు మనువుచెప్పిన మాటలు వినిపిస్తాను. విను. పాపములు చేసిన మానవులు, రాజులచే దండింపబడి, వారు చేసిన పాపములనుపోగొట్టుకొని, పుణ్యాత్ములై స్వర్గమునకు వెళ్తారు. చేసిన పాపమునకు దండన అనుభవిస్తే, ఆ పాపము పోతుంది. ఆ నేరము చేసిన వాడు పాపము నుండి విముక్తుడవుతాడు. ఒక వేళ రాజు పాపము చేసిన వాడికి దండన విధించకపోతే, ఆ పాపము రాజుకు సంక్రమిస్తుంది. పూర్వము మాంధాత అనే చక్రవర్తి, నీవు చేసినటువంటి పాపమే చేసిన ఒక వ్యక్తిని దండించకుండా వదిలిపెట్టాడు. దాని ఫలితంగా, అతడు చేసిన పాపము మాంధాతకు సంక్రమించింది. ఒక్క మాంధాత కాదు. ఎంతో మంది రాజులు, దండించతగిన వారిని దండించకుండా వదిలిపెట్టి, పాపములను పొందారు.

ఓ వానర రాజా! నేనేదో స్వతంత్రంగా ప్రవర్తించి నిన్ను చంపాను అని అనుకోవద్దు. నేనుస్వతంత్రుడను కాను. ధర్మశాస్త్రము ప్రకారము నడుచుకోవలసిన వాడను. నా ఇష్టం వచ్చినట్టు చేయడానికి వీలులేదు.

ఓ వానర రాజా! నిన్ను దండించుటకు మరొక కారణము కూడా చెబుతాను విను. మానవులకు, ప్రత్యేకించి క్షత్రియులకు, వేట నిషిద్ధము కాదు. జంతువులను వేటాడేటప్పుడు మాటు వేసిచంపడం సర్వసాధారణం. వేటలో మృగములు పరుగెత్తుతున్నా, భయపడి నిలిచిపోయినా, ఏమరిపాటుగా ఉన్నా, అటువంటి మృగములను

చంపడం పాపం కాదు. ధర్మము తెలిసిన ఎంతో మంది రాజర్షులు కూడా వేటకు వెళ్లేవారు. నీవు వానరుడవు. మృగజాతికి చెందినవాడివి. అందుకని క్షత్రియధర్మము ప్రకారము నిన్ను వేటాడాను. నీవు నాతో యుద్ధం చేస్తున్నా లేక సుగ్రీవుడితో యుద్ధం చేస్తున్నా, నువ్వు వానరుడివే కదా! నువ్వు నాతో యుద్ధం చేసేటప్పుడు మాత్రమే చంపాలి అనే నియమం లేదు. అందుకని ఒక రాజుగా నిన్ను దండించే ప్రక్రియలో భాగంగా నిన్ను చంపాను.

రాజులు ధర్మమును రక్షించడానికే పుట్టారు. క్షత్రియులు మానవరూపంలో భూమి మీద నడయాడుతున్న దేవతలు. అందుచేత దండన విధించిన రాజులను నిందించడం ధర్మం కాదు. నేను మా తండ్రి తాతల నుండి అనుసరిస్తున్న ధర్మము ప్రకారము నీకు దండన విధించాను. నీవేమో ధర్మం తెలియక నన్ను నిందించావు." అని అనునయంగా చెప్పాడు రాముడు.

రాముని మాటలు విన్న వాలికి కనువిప్పు కలిగింది. ధర్మము తెలుసుకున్న వాలి, రాముని యందు తప్పులేదని గ్రహించాడు. అప్పుడు వాలి రామునికి నమస్కరించి ఇలా అన్నాడు.

"ఓ రామా! నీవు చెప్పినది అక్షరసత్యము. ఏ సందేహమూ లేదు. ధర్మం తెలియకుండా, అజ్ఞానంతో నేను పలికిన మాటలను పట్టించుకోవద్దు. నీవు అన్ని ధర్మములను తెలిసిన వాడవు. ప్రజలకు మేలుచెయ్యాలని ఎల్లప్పుడూ కోరుకొనేవాడివి. అందుకని ధర్మాధర్మ నిర్ణయమునకు నీవే సమర్థుడివి.

ఓ రామా! నేను అధర్మంగా ప్రవర్తించాను. తగిన దండన అనుభవించాను. రామా! నా దిగులు అంతా నా కుమారుడు అంగదుడి గురించి. అంగదుడు చిన్నప్పటి నుండి చాలా గారాబంగా పెరిగాడు. నేను కనపడకపోతే ఆహారమూ నీరూ ముట్టడు. నా కుమారుడు చిన్నవాడు. లోకానుభవము లేదు. వాడిని నీవు రక్షించాలి. నీవు సుగ్రీవుని యందు ఎంతటి అనురాగం చూపుతావో అదే మాదిరి అంగదుని కూడా దయతో చూడు.

ఓ రామా! నీవు నీ తమ్ములు లక్ష్మణుని, భరతుని ఏ విధంగా మన్నిస్తావో, అదే మాదిరి సుగ్రీవునీ, అంగదునీ మన్నించు. చేసిన తప్పంతా నాదే. ఇందులో నా భార్య తారకు ప్రమేయం లేదు. నేను చేసిన అపరాధమునకు నా భార్య తారను నా తమ్ముడుసుగ్రీవుడు అవమానించకుండా చూడు.   నా భార్య తార నీ గురించి చెప్పి నన్ను వారించినా, నేను ఆమె మాటలను పెడచెవిని బెట్టి సుగ్రీవునితో యుద్ధానికి తలపడినందుకు ఫలితంగా నీ చేతిలో మరణిస్తున్నాను." అనిపలికి మౌనంగా ఉన్నాడు వాలి.

వాలి పలికిన పలుకులు విన్న రాముడు ఈ విధంగా సమాధానం ఇచ్చాడు. "ఓ వానర రాజా! నీ కొడుకు అంగదుని గురించి, నీ భార్య తార గురించి నీవు దిగులు చెందవద్దు. మరొక మాట. నేను నిన్ను అనవసరంగా అన్యాయంగా చంపానని నీవు మనసులో బాధపడవద్దు. నీవేదో మహా పాపము చేసావని తలంచ వద్దు. నీవు పొరపాటు చేసావు. నేను నిన్ను దండించడానికి నిశ్చయించుకున్నాను. శిక్షింప తగ్గవాడిని శిక్షించిన రాజు, శిక్ష అనుభవించతగి ఉండి. ఆ శిక్షను అనుభవించిన నేరస్తుడు, ఇద్దరూ

ఉత్తమ గతులుపొందుతారు. ఆ కారణం చేత తప్పుచేసిన నీవు నేను విధించిన దండనతో నీవు చేసిన పాపములు అన్నీ తొలగిపోయాయి. నీవు ఇప్పుడు నీ సహజమైన వాలి స్థితిని (సుగ్రీవుని వెళ్లగొట్టి అతని భార్య రుమను కామంతో పొందక ముందు ఉన్న స్థితి) పొందావు.

ఓ వాలీ! ఇది దైవ నిర్ణయము. దీనిని తప్పించుకోలేవు. కాబట్టి నీలో ఉన్న కోపమును మోహమును విడిచి శాంతము వహించు. నీవు కోరినట్టు గానే, అంగదుడు ఇప్పటిదాకా నీ పట్ల ఎంతటి అనురాగాన్ని, ప్రేమను ప్రదర్శిస్తున్నాడో, సుగ్రీవుని పట్ల, నా పట్ల అదే అనురాగాన్ని ప్రదర్శించగలడు." అని వాలిని అనునయించాడు రాముడు.

రాముని మాటలను విని వాలి "ఓ రామా! నీవు నన్ను బాణంతో కొట్టి చంపావు అన్న కోపంలో శక్తి తగ్గి, కోపం పెరిగి, నిన్ను ఏమేమోఅన్నాను. నన్నుక్షమించు." అని అన్నాడు వాలి.

తాను చేసిన ఆరోపణలకు రాముడు ఇచ్చిన సమాధానానికి హేతుబద్ధమైన ప్రతిసమాధానాన్ని ఇవ్వలేకపోయాడు వాలి. పైగా అవసాన దశలో ఉన్నాడు. శరీరం క్షణక్షణానికి క్షీణించి పోతూ ఉంది. శక్తి తగ్గిపోతూ ఉంది. వాలి ప్రాణాలు అతని దేహాన్ని విడువ డానికి సిద్ధంగా ఉన్నాయి. ఆ సమయంలో వాలి స్పృహ తప్పి పడిపోయాడు.

శ్రీమద్రామాయణము

కిష్కింధా కాండము 18 సర్గ సంపూర్ణము

ఓం తత్సత్ ఓం తత్సత్ ఓం తత్సత్

కిష్కింధా కాండము 19 సర్గ

వాలిని రాముడు తన బాణంతో కొట్టడం, వాలి పడిపోవడం, చనిపోయే స్థితిలో ఉండటం వాలి భార్య తారకు తెలిసింది. వాలి, తారల కుమారుడు అంగదుడు ఆమె పక్కనేఉన్నాడు. తార, అంగదులు వాలి దుర్మరణానికి ఎంతో దు:ఖించారు. వాలి దగ్గరకు పరుగు పరుగున వస్తున్నారు.

అప్పటికే, ధనుస్సును ధరించి, కాలయముని మాదిరి నిలబడి ఉన్న రాముని చూచి వానరులు అందరూ పారిపోయారు. పారి పోతున్న వానరులను చూచింది తార. తార వారిని చూచి ఇలా పలికింది. "ఓ వానరులారా! ఇప్పటి వరకూ మీరు మీ రాజు వాలి వెంట ఉండే వాళ్లు కదా. ఇప్పుడు ఎందుకు ఇలా పారిపోతున్నారు. రాజ్యం కోసరం సుగ్రీవుడు, తాను ఏమీ చేయలేక, రాముని సాయంతో మీ రాజు వాలిని చంపించాడు. మీరు ఎందుకు పారిపోతున్నారు? భయపడకండి. పారిపోకండి. నాతో రండి." అని అన్నది తార.

పారిపోతున్న వానరులు తార మాటలు విని వెనక్కు తిరిగి వచ్చారు. తారను చూచి ఇలా అన్నారు. "అమ్మా తారా! ముందు నీవు, నీ కుమారుడు అంగదుడిని రక్షించుకో. లేకపోతే రాముడు అంగదుడిని కూడా చంపుతాడు. సుగ్రీవునికి అడ్డం లేకుండా చేస్తాడు. రాముడు వాలిని చంపగానే, మేమందరమూ భయంతో పారిపోయాము. అమ్మా తారా! నీవు అంగదుని రాజుగా అభిషేకించు. మేమందరమూ అంగదుని, వాలిని సేవించినట్టు సేవిస్తాము." అని ఎవరికి తోచినట్టు

వారు అరిచారు.

మరి కొందరు తారను చూచి "తారా! నీవు అంగదుడు ఇక్కడ ఉండటం మంచిది కాదు. సుగ్రీవుడు, అతని మంత్రులు రాజదుర్గములను ఆక్రమించుకుంటున్నారు. ఇప్పటిదాకా మనము సుగ్రీవుని అతని మంత్రులను నానా కష్టాలుపెట్టాము. వాళ్లు ఇప్పుడు మనమీద పగతీర్చుకొనే అవకాశం ఉంది. కాబట్టి నీవు అంగదునితో కలిసి పారిపో" అని సలహా ఇచ్చారు.

ఆ మాటలు విన్న తార వారితో ఇలా అంది.
"ఓ వానరవీరులారా! నా సర్వస్వము అయిన నా భర్త పోయాక, నాకు ఈ రాజ్యంతో, నా కొడకుతో, ఈ శరీరంతో పనేముంది. నేను నా భర్త వద్దకు వెళ్లాలి. నా భర్త ఎక్కడ ఉన్నాడు. ఏస్థితిలో ఉన్నాడు." అంటూ ఏడుస్తూ వాలి వద్దకు పరుగెత్తింది.

దుందుభి లాంటి రాక్షసులను మట్టుబెట్టిన వాలి, పరాక్రమంలో దేవేంద్రునితో సమానమైన వాలి, మరణావస్థలో నేలమీద పడి ఉండటం చూచింది. వాలి దేహము పక్కన ధనుస్సు ఊతంగా పట్టుకొని నిలబడి ఉన్న రాముని, లక్ష్మణుని, తన భర్త వాలి తమ్ముడు సుగ్రీవునీ చూచింది. నేరుగా వెళ్లి తన భర్త శరీరం మీద పడిపోయింది. "ఆర్య పుత్రా! లేవండి. నేను మీ తారను వచ్చాను లేవండి." అంటూ రోదిస్తూ ఉంది.

తన వదిన తారను, తన అన్నకుమారుడు అంగదుని చూచి సుగ్రీవునికి దు:ఖము ఆగలేదు.

శ్రీమద్రామాయణము
కిష్కింధా కాండము పంతొమ్మిదవ సర్గ సంపూర్ణము
ఓం తత్సత్ ఓం తత్సత్ ఓం తత్సత్

కిష్కింధా కాండము
ఇరవదవ సర్గ.

రాముని బాణం దెబ్బతిని చావుబతుకుల్లో ఉన్న భర్త వాలిని చూచి తార భోరున ఏడిచింది. "ఓ వీరుడా! నీవు లోకోత్తర వీరుడవే. నీ వీరత్వము, పరాక్రమము ఏమైపోయాయి. ఎందుకు ఇలా దీనంగా నేల మీద పడి ఉన్నావు. నేను, నీ భార్య తారను, వచ్చాను. లే. నన్ను పలకరించు. నీవు మహారాజువు. ఇలా నేల మీద పడుకోవడం తగునా. లేచి మెత్తని హంసతూలికా తల్పం మీద పడుకో. ఓ భూనాధా! ఇన్నాళ్లు ఈ భూమిని పాలించిన నీవు, అవసాన సమయంలోకూడా భూదేవిని వదల లేక. ఆమెను కౌగలించుకొని పడుకున్నావా!

ఓ వానరవీరా! ఎంతో కష్టపడి, స్వర్గాన్ని తలదన్నే విధంగా, ఈ కిష్కింధను నిర్మించావు. ఇప్పుడు ఆ కిష్కింధను వదిలి ఎక్కడకు పోతున్నావు? నాధా! నేను నీ వియోగము తట్టుకోలేకున్నాను. నన్ను విడిచి వెళ్లవద్దు. నిన్ను ఈ స్థితిలో చూచి కూడా నా హృదయం బద్దలు కాలేదంటే, నా గుండె కఠినమైన పాషాణము అనుకుంటాను. అయినా కాలగతిని ఎవరు తప్పించగలరు. ఈ కాలమే నిన్ను సుగ్రీవుని

చేతిలో మరణించేట్టు చేసింది.

నాథా! నేను నీకు భార్యగా ఉన్నాను. నేను కాకుండా ఎంతో మంది స్త్రీలు ఉన్నారు కదా! కానీ నీవు ఆ సుగ్రీవుని భార్యను కోరుకున్నావు. అతనిని రాజ్యము నుండి వెళ్లగొట్టావు. దాని ఫలితమే నీకు సంప్రాప్తించిన ఈ దుర్మరణం. నాథా! నీవు సుగ్రీవునితో యుద్ధానికి పోకముందు ఎన్నోవిధాలుగా చెప్పాను. సుగ్రీవునితో సంధి చేసుకోమన్నాను. కానీ నీవు నా మాటలను పెడచెవిని పెట్టావు. పైగా నన్ను నిందించావు. కోరి కోరి మరణాన్ని కౌగలించుకున్నావు.

నాథా! రాముడు నిన్ను చంపినందుకు నేను విచారించడం లేదు. కానీ ఏ నాడూ కష్టము గానీ, దు:ఖము కానీ అనుభవించని నేను ఈ వైధవ్య దు:ఖమును అనుభవించవలసి రావడం చాలా బాధగా ఉంది. నాథా! నీ కుమారుడు అంగదుని చూడండి. చిన్నప్పటి నుండి అల్లారుముద్దుగా పెరిగాడు. ఇప్పుడు పినతండ్రి సుగ్రీవుని వశమయ్యాడు. ఎన్ని బాధలు పడతాడో ఏమో!

నాయనా! అంగదా! నీ తండ్రివాలిని చూడు. కడసారి దర్శనం చేసుకో. ఇంక మీదట రోజూ చూచే నీ తండ్రి ముఖం రేపటి నుండి నీకు కనిపించదు. నాథా! నీ కుమారుడు అంగదుడు నిన్నుపిలుస్తున్నాడు. అంగదుని పలకరించు. అతనికి జీవితంలో నడుచుకోవలసిన జాగ్రత్తలు చెప్పు.

నాథా! నిన్ను చంపడం ద్వారా రాముడు తన ప్రతిజ్ఞను నెరవేర్చుకున్నాడు. సుగ్రీవునికి ఇచ్చిన మాటను నిలబెట్టుకున్నాడు.

ఓ సుగ్రీవా! నీ కోరిక తీరింది కదా! ఇంక నీ భార్య రుమ నీకు లభిస్తుందిలే. నీవు ఏ దిగులు, భయమూ లేకుండా ఈ కిష్కింధను ఏలుకో! నీ అన్న వాలిని చంపించావు కదా! ఇంకనీకు అడ్డేముంది.

నాధా! నేను ఇంతగా మాట్లాడుతున్నా నువ్వు ఒక్కమాట కూడా పలుకవేమి? మాట్లాడు. నేనే కాదు. నీ భార్యలందరూ వచ్చి ఉన్నారు. వారి వంక కన్నెత్తి చూడు. వారిని పలకరించు." అని తార, ఆమెతో వచ్చిన వాలి భార్యలు వలా వలా ఏడుస్తున్నారు. అంగదుని పట్టుకొని రోదిస్తున్నారు.

తారకు ఇంకా ఆశ చావలేదు. వాలి మరలా బతుకుతాడని ఆశతో వాలిని కుదిపి కుదిపి ఏడుస్తూ ఉంది. "ఓ నాధా! నేను, అంగదుడు ఏమి అపరాధము చేసామని మమ్ములను విడిచి పోతున్నావు. తెలిసో తెలియకో మేము నీ పట్ల ఏమైనా అపరాధము చేస్తే దానిని క్షమించు. నీ పాదాలు పట్టి వేడుకుంటున్నాను." అని వాలి పాదాల మీద తల పెట్టి ఏడుస్తూ ఉంది తార. భర్త లేని బతుకు తనకు వ్యర్థమని ఎంచి, తార తన భర్త వాలితో పాటు ప్రాయోపవేశము చెయ్యాలని నిర్ణయించుకుంది.

శ్రీమద్రామాయణము
కిష్కింధా కాండము ఇరువదవ సర్గ సంపూర్ణము
ఓం తత్సత్ ఓం తత్సత్ ఓం తత్సత్

కిష్కింధా కాండము

ఇరువది ఒకటవ సర్గ.

తార అలా ఏడుస్తుంటే హనుమంతుడు ముందుకు వచ్చి ఆమెను ఓదారుస్తున్నాడు.

"అమ్మా! తారా! మనము చేసిన కర్మలను బట్టి ఫలితాలు వస్తుంటాయి. వాలి తాను చేసిన అకృత్యములకు ఫలితము అనుభవించాడు. దీనికి చింతించి ప్రయోజనము లేదు. ఈ దేహములు నీటి బుడగలు. కాలానుగుణంగా అవి బద్దలు అవుతుంటాయి. అందరూ ఎప్పుడో ఒకప్పుడు పోవలసిన వారమే. పోయిన వాలి గురించి విచారించే కంటే బతికి ఉన్న అంగదుని క్షేమం గురించి విచారించు. పుట్టిన ప్రతి ప్రాణీ చావక తప్పదు. కాబట్టి చనిపోయిన వారి గురించి ఆలోచించక, నీ శేషజీవితములో శుభం కలగాలని కోరుకో! అదే ప్రస్తుత కర్తవ్యము.

ఇప్పటి దాకా ఈ కిష్కింధలో ఉన్న వేలకొలది వానరులు వాలి సంరక్షణలో హాయిగా జీవించారు. ఇప్పుడు వాలి లేడు. స్వర్గమునకు వెళ్లాడు. స్వర్గసుఖములు అనుభవించుచున్న వాలి గురించి దు:ఖించడం అవివేకము. ఈ కిష్కింధలో ఉన్న వేలాది వానరులకు, భల్లూకములకు వాలి మరణానంతరము నీవు, అంగదుడు రక్షకులు. అంగదునికి పట్టాభిషేకము చేస్తాము. నీ సంరక్షణలో అంగదుడు రాజ్యము చేస్తాడు. తదుపరి కార్యక్రమములు

నిర్వర్తించమని సుగ్రీవునికి ఆదేశములు ఇవ్వు. ఇప్పుడు అంగదుడు, సుగ్రీవుడు, వాలికి శాస్త్రములలో నిర్ణయింపబడినట్టు ఉత్తర క్రియలు నిర్వహించాలి. వాలికి దహన సంస్కారములు చెయ్యాలి." అని పలికాడు హనుమంతుడు.

భర్త మరణముతో బాధ పడుతున్న తార, హనుమంతుని మాటలు విని ఇలా అంది. "హనుమా! నాకు నా భర్త లేకపోయిన తరువాత అంగదుని వంటి కుమారులు నూరు మంది ఉన్నా ఏమి ప్రయోజనము. నా శక్తి, నా సామర్థ్యము అన్నీ నా భర్తతోనే పోయాయి. నేను అశక్తురాలను. అన్ని వ్యవహారములు అంగదుని పినతండ్రి సుగ్రీవుని ఆజ్ఞప్రకారమే చెయ్యండి. అంగదుని యోగక్షేమములు విచారించుటకు నేను అర్హురాలిని కాను. అది తండ్రి బాధ్యత. తండ్రి లేనపుడు పినతండ్రి బాధ్యత. కాబట్టి అంగదుని యోగక్షేమముల గురించి సుగ్రీవుడు చూచుకొన గలడు. ఇన్నాళ్లు నేను నా భర్త వాలిని సేవించాను. ఇప్పుడు ఆయన పోయిన మార్గమునే అనుసరిస్తాను. నా భర్త పక్కనే నేను ఉంటాను. ఇది నా నిశ్చయము." అని పలికింది తార.

శ్రీమద్రామాయణము

కిష్కింధా కాండము ఇరువది ఒకటవ సర్గ సంపూర్ణము

ఓం తత్సత్ ఓం తత్సత్ ఓం తత్సత్

కిష్కింధా కాండము

ఇరువది రెండవ సర్గ.

అప్పటికి వాలి ప్రాణాలు ఇంకా పోలేదు. కొన ఊపిరితో కొట్టుకుంటున్నాడు. నెమ్మదిగాకళ్లు తెరిచాడు. తార వంక చూచాడు. తన కుమారుడు అంగదుని వంక, తార వంక మార్చి మార్చి చూచాడు. సుగ్రీవుని తన దగ్గరకు పిలిచాడు. అతి కష్టం మీద ఇలా అన్నాడు.

“సుగ్రీవా! నేను నీ పట్ల చాలా అపరాధము చేసాను. నన్ను క్షమించు. నా బుద్ధి వక్రించి నీ భార్యను నా దగ్గర ఉంచుకొని నిన్ను రాజ్యము నుండి వెడలగొట్టాను. మన ఇద్దరిలో ఎవరో ఒకరే ఉండవలెనని బ్రహ్మ రాసి ఉన్నాడు. అందుకే నేను యమలోకమునకు పోతున్నాను. నీవు ఈ కిష్కింధను పాలించు. ఎవరి చేతిలోనూ ఓడి పోని నేను రామునిచేతిలో ఓడిపోయాను. ధర్మానికి ఓడిపోయాను.

నా మరణావస్థలో నేను నీకు ఒక మాట చెపుతాను. సావధానంగా విను. వీలైతే ఆచరణలో పెట్టు. నా కొడుకు అంగదుడు. చిన్నవాడు. చూడు ఎలా నేల మీద పడి పొర్లుతున్నాడో. అంగదుడు చిన్నప్పటి నుండి. సుఖాలలో పెరిగాడు. కష్టము అంటే ఎరుగడు. వాడిని నేను నా ప్రాణముల కంటే ఎక్కువగా చూచుకున్నాను. నా కుమారుడు అంగదుని నీ కుమారునిగా భావించు. వాడికి ఏ లోటూ రాకుండా చూచుకో. ఇంక మీదట నుండి అంగదునికి తండ్రివి, దాతవు, రక్షకుడివి, అభయ ప్రదాతవు అన్నీ నువ్వే.

అంగదుడు నీకు అన్ని విధాలా తోడ్పడగలడు. యుద్ధములో

నీకు అండగాఉండి అన్ని విధాలా నా కొడుకు అనిపించుకుంటాడు. ఇంక ఈమె నా భార్య తార. సుషేణుని కుమార్తె. ఎంతటి క్లిష్ట సమస్యనైనా చక్కగా ఆలోచించి నిర్ణయాలు తీసుకోడంలో సమర్థురాలు. ఎటువంటి ఉపద్రవకర పరిస్థితులకు కూడా ఎదురు నిలిచి, సమర్థంగా ఎదుర్కొనే సామర్థ్యం కలది. తార ఆలోచించి చేయమన్న కార్యమును నీవు నిస్సందేహంగా చేయవచ్చును. నీకు జయం లభిస్తుంది.

తరువాత, నీవు రామునితో ఏ కార్యము నిమిత్తము మైత్రి చేసుకున్నావో ఆ కార్యమును తక్షణం నెరవేర్చు. రాముడిని అవమానించకు. మోసగించకు. అలాచేస్తే రాముడు నా మాదిరి నిన్ను కూడా చంపుతాడు.

సుగ్రీవా! నా మెడలో ఉన్న బంగారు మాల నాకు ఇంద్రుడు ఇచ్చాడు. దానిని నీవు వెంటనే తీసుకో. అది నా ఒంటిమీద ఉండగా నేను చనిపోతే దానికి శవదోషం తగులుతుంది. అప్పుడు దాని మహత్తు పోతుంది. కాబట్టి వెంటనే తీసుకొని నీ మెడలో వేసుకో." అని అన్నాడు వాలి.

వాలి మాటలు విని సుగ్రీవునికి దు:ఖము పొర్లుకొచ్చింది. ఏడుస్తూనే వాలి మెడలో ఉన్న బంగారు మాలను తీసుకొని తనమెడలో వేసుకున్నాడు. వాలి అంగదుని వంక చూచి ఇలా అన్నాడు. "కుమారా! అంగదా! ఇంక మీదట నీకు అన్నీ నీ పినతండ్రి సుగ్రీవుడే. సు:ఖము వచ్చినా, దు:ఖము వచ్చినా ఓర్చుకో. కాలానుగుణంగా ప్రవర్తించు. సుగ్రీవుని ఆజ్ఞలను పాలించు. నేను కాబట్టి నీవు ఏమి చేసినను

ఓర్చుకున్నాను. సహించాను. కాని ఇదివరకటి మాదిరి చేస్తే సుగ్రీవునికి కోపం రావచ్చు. కాబట్టి జాగ్రత్తగా నడుచుకో. సుగ్రీవునికి కోపం తెప్పించకు.

ఇంకొక మాట. నీవు ఇంక మీదట సుగ్రీవుని అధీనంలో ఉండబోతున్నావు. సుగ్రీవుని శత్రువులతో స్నేహం చేయకు. అలాగే సుగ్రీవుని మిత్రులతో శత్రుత్వం పెట్టుకోకు. సుగ్రీవునికి ఇష్టమైన పనులనే చేస్తూ ఉండు. ఇంకొక విషయం. నీవు ఎవరి పట్ల ఎక్కువ ప్రేమ, అలాగే ఎక్కువ ద్వేషము కలిగి ఉండకు. ఎందుకంటే అతిగా ఉండటం ఎప్పుడూ అనర్థాలకు దారి తీస్తుంది. కాబట్టి రాగద్వేషాలలో సమతుల్యం పాటించు. మధ్యస్తంగా వ్యవహరించు."

అలా మాట్లాడుతూనే వాలి ఆఖరిశ్వాస విడిచాడు. వాలి మరణించాడు అని తెలియగానే వానరులందరూ బిగ్గరగా ఏడవడం మొదలెట్టారు. వాలి మరణంతో కిష్కింధా నగరము కళావిహీన మయింది. వాలి యొక్క పరాక్రమము, వీరత్వము, వాలి చేసిన యుద్ధములు, వాలి చంపిన వారి గురించి వానరులు తలచుకొని తలచుకొని ఏడుస్తున్నారు. తన కళ్ల ఎదుటే ప్రాణాలు విడిగిన తనభర్త వాలినిచూచి తట్టుకోలేక తార వాలి శరీరం మీద పడి ఏడుస్తూ ఉంది.

శ్రీమద్రామాయణము
కిష్కింధా కాండము ఇరువది రెండవ సర్గ సంపూర్ణము.
ఓం తత్సత్ ఓం తత్సత్ ఓం తత్సత్

కిష్కింధా కాండము

కిష్కింధాకాండము

ఇరువది మూడవ సర్గ.

తార తన భర్త ముఖాన్ని చూస్తూ తట్టుకోలేక ఈ విధంగా విలపిస్తూ ఉంది. "నాధా! అర్థరాత్రి సుగ్రీవునితోయుద్ధానికి పోవద్దని నేను నీకు శతవిధాలా చెప్పాను. కానీ నీవు నా మాటను పెడచెవిని పెట్టావు. అందుకే నేను ఇక్కడే ఉన్నా భూదేవిని కౌగలించుకొని పడుకున్నావు. ముల్లోకాలను గడగడలాండిచి ఎవరికీ లొంగని నీవు, నీ తమ్ముడు, నీ కన్నా దుర్బలుడైన సుగ్రీవుని చేతిలో ఓడిపాయావా! ఎంత ఆశ్చర్యము.

నాధా! వానర నాయకులు, భల్లూకనాయకులు నిన్ను సేవించడానికి వచ్చారు. లే. వారిని ఆదరించు. వారితో మాట్లాడు. నీవు నీ శత్రువులను చంపి వారిని భూతల శయనము చెందేట్లు చేసావు. ఇప్పుడు నీవు కూడా నీశత్రువు చేతిలో చంపబడి భూతలము మీద శయనించి ఉన్నావా!

నాధా! నన్ను అనాధనుచేసి నీవు ఒంటరిగా వెళ్లిపోవడం నీకు న్యాయంగా ఉందా నాధా! ఈ లోకంలో బుద్ధి ఉన్న వాడు ఎవ్వడూ తన కుమార్తెను వీరుడికి, పరాక్రమవంతుడికి ఇవ్వకూడదు. ఎందుకంటే శూరుడి భార్యకు నా మాదిరి అకాల వైధవ్యము తప్పదుకదా! వారు శోక సముద్రములో మునిగి పోక తప్పదు కదా! నీ మరణము కనులారా చూచికూడా నా హృదయము బద్దలు కాలేదంటే, నా గుండె కటిక పాషాణముతో సమానము కదా! నాధా! ఈ లోకంలో స్త్రీకి ఎన్ని సంపదలు ఉన్నా, ఎంత వైభవము

ఉన్నా, భర్తలేకపోతే ఆమెను విధవ అనే అంటారు. అటువంటి వైధవ్యము నాకు సంప్రాప్తించింది. ఎలాభరించాలి! ఈ సమయంలో నిన్ను తనివిదీరా కౌగలించుకొని ఏడవకుండా నీ శరీరం రక్తసిక్తమయింది. సుగ్రీవుని ఆశలు నెరవేర్చిన ఈ రాముని బాణము ఇంకా నీ శరీరంలో ఎందుకు ?"అంటూ తార వాలి శరీరంలో నుండి రాముని ధనుస్సు వెడలిన బాణమును బయటకు లాగింది.

వాలి శరీరంనుండి రామ బాణమును బయటకు లాగ గానే, ఆ గాయము నుండి రక్తం జలధార మాదిరి పైకి ఉబికింది. తార తన కళ్లనుండి నీరు కారుతుండగా వాలి గాయము నుండి స్రవించిన రక్తాన్ని తుడిచింది. తార తన కుమారుడు అంగదుని చూచి ఇలా అంది.

"నాయనా! అంగదా! నీ తండ్రిని కడసారి చూచి నమస్కారం చెయ్యి."

వెంటనే అంగదుడు పైకి లేచి తన తండ్రి వాలికి భక్తితో నమస్కారం చేసాడు. "నాథా! నేను తమరి కుమారుడు అంగదుడు మీపక్కనే కూర్చుని ఉన్నాము. తమరి కుమారుడు అంగదుడు నమస్కరించు చున్నాడు. ఆశీర్వదించండి" అని విలపించింది తార.

ఓనాథా! మీరు, మీ తమ్ముడు సుగ్రీవునితో యుద్ధము అనే యజ్ఞమును చేసి, మీ భార్యనైన నేను లేకుండానే, రక్తంతో అవభృధ స్నానం చేస్తున్నారా!
(యజ్ఞము చేసిన తరువాత భార్యా భర్తలు కలిసి పవిత్రమైన అవభృధ

స్నానము చేయడం ఆచారం. రాజసూయ యాగము అయిన తరువాత అవభృధ స్నానంతో పవిత్రమైన తనకురులను ఆ దుష్టుడు దుశ్శాసనుడు తాకాడని ద్రౌపది కోపంతో ఊగిపోయింది.)

నా మాట వినకుండా యుద్ధమనే యజ్ఞము చేసి ఒంటరిగా అవభృధ స్నానం చేసారా! నాథా! మరణించింది నీవు మాత్రమే కాదు. నేను, నా కుమారుడు అంగదుడు కూడా మరణించాము. జీవచ్ఛవాల మాదిరి మిగిలిపోయాము. నీవు మమ్ములను విడిచిపోయినట్టు మా ఐశ్వర్యము కూడా మమ్ములను విడిచి పెట్టి పోయింది." అని ఏడుస్తూ ఉంది తార.

శ్రీమద్రామాయణము

కిష్కింధా కాండము ఇరువది మూడవ సర్గ సంపూర్ణము

ఓం తత్సత్ ఓం తత్సత్ ఓం తత్సత్.

కిష్కింధా కాండము

ఇరువది నాలుగవ సర్గ.

వాలి బతికి ఉన్నప్పుడు వాలి చావాలి అని కోరుకున్న సుగ్రీవుడు వాలి మృతదేహము చూడగానే దు:ఖము ఆపుకోలేక పోయాడు. రాముని వద్దకు వెళ్లి ఇలా అన్నాడు.

"రామా! మిత్రమా! ఏదో ఆవేశంలో నా అన్న వాలిని చంపమని నిన్నుకోరాను. కానీ ఇప్పుడు నా అన్న మృతదేహాన్ని ప్రత్యక్షంగా చూస్తుంటే నాకు నా జీవితమే వ్యర్ధము అనిపిస్తూ ఉంది. ఇహలోక భోగముల మీద ఆసక్తి పోయింది. కిష్కింధకు మహారాజు

వాలి మరణించాడు. కిష్కింధా మహారాణి తార, భర్త దేహము మీద పడి ఏడుస్తూ ఉంది. కిష్కింధా నగరమంతా శోకసముద్రంలో మునిగిపోయింది. అంగదుని భవిష్యత్తు ఏమిటో తెలియడం లేదు. ఇవన్నీ చూస్తుంటే నాకూ రాజ్యాభిలాష చచ్చిపోయింది.

రామా! పూర్వము వాలి నా భార్యను అపహరించి, నన్ను రాజ్యము నుండి వెళ్ల గొట్టాడని అతని మీద పట్టరానికోపం ఉండేది. కానీ ఇప్పుడు చచ్చిపడి ఉన్న వాలిని చూస్తుంటే ఆ కోపం అంతా మటుమాయం అయింది. కోపం స్థానంలో దు:ఖము ఆవరించింది. కిష్కింధలో ఉండి రాజ్యము చేసే దాని కన్నా ఇదివరకు మాదిరి ఋష్యమూక పర్వతము మీద కందమూలములు, ఫలములు ఆరగిస్తూ ప్రశాంత జీవనం గడపడం మేలు అనిపిస్తూ ఉంది. నా అన్న వాలి లేకపోయిన తరువాత నాకు స్వర్గ సుఖములు కూడా వృధా అనిపిస్తూ ఉన్నాయి.

రామా! నా అన్న వాలి నన్ను ఎన్నడూ చంపాలి అని అనుకోలేదు. "పోరా పో! ఎక్కడైనా ప్రాణాలతో బతుకు పో" అని అనేవాడు. కాని నేను నా అన్న వాలిని చంపాలని అనుకున్నాను. అది ఆయన గొప్పతనం. ఇది నా అల్పబుద్ధి.

రామా! ఎంత రాజ్యము మీద కోరిక ఉన్నా, అన్నను చంపి రాజ్యము చేయాలనే కోరిక నాకు ఏనాడూ లేదు. నా అన్న వాలి తన ఉదార బుద్ధితో నన్ను చంపడానికి ఏనాడూ ఇష్టపడలేదు. కానీ నేను నా బుద్ధి పెడతోవబెట్టి నా అన్నను చంపడానికి నిన్ను ఆశ్రయించాను. నేను తప్పుచేసినపుడు నా అన్న నన్ను చిన్న చెట్టు కొమ్మతో కొట్టి బుద్ధి చెప్పేవాడు. కాని నేను నా క్రోధముతో, వక్రబుద్ధితో, వానరస్వభావముతో

నా అన్ననే చంపడానికి పూనుకున్నాను. నా అన్నను చంపి ఎనలేని పాపమును మూటకట్టుకున్నాను. ఆ పాపము ఈ జన్మలో తీరేది కాదు. జన్మజన్మలకూ నన్ను వెంటాడుతూ ఉంటుంది.

పూర్వము ఇంద్రుడు విశ్వరూపుని చంపి బ్రహ్మహత్యా పాతకము మూటగట్టుకున్నాడు. ఆ పాపమును భూమికి, జలానికి, వృక్షములకు, స్త్రీలకు, పంచి పెట్టాడు. కాని నేను నాఅన్నను చంపిన పాపమును స్వీకరించడానికి ఎవరు ఉన్నారు రామా! నేను స్వయంగా అనుభవించాలి తప్పదు.

నా అన్నను చంపి నేను అధర్మానికి ఒడిగట్టాను. లోక నిందకు పాల్పడ్డాను. నేను రాజ్యాధికారమునకు అర్హుడను కాను. నేను చేసిన పాపము ఏనుగు రూపంలో నన్ను కకావికలు చేస్తూ ఉంది. నా శరీరంలో మంచితనము మృగ్యము అయి పోయింది.
పాపం ప్రవేశించింది. తండ్రిని పోగొట్టుకొని అంగదుడు జీవించలేడు. కొడుకును పోగొట్టుకొని తార జీవించలేదు. నా అనే వాళ్లు అందరినీ పోగొట్టుకొని నేను మాత్రం జీవించడం ఎందుకు వృధా. నేను నా అన్న వాలితో పాటు అగ్నిలో ఆహుతి అవుతాను. ఈ వానరులు సీతను వెదకడంలో నీకు సాయపడతారు. నేను మరణించినా నీ కార్యము మాత్రం సిద్ధిస్తుంది. కులనాశమునకు కారణమైన నేను ఈ లోకంలో జీవించడం వృధా. నేను మరణించడానికి అనుమతి ఇవ్వండి." అని రాముని ముందు దీనంగా వేడుకున్నాడు.

సుగ్రీవుని మాటలు విని రాముడు కన్నీళ్ల పర్యంతం అయ్యాడు. రాముడు, భర్త శవం మీద పడి ఏడుస్తున్న తార వంక

చూచాడు. తార తల ఎత్తి రాముని వంక చూచింది. చేతిలో ధనుర్బాణములను ధరించి ఠీవిగా నిలబడి ఉన్న సూర్యుని వంటి తేజస్సుతో వెలిగిపోతున్న రాముడిని చూచింది. తన భర్తను చంపిన రాముడు అతడే అని గుర్తించింది. తార, భర్త శవం పక్కనుండి లేచి, రాముని వద్దకు వెళ్లింది.

"రామా! నీవు ధర్మపరుడవు. ఇంద్రియములను జయించిన వాడవు. కీర్తివంతుడవు. అమితమైన పరాక్రమ వంతుడవు. ధనుర్బాణములను ధరించిన వాడవు. నా పట్ల కూడా నీ ధర్మం నెరవేర్చు. భర్తలేనిదే భార్యకు జీవితం లేదు. ఏ బాణంతో నా భర్త ప్రాణం తీసావో అదే బాణంతో నా ప్రాణం కూడా తియ్యి. నన్ను నా భర్త వద్దకు పంపు. దయచేసి ఆ పుణ్యం కట్టుకో. ఎందుకంటే నా భర్త స్వర్గానికి పోయినా అక్కడ ఉన్న అప్సర స్త్రీల వంకచూడడు. నా కోసం ఎదురు చూస్తుంటాడు. నేను దగ్గర లేకపోతే వాలికి స్వర్గం కూడా నిస్సారంగా కనిపిస్తుంది. కాబట్టి నన్ను కూడా చంపి నా భర్త వద్దకు పంపు. నేను స్త్రీ అనీ, స్త్రీని చంపితే స్త్రీ హత్యా పాతకము చుట్టుకుంటుందని సందేహించకు. నేను కూడా వాలినే అనుకో. అప్పుడు నీకు ఆ దోషం అంటదు. ఒకసారి వివాహము అయిన తరువాత భర్త, భార్య వేరు కాదు. ఇరువురి శరీరాలు ఒకటే. ఇది వేదములలో చెప్పబడినది. కాబట్టి వేదవిహితమైన కార్యము దోషము కాదు కదా!

ఓ రామా! ఈ పెద్దలు నన్ను నా భర్తను వేరు చేస్తున్నారు. ఇది న్యాయం కాదు. నువ్వు నన్ను చంపితే నేను కూడా సత్వరమే నా భర్త వద్దకు చేరుకుంటున్నాను. నీవు ఇప్పుడు నన్ను చంపకపోయినా, వాలి లేకుండా నేను ఎక్కువ కాలము జీవించలేను. కాబట్టి నన్ను

వెంటనే చంపు.” అని రాముని దీనంగా వేడుకుంది తార.

దీనాలాపనలు విని రాముడు చలించి పోయాడు. ఆమెను చూచి ఇలా అన్నాడు. “అమ్మా తారా! నువ్వు వీరుని భార్యవు. ఇలా బేలగా మాట్లాడటం తగదు. నువ్వు విపరీతంగా మాట్లాడుతున్నావు. ఈ ప్రపంచాన్ని బ్రహ్మ సృష్టించాడు. సృష్టిలోని అన్ని జాతులకూ సుఖ దు:ఖాలను పెట్టాడు. ఎవరు కూడా బ్రహ్మ సృష్టిని అతిక్రమించ లేరు. కాబట్టి దు:ఖము మాని ఓర్పు వహించు.

కిష్కింధా రాజ్యానికి నీ కుమారుడు యువరాజుగా పట్టాభిషిక్తుడవుతాడు. నీవు వీర పత్నివి. వీర మాతవు. ఇది బ్రహ్మ విధించిన అందరికీ సమ్మతమైన విధానము. దీనిని ఎవరూ అతిక్రమించలేరు. నీ వంటి వీర పత్ని ఇలా విలపించరాదు.”అని రాముడు తారతో చెప్పాడు.

(తార ఇలా సుదీర్ఘంగా విలపించడం ప్రాచ్యపాఠములో లేదని, ఎవరో తదుపరి చేర్చారని పండితుల అభిప్రాయము. అదే కాదు, తార రామునికి ఒక శాపం ఇచ్చినట్టు ప్రాచ్య పాఠంలో ఉందని, “ నాకు నా భర్తకు అకాల వియోగం కల్పించావు కాబట్టి, నీకు తాత్కాలికంగా నీ భార్య లభించినా, శాశ్వతంగా భార్యావియోగం కలుగుతుంది” అని తార రామునికి శాపం ఇచ్చినట్టు ప్రాచ్యపాఠంలో ఉందని పండితుల అభిప్రాయము.)

శ్రీమద్రామాయణము,

కిష్కింధా కాండము ఇరువది నాలుగవ సర్గ సంపూర్ణము

ఓం తత్సత్ ఓం తత్సత్ ఓం తత్సత్

కిష్కింధా కాండము

ఇరువది ఐదవ సర్గ.

తరువాత రాముడు సుగ్రీవుని, తారను, అంగదుని ఓదారుస్తూ ఇలా అన్నాడు. “మీరు ఈ ప్రకారంగా ఒకరికి మించి ఒకరు శోకంతో రోదిస్తుంటే, ఏమీ ప్రయోజనము లేదు. జరుగ వలసిన కార్యము గురించి ఆలోచించండి. మీరు ఈవిధంగా శోకిస్తుంటే మరణించిన వాలి ఆత్మకు శాంతి కలుగదు. లోకాచారము ప్రకారము వాలికి జరుగ వలసిన అంత్య క్రియల గురించి ఆలోచించండి.

ముల్లోకములు కాలమునను సరించి నడుస్తున్నాయి. మానవులు చేసే కర్మలకు అన్నింటికీ కాలమే మూలము. కాలము ననుసరించి అందరూ కాలధర్మము చెందవలసిన వారే. కాకపోతే కొంచెం అటు ఇటు అంతే. సమస్త భూతములను కర్మచేయమని ప్రేరేపించునది కాలమే కదా! అంతే కానీ, ఎవరూ ఎవరినీ ఏమీ చేయలేరు. అలా చేయడానికి సమర్థులు కూడా కారు. జనన మరణాలను నిర్ణయించేది కాలమే కానీ వేరు కాదు. ముల్లోకములు ఆ కాలమునకు లోబడి ప్రవర్తించవలసినదే!

ఆ కాలము కూడా తన ఇష్టంవచ్చినట్టు ప్రవర్తించ జాలదు. దానికీ ఒక నియమము ఉంది. కాలాన్ని మార్చడానికి ఎవరి తరమూ కాదు. ఏ వస్తువూ కాల స్వభావమును దాటలేదు. అంతే కాదు. కాలము ఎవరి పక్షమూ వహించదు. కాలమునకు పక్షపాతము లేదు. కాలమును ఎవరూ వశము చేసుకోలేరు. ఎవరూ జయించలేరు.

మిత్రులు కానీ, శత్రువులు కానీ, జ్ఞాతులు కానీ, ఏ కులము కానీ, ఏ జాతీ కానీ, కాలానుగుణంగా ప్రవర్తించవలసిన వారే కానీ ఎవరూ కాలమును వశపరచుకోలేరు. కాబట్టి తెలివి కలవారు, కాలము యొక్క స్వభావమును పరిశీలించి, తెలుసుకొని, దానికి అనుగుణంగా ప్రవర్తిస్తారు.

వానర రాజు అయిన వాలి ఈ దేహమును విడిచి తన స్వస్వరూపమును పొందాడు. వాలి అశాశ్వతమైన ఈ దేహమును అంటిపెట్టుకొని ఉండక, శాశ్వతమైన స్వర్గలోకమునకు వెళ్లాడు. అందుకని, మీరు వాలి కోసరం శోకించడం మాని, కాలోచితముగా జరగవలసిన కార్యముల గురించి ఆలోచించండి." అని రాముడు కాల స్వభావమును తెలిపి, జరుగ వలసిన కార్యములను జరిపించమని సుగ్రీవునికి చెప్పాడు.

రాముని మాటలు విన్న లక్ష్మణుడు, సుగ్రీవుని వద్దకు వెళ్లి ఇలా అన్నాడు. "ఓ సుగ్రీవా! రాముడు చెప్పిన మాటలు వింటివి కదా! వెంటనే వాలికి జరుగ వలసిన ప్రేతకార్యములు, దహన సంస్కారములు గూర్చి ఆలోచించు. వాలి దహన సంస్కారమునకు కావలసిన ఎండి పోయిన కాష్ఠములు (కట్టెలు) చందనపు కర్రలు తెప్పించు. తండ్రి మరణాన్ని తట్టుకోలేక పోతున్న అంగదుని ఓదార్చు. కిష్కింధకు ఇంక నీవే దిక్కు. పుష్పమాలలు, సుగంధ ద్రవ్యములు, వస్త్రములు, నెయ్యి, ఇతరములు తెప్పించు. వాలిని ఊరేగింపుగా తీసుకొనిపోవుటకు ఒక పల్లకినీ సిద్ధం చేయండి. దానిని మోయుటకు తగిన బలిష్ఠులైన వాహకులను ఏర్పాటు చేయండి. ఈ కార్యములు అన్నీ వేగంగా జరగాలి. ఈ సమయంలో ఆలస్యము పనికిరాదు." అని లక్ష్మణుడు సుగ్రీవునితో చెప్పి, రాముని పక్కన వచ్చి నిలబడ్డాడు.

తారుడు పల్లకినీ దానిని మోయడానికి బలిష్ఠులైన వానరులను సిద్ధం చేసాడు. ఆ పల్లకిలో వాలిని కూర్చోపెట్టడానికి తగిన ఆసనము ఏర్పాటు చేసారు. పల్లకి రాగానే రాముడు లక్ష్మణునితో "ప్రేత కార్యము ప్రారంభించండి" అని ఆదేశించాడు. సుగ్రీవుడు మొదలగు వానరులు వాలిని మంచి వస్త్రములతోనూ, పూలమాలలతోనూ అలంకరించారు. వాలిని పట్టుకొని తీసుకొనివెళ్లి ఆ పల్లకిలో కూర్చోపెట్టారు.

సుగ్రీవుడు తన అనుచరులతో ఇలా అన్నాడు: "ఇప్పుడు మనము అన్నగారైన వాలికి ప్రేతకార్యము నిర్వర్తించాలి. దానికి తగిన ఏర్పాట్లు చేయండి. కొంత మంది వానరులు పల్లకి ముందు నడుస్తూ రత్నములను వెదజల్లండి. భూలోకములో రాజులకు ఏ విధమైన ఐశ్వర్యములు ఉండునో అట్టి ఐశ్వర్యములతో వాలికి అంతిమ సత్కారములు చేయండి" అని ఆజ్ఞాపించాడు.

సుగ్రీవుని ఆజ్ఞ ప్రకారము వాలికి అంతిమ సంస్కారాలు జరిగాయి. తారుడుమొదలగు వానరులు తండ్రిని కోల్పోయిన అంగదుని పట్టుకొని విలపిస్తూ పల్లకీ వెంట వెళ్లారు. వాలి భార్యలందరూ భర్తను గురించి ఆయన గుణగుణములను తలచుకుంటూ పల్లకీవెంట నడిచారు. వానరులు నదీ తీరంలో, జనావాసాలకు దూరంగా, సమతల ప్రదేశంలో, ఒక ఇసుక దిబ్బ మీద చితిని ఏర్పాటు చేసారు.

(ఇక్కడ ఒక విషయం గమనించండి. దహన సంస్కారాలు

జనావాసాలకు దూరంగా జరగాలి అని రామాయణ కాలం నుండి, వానరులలో కూడా ఉన్న ఆచారము. గ్రామీణప్రాంతాలలో కొంత వరకూ ఈ ఆచారము అమలులో ఉంది. కాని నాగరికులు నగరాల్లో, ఆనియమాలను పూర్తిగా గాలికి వదిలారు. నగరంలో శ్మశానాలన్నీ నగర నడిబొడ్డులోనే ఉన్నాయి. (హైదరాబాద్ లో అంబర్ పేట, పంజగుట్ట, బన్సీలాల్ పేట మొదలగునవి) శ్మశానాల చుట్టు అపార్టుమెంటులు, ఇండ్లు వెలిసాయి. కాలుష్యం ప్రబలి పోయింది. రోగాలు పెరిగాయి. మరణాలూ పెరిగాయి. శ్మశానాలకు గిరాకీ పెరిగింది. ఇదీ నేటి సంస్కృతి.)

తరువాత వానర ప్రముఖులు పల్లకీనుండి వాలి మృతదేహమును కిందికి దించారు. తార తన భర్త మృతదేహమును ఒడిలో పెట్టుకొని విలపించింది.

"నాధా! నీవు మరణనించిననూ నీముఖంలో ఉన్న తేజస్సు తగ్గలేదు. చూడండి. నిన్ను చంపిన రాముడు ఒకే ఒక్క బాణంతో మా అందరినీ అనాధలుగా మార్చాడు. నాధా! చూడండి. నీ భార్యలందరూ నిన్ను అనుసరించి నీ వెంట అందరూ ఇక్కడకు వచ్చారు. నీ మంత్రులు అందరూ నీచుట్టునిలబడి శోకించుచున్నారు. వారితో మాట్లాడు." అని తీరని శోకంతో బాధపడుతూ ఉంది తార. పక్కన ఉన్న వానర స్త్రీలు ఆమెను లేవదీసి పక్కకు తీసుకొని వెళ్లారు.

తరువాత అంగదుడు, సుగ్రీవుడు వాలి శరీరమును చితి మీద ఉంచారు. అంగదుడు తన తండ్రి వాలి చితికి శాస్త్రోక్తముగా నిప్పు అంటించాడు. తండ్రి చితి చుట్టు అప్రదక్షిణముగా తిరిగాడు. తరువాత అందరూ జలతర్పణములు విడవడానికి నదీ తీరానికి వెళ్లారు.

అంగదుడు, సుగ్రీవుడు మొదలగు వానరులు వాలికి జలతర్పణములు విడిచారు. అంతిమ సంస్కారములు పూర్తి అయిన తరువాత సుగ్రీవుడు అంగదుని ముందుంచుకొని, రాముని వద్దకు వెళ్లాడు.

శ్రీమద్రామాయణము

కిష్కింధా కాండము ఇరువది ఐదవ సర్గ సంపూర్ణము

ఓం తత్సత్ ఓం తత్సత్ ఓం తత్సత్

కిష్కింధా కాండము

ఇరువది ఆరవ సర్గ.

వాలికి దహన సంస్కారములు చేసిన అనంతరము, సుగ్రీవుడు, మిగిలిన వానర ప్రముఖులు అందరూ కలిసి రాముని వద్దకు వెళ్లారు. వారందరి సమక్షములో హనుమంతుడు రామునితో ఇలాఅన్నాడు.

"ఓ ప్రభో! కాకుత్స్థా! నీ అనుగ్రహము వలన సుగ్రీవునికి తిరిగి రాజ్యము లభించింది. నీ అనుజ్ఞ అయితే సుగ్రీవుడు కిష్కింధలో ప్రవేశించి యథావిధిగా రాజ్యాభిషిక్తుడై, కిష్కింధను పాలిస్తాడు. నీకు తగిన కానుకలు సమర్పించుకొని నిన్ను పూజించవలెనని అనుకుంటున్నాడు. కాబట్టి మా అందరి కోరిక మేరకు నీవు కిష్కింధా నగరమునకు వచ్చి మా సత్కారములను అందుకని మమ్ములను ఆనందింపజేయమని ప్రార్థించుచున్నాము." అని వినయంగా అన్నాడు హనుమంతుడు.

ఆ మాటలకు రాముడు ఇలా అన్నాడు. "హనుమా! నేను నా తండ్రి ఆజ్ఞమేరకు వనవాసము చేయుచున్నాను. ఈ పదునాలుగు సంవత్సరములు జనావాసములలోకి అడుగుపెట్టను. మీరందరూ కలిసి సుగ్రీవునికి పట్టాభిషేకము చేయండి." అని అన్నాడు రాముడు. తరువాత సుగ్రీవునితో ఇలా అన్నాడు. "మిత్రమా! సుగ్రీవా! వాలి కుమారుడు అంగదుని యువరాజుగా అభిషేకించు. నీ అన్నగారి కుమారుడు అంగదుడు యువరాజుగా అభిషేకించడానికి తగినవాడు. ఇప్పుడు వర్షకాలము ఆరంభమయినది. ఈ నాలుగు నెలలు సీతాన్వేషణకు తగిన సమయము కాదు. కాబట్టి ఈ నాలుగు నెలలు నీవు కిష్కింధకుపోయి రాజ్యాభిషిక్తుడవై, రాచ కార్యములు చక్కబెట్టుకో. ఈ నాలుగునెలలు నేను, లక్ష్మణుడు, ఈ పర్వతము మీద నివాసము ఉండెదము. కార్తీక మాసము రాగానే సీతను వెదకడానికీ, సీతను అపహరించిన రావణుని చంపడానికీ ప్రయత్నాలు మొదలు పెట్టాలి. అదీ మన ఒప్పందము. మిత్రమా! ఇప్పుడు నీవు కిష్కింధకు వెళ్లి పట్టాభిషిక్తుడివి కా!" అని పలికాడు రాముడు.

రాముని అనుజ్ఞపొంది సుగ్రీవుడు కిష్కింధకు బయలు దేరాడు. సుగ్రీవుడు వెళుతుంటే వానరులందరూ ఆయనకు సాష్టాంగపడి నమస్కారాలు చేస్తున్నారు. సుగ్రీవుడు వారిని లేవదీసి ఆదరిస్తున్నాడు. వానరులందరూ సుగ్రీవుని కిష్కింధకు రాజుగా అభిషిక్తుని చేసారు.

బంగారుతో చేసిన తెల్లని గొడుగును, తెల్లని వింజామరలను సిద్ధం చేసారు. రత్నములు, మణులు, మాణిక్యాలు

సుగ్రీవునికి సమర్పించారు. సుగంధ ద్రవ్యములు, తేనెను, నవధాన్యములను సిద్ధం చేసారు. తూర్పుగా ప్రవహించే నదుల నుండి, నాలుగు సముద్రముల నుండి బంగారు కలశములలో పుణ్యజలములు తీసుకొని వచ్చారు. బ్రాహ్మణులకు దానములు చేసారు. అగ్నిని ప్రజ్వరిల్లజేసి హెూమం చేసారు. వానర శ్రేష్టులు అయిన గజుడు, గవాక్షుడు, గవయుడు, శరభుడు, గన్ధమానుడు, మైందుడు, ద్వివిదుడు, హనుమంతుడు, జాంబవంతుడు ఇంకా ఇతర వానర ప్రముఖులు పుణ్యజలములతో సుగ్రీవుని అభిషేకించారు. వానరులందరూ ఆనందంతో ఊగిపోయారు.

అదే సమయంలో వాలి కుమారుడైన అంగదుని యువరాజుగా అభిషేకించారు. అంగదునికి యౌవరాజ్య పట్టాభిషేకము చేసినందుకు సుగ్రీవుని అందరూ అభినందించారు. సుగ్రీవుని రాజుగా అభిషిక్తుడు కావడానికి, అంగదుడు యువరాజుగా అభిషిక్తుడు కావడానికి కారణమైన రామలక్ష్మణులను అందరూ వేనోళ్ల స్తుతించారు. సుగ్రీవుడు కిష్కింధా రాజ్యమును, తన భార్య రుమను మరలాపొంది ఇంద్రుని వలె రాజ్యపాలన సాగించాడు.

శ్రీమద్రామాయణము

కిష్కింధా కాండము ఇరువది ఆరవ సర్గ సంపూర్ణము

ఓం తత్సత్ ఓం తత్సత్ ఓం తత్సత్

కిష్కింధా కాండము

కిష్కింధా కాండము

ఇరువది ఏడవసర్గ.

రాముడు, లక్ష్మణుడు ప్రస్రవణ పర్వతము చేరుకున్నారు. ఆ పర్వతము మీద పులులు, సింహములు, మొదలగు క్రూరజంతువులు నివాసముంటున్నాయి. అవే కాకుండా ఎన్నోరకములైన వానరములు, భల్లూకములు కూడా నివాసముంటున్నాయి. అనేకములైన పొదలు, లతలు, వృక్షములతో ఆ పర్వతము శోభిల్లుతూ ఉంది.

ఆ పర్వతము మీద ఉన్న ఒక పెద్ద గుహను తమ నివాసంగా చేరుకున్నారు రామలక్ష్మణులు. "లక్ష్మణా! ఈ గుహ మనకు నివాస యోగ్యముగా ఉన్నది కదూ! వర్షాకాలము అంతా ఇక్కడే ఉందాము. ఇక్కడకు దగ్గరలో ఒక సరస్సుఉంది. అందులో అందమైన పద్మములు వికసించి ఉన్నాయి. కొంచెం దూరంలో ఒక నది ప్రవహిస్తూ ఉంది. అందులో మనము స్నానాదులు చేయవచ్చును. ఈ నదీ తీరంలో వందలాది పక్షులు గుంపులు గుంపులుగా ఎగురుతున్నాయి. ఈ అందమైన ప్రదేశములో మనము సుఖంగా జీవించెదము. పైగా ఇక్కడి నుండి కిష్కింధా నగరము కనుచూపుమేరలోనే ఉంది. వానర రాజైన సుగ్రీవుడు తన రాజ్యమును, తన భార్యను తిరిగి పొంది, తన బంధుమిత్రులతో కలిసి సుఖంగా జీవిస్తున్నాడు." అని అన్నాడు రాముడు.

కాని రాముని మనసులో తన భార్య తనకు దూరంగా ఉంది అనే బాధ మాత్రం తొలుస్తూనే ఉంది. రాత్రిళ్లు నిద్ర పట్టడం లేదు. అనుక్షణం సీత గుర్తుకు వస్తూనే ఉంది. రాముని బాధను చూచి

లక్ష్మణుడు రామునితో ఇలా అన్నాడు.

"రామా! నీవు వీరుడవు. వీరుడవైన నీవు ఇలా దు:ఖించడం తగదు. దు:ఖముతో అన్నిపనులు నాశనం అవుతాయి. నీవు భగవంతుడిని నమ్ముతావు. నీవు చేయవలసిన పనులను సక్రమంగా చేస్తావు. ఎల్లప్పుడూ ధర్మంగా ప్రవర్తిస్తావు. అలాంటి నీవు ఇలా దు:ఖపడుతూ ఉంటే, నీ భార్యను అపహరించిన దుర్మార్గుడైన రాక్షసుని ఎలా సంహరిస్తావు. కాబట్టి దు:ఖమును విడిచి పెట్టు. ధైర్యం తెచ్చుకో. అప్పుడు సరిగా ఆలోచించ గలుగుతావు. రాక్షస సంహారము చేయగలుగుతావు.

ఓ రామా! నీవు తలచుకుంటే ముల్లోకములను గడగడ లాడించగలవు. అటువంటప్పుడు ఈ రాక్షసుడు రావణుడు ఒక లెక్కా! ఈ వర్షాకాలము పోయి శరత్కాలము రాగానే వానర వీరులతో కలిసి రాక్షస సంహారము చేయగలవు. రామా! నేను నీకు నీతులు చెప్పడం లేదు. నీలో నివురు కప్పిన నిప్పులా ఉన్న పరాక్రమాన్ని ప్రజ్వరిల్ల జేస్తున్నాను." అని అన్నాడు లక్ష్మణుడు.

లక్ష్మణుని మాటలు విన్న రాముడు ఇలా అన్నాడు. "లక్ష్మణా! నీవు నాకు నీతులు చెప్పలేదు. ఒక మంచి మిత్రుని మాదిరి హితబోధ చేసావు. నా కర్తవ్యాన్ని నాకు గుర్తు చేసావు. అన్ని అనర్థములకు మూలమైన ఈ శోకమును తక్షణము విడిచిపెడుతున్నాను. ధైర్యము తెచ్చుకుంటున్నాను. శరత్కాలము కొరకు,సుగ్రీవుని రాక కొరకు ఎదురుచూస్తుంటాను."అనిఅన్నాడు రాముడు. రాముని మాటలకు సంతోషించాడు లక్ష్మణుడు. రామునితో ఇలా అన్నాడు.

"రామా! ఈ నాలుగు నెలలు ఇట్టే గడిచిపోతాయి. సుగ్రీవుడు నీకు ఇచ్చిన మాట ప్రకారము సీతను వెదకడానికి వానరులను పంపుతాడు. శత్రు సంహారము జరుగుతుంది. అంత దాకా కోపమును అణిచి పెట్టి ఓపిక వహించు. ఈ నాలుగునెలలు మనము ఈ పర్వత గుహలో ఆనందంగా గడుపుదాము." అని అన్నాడు లక్ష్మణుడు.

శ్రీమద్రామాయణము
కిష్కింధా కాండము ఇరువది ఏడవ సర్గ సంపూర్ణము
ఓం తత్సత్ ఓం తత్సత్ ఓం తత్సత్

కిష్కింధా కాండము
ఇరువది ఎనిమిదవ సర్గ.

వర్షాకాలము మొదలయింది. ఆకాశమంతా మేఘావృతము అయింది. వేసవి కాలము అంతా ఆకాశము సూర్య కిరణముల ద్వారా నీటిని తాగి, వర్షాకాలములో ఆ జలములను మరలా భూమి మీదికి వదులుతూ ఉంది. ఆకాశమునుండి కారుతున్న వర్షపు ధారలు సీత కళ్ల నుండి కారుతున్న కన్నీళ్ల మాదిరి కనపడుతున్నాయి రామునికి.

మేఘాలు వర్షిస్తున్నాయి. నదులన్నీ నిండుగా ప్రవహిస్తున్నాయి. నెమళ్లు నర్తిస్తున్నాయి. అప్పటి వరకూ నిద్రాణంగా ఉన్న రకరకాలైన కప్పజాతులు, వర్షము పడగానే భూమిపైకి వచ్చి రణగొణధ్వనులు చేస్తున్నాయి. నదులన్నీ గట్లు తెంచుకొని ప్రవహిస్తూ తమ నాధుడైన సముద్రుని చేరుటకు ఉరకలు వేస్తున్నాయి.

ఇవన్నీ చూచి రాముడు ఇలా అనుకుంటున్నాడు.

"అయోధ్యలో కూడా సరయూ నది నిండుగా ప్రవహిస్తూ ఉంటుంది. భరతుడు కూడా తన దైనందిన కర్మలు పూర్తి చేసుకొని ఆషాఢ మాస వ్రతమును ప్రారంభించి ఉంటాడు. భరతుడు అయోధ్యలో వ్రతాలు చేస్తుంటే నేను ఇక్కడ భార్యను పోగొట్టు కొని దు:ఖిస్తున్నాను.

సుగ్రీవుడు ఎప్పుడు వస్తాడో ఏమో! ఒకవేళ వచ్చినా ఈ వర్షాకాలంలో వానరులు వెళ్లి వెతకడం అసాధ్యం కదా! అందుకే సుగ్రీవుడు వర్షాకాలము అయిపోయిన తరువాత వస్తాడు. అప్పుడు సీతను వెదకడం సులభం అవుతుంది. సుగ్రీవుని కోసరం వేచి ఉండక తప్పదు" అని అనుకొన్నాడు రాముడు.

శ్రీమద్రామాయణము
కిష్కింధా కాండము ఇరువది ఎనిమిదవ సర్గ సంపూర్ణం
ఓం తత్సత్ ఓం తత్సత్ ఓం తత్సత్

కిష్కింధా కాండము
ఇరువది తొమ్మిదవ సర్గ.

వర్షాకాలము పూర్తి అయింది. శరదృతువు ప్రవేశించింది. ఆకాశం నిర్మలమయింది. కాని సుగ్రీవుడు ఇంకా కామభోగములలో మునిగి తేలుతున్నాడు. అంత:పురము విడిచి రావడం లేదు. స్త్రీల

సాహచర్యంలోనే గడుపుతున్నాడు. తన భార్య రుమతోనూ, తన అన్న భార్య తార సాహచర్యంలోనూ ఆనందంగా గడుపుతున్నాడు.

(స్వాం చ పత్నీమభిప్రేతాం తారాం చాపి సమీప్సితామ్, విహరన్తమహోరాత్రం అంటే తన భార్యను, తానుకోరిన తారను అహోరాత్రాలు విహరిస్తున్నాడు... అని ఉంది. అలాగే ముప్పది ఒకటవ సర్గలో కూడా ఈ క్రింది శ్లోకము ఉంది. “తారయా సహిత: కామాసక్త:” అంటే తారతో కలిసి కామాసక్తుడై ఉన్నవాడు అనిఉంది. అంటే వాలి చని పోయిన తరువాత వాలి భార్య తార సుగ్రీవుని వశం అయిందని అర్థం అవుతూ ఉంది. మరి వాలి చేసిన తప్పే సుగ్రీవుడు చేస్తున్నాడు కదా! అంటే సుగ్రీవుడు బతికి ఉండగానే వాలి, సుగ్రీవుని భార్య రుమను అనుభవించాడు. కానీ సుగ్రీవుడు, వాలి చనిపోయిన తరువాత, వాలి భార్య తారను అనుభవించాడు అని అర్థం చెప్పుకోవాలి.)

సుగ్రీవుడు కనీసం మంత్రులకు కూడా దర్శనం ఇవ్వడం లేదు. కార్యభారము అంతా మంత్రులకు అప్పచెప్పాడు. ఇంక ఎవరి వల్లా తనకు ఆపదలేదు అని నిర్భయంగా స్వేచ్ఛగా విహరిస్తున్నాడు.

సుగ్రీవుని వ్యవహారము హనుమంతునికి నచ్చలేదు. రాముడికి ఇచ్చిన మాట, చేసిన వాగ్దానము సుగ్రీవునికి గుర్తుచేయాలని అనుకున్నాడు. సుగ్రీవుని వద్దకు పోయి ఇలా అన్నాడు. “ ఓ రాజా! నీవు రాముని మూలంగా ఈ రాజ్యమును, కీర్తిని సంపాదించుకున్నావు. ఇంక నీవు, నీ మిత్రుడు రామునికి ఇచ్చిన మాటలను నిలబెట్టుకోవలసిన సమయము ఆసన్నమయింది. నీవు రాముని కార్యము నిర్వర్తించాలి.

మిత్రుల విషయంలో బాగా ప్రవర్తించే వాళ్లు కీర్తిమంతులు అవుతారు. ఒక రాజుకు తన కోశాగారము, సైన్యము, తన మిత్రులు, తన ప్రభుత్వము ఈ నాలుగు అత్యంత ముఖ్యమైనవి. అందుకని, నీ మిత్రుడు రామునికి ఇచ్చిన మాట నెరవేర్చు. మిత్రునికి ఇచ్చిన మాట నెరవేర్చని వాడు అన్ని కష్టాలను ఎదుర్కొంటాడు.

రాజా! ఏకార్యము చేసినా సకాలంలో చెయ్యకపోతే, తరువాత ఎంత గొప్పగా చేసినా దానికి ఫలితం ఉండదు. పైగా ఆ పనిచెయ్యనట్టే అవుతుంది. ఓ రాజా! రాముని కార్యం చెయ్యడంలో ఇప్పటికే కాలం మించిపోయింది. ఇప్పటికైనా రామకార్యములో నిమగ్నమవ్వు. వానలు తగ్గిపోయాయి.

సీతాన్వేషణ ప్రారంభించడానికి ఇప్పటికే సమయం దాటిపోయింది. వానాకాలము ఆగిపోయింది, సమయం మించి పోయింది అని రామునికి తెలిసినా, నిన్ను తొందర పెట్టడం మంచిది కాదని రాముడు నీకోసం ఎదురుచూస్తున్నాడు. రాముడు నీకు మేలు చేసాడు. తిరిగి రాముడికి మేలు చెయ్యడానికి ఆలస్యం చెయ్యడం మంచిదికాదు. రాముడు వచ్చి నీ మాటను నీకు గుర్తుచేసే వరకూ ఆగకు. అప్పటిదాకా ఆగితే, నీవు కావాలని ఆలస్యము చేసినట్టు అవుతుంది.

ఓ రాజా! నీకు ఏ సాయమూ చేయని వారికి కూడా నీవు సాయం చేస్తావు కదా! మరి నీకు ఇంత సాయం చేసిన రామునికి సాయం చెయ్యడంలో ఎందుకు ఆలస్యం చేస్తున్నావు? వానరులను

పిలిచి వారికి సీతాన్వేషణకు ఆదేశాలు ఎందుకు ఇవ్వడం లేదు? రాముడు తన బాణములతో దేవతలను, రాక్షసులను అంతమొందించ గల సామర్థ్యము కలవాడు. కానీ నీ సాయం కొరకు ఎదురు చూస్తున్నాడు. నీవు చేసిన ప్రతిజ్ఞను నెరవేరుస్తావా లేదా అని వేచి ఉన్నాడు.

కాబట్టి ఓ వానర రాజా! నీకు ముందుగా ఉపకారము చేసిన రామునికి ప్రత్యుపకారము చేయడానికి ఉద్యమించు. మేమందరమూ నీ ఆజ్ఞ కొరకు ఎదురుచూస్తున్నాము. నీ ఆజ్ఞ అయితే మేము భూమ్యాకాశములను గాలించి సీత జాడ తెలుసుకుంటాము. నీ అధీనములో ఒక కోటి కంటే ఎక్కువ సంఖ్యలో వానరులు ఉన్నారు. వారిని రామకార్యమునకు తగిన విధంగా నియోగించు. త్వరపడు." అని హితబోధ చేసాడు హనుమంతుడు. తనమంత్రి అయిన హనుమంతుని మాటలను శ్రద్ధగా విన్నాడు సుగ్రీవుడు. వెంటనే నీలుని పిలిపించాడు. సీతాన్వేషణ కొరకు వానర సేనలను అన్నిదిక్కులనుండి కిష్కింధకు రప్పించమని ఆదేశాలు ఇచ్చాడు. సమస్త వానరసేనలను తన ముందు నిలుప మని ఆదేశాలు ఇచ్చాడు. "పదిహేను దినములలో వానరులందరూ కిష్కింధ చేరు కోవాలి. ఆ గడువు మించితే మరణదండన విధించబడుతుంది." అని వానరులను ఆదేశించాడు. హనుమంతుని, అంగదుని కొంతమంది వానర ప్రముఖులను కలిసికొనమని ఆదేశించాడు. ఆ ప్రకారంగా ఆదేశాలు ఇచ్చిన సుగ్రీవుడు అంత:పురమునకు వెళ్లిపోయాడు.

శ్రీమద్రామాయణము కిష్కింధా కాండము

ఇరువది తొమ్మిదవ సర్గ సంపూర్ణము

ఓం తత్సత్ ఓం తత్సత్ ఓం తత్సత్

కిష్కింధా కాండము

ముప్పదవ సర్గ.

వర్షాకాలము గడిచి పోయినను సుగ్రీవుడు తన వద్దకు రాలేదని రాముడు చింతిస్తున్నాడు. సుగ్రీవుడు కామాసక్తుడై తనకు ఇచ్చిన మాటను మరచినాడని, తన భార్య సీతను తలచుకొని దు:ఖిస్తున్నాడు. "ఈ శరత్కాలములో పండువెన్నెలలో సీతతో కూడా విహరించవలసిన తాను ఈ ప్రకారము భార్యావియోగము అనుభవించవలసి వచ్చినదే అని మనసులో ఆరాటపడుతున్నాడు రాముడు. ఒకవేళ బతికి ఉంటే సీత ఈ శరత్కాల రాత్రులను ఎలా గడుపుతూ ఉందో అని ఆలోచిస్తున్నాడు. సీత తన దగ్గర లేకపోవడంతో రాముడు శరత్కాల వైభవాలను ఆస్వాదించలేకపోతున్నాడు.

మరలా తన అన్నగారు రాముడు సీత గురించి ఆలోచించడం చూచాడు లక్ష్మణుడు. మరలా రాముని ఉత్తేజపరచి కార్యోన్ముఖుడిని చేయదలిచాడు. రామునితో ఇలా అన్నాడు.

"రామా! ఏమిటీ వెర్రి! ఈ ప్రకారము కామానికి వశుడు కావడం వలన ప్రయోజనము ఏముంది! దీని వలన మానసిక స్థైర్యము నశించడం తప్ప వేరే ఏమీ జరగదు. ఏ కార్యమూ సిద్ధించదు. కాబట్టి నీవు నీ మనసులో నుండి చింతను తొలగించి, మనసును నిర్మలం చేసుకొని, కాగల కార్యము నందు శ్రద్ధ చూపు. ధైర్యము చేత ఏ కార్యము నైననూ సిద్ధింప చేసుకొన వచ్చును కదా! మనం ధైర్యంగా ఉంటే దైవము కూడా మనకు తోడుపడుతుంది. ముందు సుగ్రీవుడు

మనకు ఎంత వరకూ సాయ పడగలడో ఆలోచించాలి." అని లక్ష్మణుడు రామునికి కర్తవ్యమును బోధించాడు.

రాముడు లక్ష్మణునితో ఇలాఅన్నాడు. "లక్ష్మణా! అప్పుడప్పుడు నా మనసు అలా దైన్యము చెందుతూ ఉంటుంది. నీ మాటలతో మరలా ధైర్యము తెచ్చుకుంటూ ఉంటాను. మనము తల పెట్టిన కార్యమును నెరవేరేట్టు చూడాలి.

లక్ష్మణా! వర్షాకాలము పూర్తి అయినది. వర్షములు ఆగిపోయినవి. శరత్కాలము ప్రవేశించినది. ఆకాశము నిర్మలంగా ఉంది. రాత్రుళ్లు చంద్రుడు తన కాంతితో ఈ జగత్తును అంతా తేజోమయం చేస్తున్నాడు. నేలంతా తడి ఆరిపోయి నడవడానికి అనుకూలంగా ఉంది. రాజులు శత్రురాజుల మీద దండయాత్రలు చేయుటకు తగు సమయము ఆసన్నమయింది. కానీ సుగ్రీవుడు ఎందుకో ఇంకా నా వద్దకురాలేదు. కనీసము సీతను వెదకడానికి ప్రయత్నం కూడా చేస్తున్నట్టు కనిపించడం లేదు.

నేనేమో ఇక్కడ సీతా వియోగ దు:ఖంతో అలమటిస్తుంటే, అక్కడ సుగ్రీవుడు కామభోగాలలో మునిగి తేలుతున్నాడు. అటు రాజ్యం పోగొట్టుకొని, ఇటు భార్యను పోగొట్టుకొని బాధ పడుతున్న నా మీద సుగ్రీవునికి దయ కలగడం లేదు. సుగ్రీవుడు తన పని అయిపోయింది కదా అని నిర్లక్ష్యంగా ఉన్నాడు.

"ఈ రాముడు తండ్రి చేత రాజ్యము నుండి వెళ్ల గొట్టబడిన అనాధ. పైగా రావణుడు అతని భార్యను అపహరించాడు. నా శరణు

వేడాడు. ప్రస్తుతము నేనే రామునికి దిక్కు" అని సుగ్రీవుడు నన్ను అవమానిస్తున్నాడు. సుగ్రీవుడు, తన పని పూర్తి కాగానే, నాతో చేసుకొన్న ఒడంబడికను మరచి పోయినట్టున్నాడు.

లక్ష్మణా! నీవు కిష్కింధకు పోయి, సుగ్రీవుని కలిసి నా మాటగా చెప్పు.

" మిత్రుని వలన తన పనిపూర్తి కాగానే, తాను మిత్రునికి ఇచ్చిన మాట మరచిన వాడు అధముడు. అది పుణ్యమైనను, పాపమైనను, మిత్రునికి ఇచ్చిన మాటను నిలబెట్టుకొనేవాడు ఉత్తముడు. తనకు సంబంధించిన పనులు పూర్తి అయిన తరువాత, ఇంకా పనులు పూర్తి కాని మిత్రులకు ఎవరైతే సాయం చెయ్యరో అటువంటి వారి మాంసమును కుక్కలు కూడా ముట్టవు. ఇది ధర్మము.

సుగ్రీవుడు మరలా నా ధనుష్టంకారమును వినదలచు కొన్నాడో ఏమో అడిగి తెలుసుకో. ఈ సారి నేను బాణం ఎక్కుబెడితే అది సుగ్రీవుని మీదనే అవుతుంది. సుగ్రీవుడు లేకపోయినా నీ సాయంతో నేను కార్యం సాధించగలను. కానీ, సుగ్రీవుడు తన పని పూర్తి అయిన తరువాత, మనలను మరచిపోయినట్టున్నాడు. అది గుర్తు చెయ్యి. సుగ్రీవుడు మనలను వర్షాకాలము వరకూ ఆగమన్నాడు. వర్షాకాలము అయిపోయినా, సుగ్రీవుడు ఇంకా మద్యపాన మత్తులో, కామభోగములలో మునిగి తేలుతున్నాడు. ఇంకా మత్తు వదిలినట్టు లేదు. మనలను పూర్తిగా మరచినట్టున్నాడు.

లక్ష్మణా! నీవు పోయి సుగ్రీవుని కలిసి, నాకు కోపం వస్తే జరిగే పరిణామాలను అతనికి తెలియజెయ్యి.

"సుగ్రీవా! వాలి వెళ్లిన మార్గము ఇంకా మూసివేయబడ లేదు. నీ కోసం ఇంకా తెరిచి ఉంచాను. వాలి వెళ్లిన మార్గంలో వెళ్లడానికిప్రయత్నించకు.

ఓ సుగ్రీవా! నేను వాలిని ఒక్కబాణంతోనే చంపాను. కానీ మాట తప్పిన నిన్ను మాత్రం బంధు మిత్రులతో సహా చంపుతాను.

ఓ సుగ్రీవా! అశాశ్వతములైన కామసుఖములను విడిచి పెట్టి, శాశ్వతమైన ధర్మాన్ని అనుసరించు. పూర్వము నాకు ఇచ్చిన మాటను నిలబెట్టుకో. అంతేకాని, నా బాణములకు ఎరగా మారి, పరలోకంలో ఉన్నవాలిని కలవడానికి ప్రయత్నించకు."

అని నా మాటగా చెప్పు. ఇంకా నీకు తోచినవి, మనకు హితము చేకూర్చే మాటలు చెప్పు. ఇంక ఆలస్యముచేయకు." అని రాముడు లక్ష్మణునితో అన్నాడు.

శ్రీమద్రామాయణము

కిష్కింధా కాండము ముప్పదవ సర్గ సంపూర్ణము

ఓం తత్సత్ ఓం తత్సత్ ఓం తత్సత్.

కిష్కింధా కాండము

ముప్పది ఒకటవ సర్గ.

రాముడు మాట్లాడుతున్నంత సేపూ లక్ష్మణుడు తన కోపాన్ని అణుచు కుంటున్నాడు. అన్నమాట తప్పి నందుకు లక్ష్మణునికి సుగ్రీవుని మీద కోపం ముంచుకొచ్చింది.

“అన్నయ్యా! వానరుడైన ఈ సుగ్రీవుడు మంచి వాడిలా ప్రవర్తించడం లేదు. తానుచేసే పనుల వలన కలిగే ఫలితములను తెలుసుకోడం లేదు. మాట తప్పినందుకు సుగ్రీవునికి కాలం మూడింది. రామా! నీవు చేసిన ఉపకారము వలన వచ్చిన రాజ్యమును, భార్యను అనుభవిస్తున్నాడే కానీ, అనుకున్న ఒప్పందము ప్రకారము ప్రత్యుపకారము చేయవలెననే ఆలోచన వానికి ఉన్నట్టు లేదు. వీడిని తన అన్న వాలి వద్దకు పంపడమే ఉత్తమము. ఇటువంటి వాడు రాజ్యము చేయుటకు అనర్హుడు. సుగ్రీవుని తలచుకుంటేనే నాకు కోపం మిన్నుముట్టుతూ ఉంది. వాడిని చంపకుండా వదలను. అంగదునికి రాజ్యాభిషేకము చేద్దాము. అంగదుడే సీతను అన్వేషించడంలో మనకు సాయపడగలడు.” అంటూ లక్ష్మణుడు ధనుస్సు తీసుకొని లేచాడు.

రాముడు లక్ష్మణుని అనునయించి ఇలా అన్నాడు. “లక్ష్మణా! సుగ్రీవుడు పాపం చేసాడని మనం కూడా పాపం చేస్తామా! సుగ్రీవుని చంపి పాపం ఎందుకు మూటకట్టుకుంటావు? నీలోని వివేకంతో ఆలోచించు. కోపాన్ని వదిలిపెట్టు. మనకు సుగ్రీవునితో స్నేహపూర్వక ఒప్పందం ఉంది. దానిని అనుసరించి ప్రవర్తించు. సుగ్రీవుడు తాను

అన్న మాట తప్పాడు. మనము కూడా అతనితో సానుకూలంగా మాట్లాడి, కార్యము చక్కపరచుకోవాలి. కాబట్టి ముందు సుగ్రీవునితో సౌమ్యంగా మాట్లాడు. వినకపోతే అప్పుడు తగిన విధంగా దండించవచ్చును." అని అన్నాడు రాముడు.

అన్నగారి మాటలను శిరస్సున దాల్చి, లక్ష్మణుడు కిష్కింధకు వెళ్లాడు. తన ధనుస్సును చేతబూని యమధర్మరాజు మాదిరి నిలబడ్డాడు. తాను సుగ్రీవునితో ఏమి మాట్లాడాలి, దానికి సుగ్రీవుని ఇచ్చే సమాధానాన్ని బట్టి తిరిగి తాను ఏమి మాట్లాడాలి అని ఒకటికి రెండు సార్లు ఆలోచించుకున్నాడు లక్ష్మణుడు. కిష్కింధ వెలుపల సంచరించు వానరులను చూచాడు లక్ష్మణుడు.

కోపంతో ఊగిపోతున్న లక్ష్మణుని చూచి ఆ వానరులు చేతి కందిన చెట్ల కొమ్మలను, రాళ్లను పట్టుకొని నిలుచున్నారు. ఆ వానరులను చూచి లక్ష్మణుడు కోపంతో హుంకరించాడు. వానరులందరూ భయపడా తలొకదిక్కుకు పారిపోయారు.

కొంత మంది వానరులు, సుగ్రీవుని వద్దకు పరుగు పరుగునపోయి లక్ష్మణుడు వచ్చి కోపంతో ద్వారము వద్దకు నిలబడి ఉన్నాడు అని చెప్పారు. కాని తారతో కూడి కామ సుఖములు అనుభవిస్తున్న సుగ్రీవుడు, వారి మాటలు వినిపించేకోలేదు. వానరులందరూ బయటకు వచ్చారు. వారు తమ చేతులలో చెట్ల కొమ్మలను, రాళ్లను, ఆయుధములను పట్టుకొని లక్ష్మణునికి కనపడునట్టుగా నిలబడ్డారు. తాను వచ్చిన విషయము తెలిసికూడా సుగ్రీవుడు తన దగ్గరకు రానందుకు లక్ష్మణుని కోపం తారస్థాయికి

చేరుకుంది. కోపంతో మండిపడుతున్నాడు. ఈ విషయం అంగదునికి తెలిసింది. లక్ష్మణుని కోపం చూచి అంగదుడు భయపడ్డాడు.

లక్ష్మణుడు అంగదుని పిలిచి “కుమారా! నీవు వెళ్లి నీ పినతండ్రి సుగ్రీవునికి నేను వచ్చానని తెలియజెయ్యి. ” అని అన్నాడు. వెంటనే అంగదుడు సుగ్రీవుని అంత:పురమునకు వెళ్లాడు. సుగ్రీవుని పాదములకు, రుమ పాదములకు నమస్కరించాడు. లక్ష్మణుని రాక గురించి సుగ్రీవునికి తెలియజేసాడు. కాని సుగ్రీవుడు, మద్యం మత్తులో ఉన్నాడు. అందుకని అంగదుడు ఏం చెప్పాడో అతనికి వినపడలేదు. అంగదుని వెంట ఉన్న మంత్రులు ప్లక్షుడు, ప్రభావుడు కూడా సుగ్రీవునికి లక్ష్మణుని రాక గురించి తెలియజేయడానికి ప్రయత్నించారు.

“ఓ రాజా! సుగ్రీవా! రామ లక్ష్మణుల అనుగ్రహంతో నీకు రాజ్యము లభించింది. వారునీకు మిత్రులు. లక్ష్మణుడు వచ్చి ద్వారము ధనుర్ధారియై నిలబడి ఉన్నాడు. అతనిని చూచి వానరులందరూ భయంతో వణికిపోతున్నారు. రాముడు నీతో చెప్పమన్న మాటలు చెప్పుటకు లక్ష్మణుడు నీ వద్దకు వచ్చాడు. తాను వచ్చినట్టు నీ తో చెప్పమని లక్ష్మణుడు ఈ అంగదుని నీ వద్దకు పంపాడు. అతని వెంట మేము కూడా వచ్చాము. లక్ష్మణుడు అమితమైన కోపంతో ద్వారం వద్ద నీకొరకు వేచిఉన్నాడు.

కాబట్టి ఓ రాజా! నీవు వెంటనే వెళ్లి, లక్ష్మణుని కలుసుకొని, అతనికి నమస్కరించి, అతని కోపము తగ్గించు. నీవు రామునితో చేసుకున్న ఒప్పందము ప్రకారము చేస్తానని లక్ష్మణునికి వినయంగా

చెప్పు. రాముడు ఏమి చెప్పి పంపాడో ఆవిధంగా చెయ్యి. అదే ప్రస్తుత కర్తవ్యము." అని మంత్రులు సుగ్రీవునికి హితోపదేశము చేసారు.

శ్రీమద్రామాయణము
కిష్కింధా కాండము ముప్పది ఒకటవ సర్గ సంపూర్ణము
ఓం తత్సత్ ఓం తత్సత్ ఓం తత్సత్.

కిష్కింధా కాండము
ముప్పది రెండవ సర్గ.

లక్ష్మణుడు కోపంతో వచ్చి ద్వారము వద్ద నిలబడి ఉన్నాడు అని తెలుసుకున్న సుగ్రీవునికి మత్తు పూర్తిగా దిగింది. ఆసనము మీది నుండి లేచాడు. తన మంత్రులను చూచి ఇలా అన్నాడు.

"అయ్యో! లక్ష్మణునికి ఎందుకు కోపం వచ్చింది. నేనేమీ ఆయనతో చెడుగా మాట్లాడలేదే! ఏమీ తప్పుగా ప్రవర్తించలేదే! మరి లక్ష్మణునికి కోపం ఎందుకు వచ్చినట్టు. నా శత్రువులు ఎవరో నామీద చెడుగా లక్ష్మణునికి చెప్పి ఉంటారు. మీరందరూ ఆలోచించి మనము లక్ష్మణునితో ఎలా మాట్లాడాలో నిర్ణయం చెయ్యండి.

నాకు రాముడు అన్నా లక్ష్మణుడు అన్నా భయం లేదు. కానీ, అకారణంగా లక్ష్మణుడు ఎందుకు కోపించాడా అని సంభ్రమంగా ఉంది. రాముడు లాంటి మిత్రుడు దొరకడమే చాలాకష్టము. అటువంటి మిత్రుని వదులుకుంటానా! రాముడు నాకు చేసిన సాయము ఈ జన్మలో మరువలేనిది. నేను ఎంత చేసినా, రాముడు చేసిన

సాయమునకు సాటి రాదు. కాని చిన్న చిన్న విషయములకు కూడా స్నేహమునకు విఘాతము కలుగుతుంది. అందుకే నేను రామునికి భయపడుతున్నాను.” అని అన్నాడు సుగ్రీవుడు.

సుగ్రీవుడు నేర్పుగా అంటున్న మాటలు విన్న హనుమంతుడు సుగ్రీవునితో ఇలా అన్నాడు. “సుగ్రీవా! నీకు రాముడు చేసిన ఉపకారమును నీవు మరచిపోలేదు అనడంలో ఆశ్చర్యం ఏమీలేదు. నీకోసమే కదా రాముడు వాలిని చంపాడు. రాముడు ఎప్పటికీ నీకు మిత్రుడే. మరి అటువంటి రాముడు కోపించి లక్ష్మణుని పంపాడు. నీవు సుఖలాలసతతో మునిగి తేలుతూ కాలము ఎలా గడిచిపోతున్నదీ తెలుసుకోలేకున్నావు. నీవు అనుకొన్న వానాకాలము పోయి శరత్కాలము ప్రవేశించినది. రామునితో చేసుకున్న ఒప్పందము మేరకు మనము సీతను వెదకుటకు సమయము ఆసన్నమైనది అని నీవు గుర్తించడం లేదు. నీవు రామునితో చేసుకున్న ఒప్పందము మరిచిపోయినావనే, నీకు గుర్తుచేయడానికి రాముని దూతగా లక్ష్మణుడు వచ్చాడు అన్నవిషయం తెలుస్తూనే ఉంది.

నీవు నీ భార్యతో సుఖంగా ఉన్నావు. రాముడు తన భార్యను పోగొట్టుకొని కష్టాలలో ఉన్నాడు. అది గ్రహించు. కాబట్టి రాముడు ఏమన్నా నీవు సహించాలి. సీతను వెదకడంలో నీవు ఆలస్యంచేసి తప్పుచేసావు కాబట్టి, నీవు లక్ష్మణుని వద్దకు పోయి అతని కోపం ఉపశమించచేయడం తప్ప మరొక మార్గం లేదు. మంత్రులు అయిన వాళ్లు రాజుకు హితము చెప్పవలెను. అందుచేతనే. మంత్రులైన మేము, నీతో భయం విడిచి, హితమును చెప్పుచున్నాము. రాముడికే కోపం వస్తే ఏం జరుగుతుందో మా కన్నా నీకే బాగా తెలుసు. రాముడు నీకు

చేసిన ఉపకారమును మనసులో ఉంచుకొని, కృతజ్ఞతా భావంతో రాముని ప్రసన్నం చేసుకో. రామునికి కోపం తెప్పించడం కిష్కింధకు మంచిది కాదు."అని హితోక్తులు పలికాడు హనుమంతుడు.

శ్రీమద్రామాయణము
కిష్కింధా కాండము ముప్పది రెండవ సర్గ సంపూర్ణము
ఓం తత్సత్ ఓం తత్సత్ ఓం తత్సత్.

కిష్కింధా కాండము
ముప్పదిమూడవ సర్గ.

సుగ్రీవుని ఆదేశము మేరకు అంగదుడు మొదలగు వారు వెంటనే వెళ్లి లక్ష్మణుని వినయంగా లోపలకు ఆహ్వానించారు. లక్ష్మణుడు కిష్కింధా నగరంలోకి ప్రవేశించాడు. లక్ష్మణుని చూచి వానరులందరూ భక్తితో నమస్కరించారు. లక్షణుని మొహంలో కోపాన్ని చూచి వానరులు భయం భయంగా దూర దూరంగా నిలబడ్డారు.

విశాలమైన రాజమార్గముల గుండా లక్ష్మణుడు వెళు తున్నాడు. లోపల ఉన్న పలు అంతస్థుల భవనములను చూచాడు లక్ష్మణుడు. రాజ మార్గములో పోతూ, అంగదుడు, మైందుడు, ద్వివిదుడు, గవయుడు, గవాక్షుడు, గజుడు, శరభుడు, విద్యున్మాలి, సంపాతి, సూర్యాక్షుడు, హనుమంతుడు, వీరబాహుడు, సుబాహుడు, నలుడు, కుముదుడు, సుషేణుడు, తారుడు, జాంబవంతుడు, దధివక్త్రుడు, నీలుడు, సుపాటలుడు,సునేత్రుడు మొదలగు వానర వీరుల గృహములను చూచాడు లక్ష్మణుడు.

దేవేంద్రుని భవనము వలె వెలిగిపోవుచున్న వానర రాజు సుగ్రీవుని ప్రాసాదమును చూచాడు లక్ష్మణుడు. ఆ ప్రాసాదము కైలాస శిఖరము మాదిరి తెల్లగా ప్రకాశిస్తూ ఉంది. ఆయుధములు ధరించిన వానరులు ఆ భవనమును నిరంతరమూ కాపలా కాస్తున్నారు. ముఖద్వారము గుండా లక్ష్మణుడు సుగ్రీవుని ప్రాసాదము లోనికి ప్రవేశించాడు. లక్ష్మణుడు ఏడు గవాక్షములను దాటి విశాలమైన అంత:పురములోని ప్రవేశించాడు.

లోపల నుండి మధురమైన వీణానాదములు, వివిధ వాద్యధ్వనులు వినిపిస్తూ ఉన్నాయి. అత్యంత సౌందర్యవతులైన స్త్రీలు అటు ఇటూ తిరుగుతున్నారు. అందుకని లక్ష్మణుడు వెళ్లి కాస్త దూరంగా నిలబడ్డాడు. తన ధనుస్సును ఎక్కుపెట్టి వింటి నారిని మ్రోగించాడు.

ఆ ధ్వని విని సుగ్రీవుడు ఆసనముమీది నుండి లేచాడు. లక్ష్మణుడు వచ్చాడని తెలుసుకున్నాడు. పక్కనే ఉన్న తారతో ఇలా అన్నాడు. “ఓ తారా! సాధారణంగా శాంతస్వభావుడైన లక్ష్మణుడు ఎందుకు కోపంగాఉన్నాడు? దీనికి కారణమేమి? సాధారణంగా లక్ష్మణునికి అకారణంగా కోపం రాదు కదా! లక్ష్మణుని పట్ల మనము ఏమి అపరాధము చేసాము? నీవు ఆలోచించి చెప్పు. లేకపోతే నీవు స్వయంగా వెళ్లి, లక్ష్మణునితో అనునయంగా మాట్లాడి, ఆయన కోపకారణం తెలుసుకో! సాధారణంగా ఎంత కోపంలో ఉన్నా మానవులు స్త్రీలను చూడగానే శాంతము వహిస్తారు కదా! ముందు నీవు వెళ్లి లక్ష్మణుని శాంతపరచు. లక్ష్మణుడు ప్రసన్నుడైన తరువాత నేను వెళ్లి లక్ష్మణునితో మాట్లాడతాను.” అని తారతో అన్నాడు.

అప్పుడు తార లక్ష్మణుని వద్దకు వెళ్లింది. తారను చూడగానే లక్ష్మణుని కోపం తగ్గిపోయింది. ఆమె ముందు తలవంచుకొని వినయంగా నిలబడ్డాడు లక్ష్మణుడు. తార ఆయనతో ఇలాఅంది.

"ఓ రాజకుమారా! నీ కోపమునకు కారణమేమి? ఇక్కడ నీకు ఎవరు ఎదురు చెప్పారు? నీ ఆజ్ఞను ధిక్కరించిన వాడు ఎవరు?" అనిసూటిగా అడిగింది.

అప్పుడు లక్ష్మణుడు తారతో ఇలా అన్నాడు."నీ భర్త అయిన సుగ్రీవుడు, ధర్మమును విడిచి కామభోగములలో ఎందుకు మునిగి తేలుతున్నాడు. ఆయన చేసిన తప్పు నీకు తెలియడం లేదా! సుగ్రీవుడు రాచకార్యములను మరిచి, మాకు ఇచ్చి మాట కూడా మరిచి, ఉపకారము చేసిన రాముని గురించి ఆలోచించక, కామభోగము లలో తేలియాడడం లేదా! అది నీకు తెలియదా!

సుగ్రీవుడు మాకు నాలుగు మాసములు వ్యవధి కావాలని అడిగాడు. ఆ నాలుగు మాసములు పూర్తి అయిన విషయం కూడా సుగ్రీవునకు గుర్తు లేదు. అవునా! ఈ విధంగా మద్యపాన మత్తులో, స్త్రీల సాంగత్యంలో గడపడం ధర్మము తెలిసిన వారికి తగదు. ఇది ధర్మహాని కలిగిస్తుంది. మిత్రుని వలన మేలును పొంది, దానికి ప్రతిగా మేలు చేయని వాడు ధర్మము తప్పినట్టే కదా! అటువంటి వాడు ఒక మంచి మిత్రుని పోగొట్టుకున్నవాడవుతాడు. నీభర్త అయిన సుగ్రీవుడు ధర్మమును, సత్యమును మరిచాడు. ప్రస్తుతము ఇదీ విషయము. ఇప్పుడు ఏం చేయాలో నువ్వే చెప్పు." అని అన్నాడు లక్ష్మణుడు.

లక్ష్మణుని చెప్పిన మాటలను సావధానంగా విన్న తార లక్ష్మణునితో ఇలా అంది."రాజకుమారా! దయచేసి కోపం తెచ్చుకోకు. ఇది కోపానికి సమయం కాదు. కార్యసాధకులకు కోపం పనికిరాదు. నీ వంటి గుణవంతుడు, గుణహీనుడైన సుగ్రీవుని పట్ల కోపం తెచ్చుకో వచ్చునా! సుగ్రీవుడు మీ పట్ల అపరాధం చేసాడు. దానిని మీరు సహించండి. రాముడి కోపం గురించి నాకు బాగాతెలుసు. మేము చేసిన అపరాధము గురించి మాకు తెలుసు. దానికి ఏమి చేయాలో కూడా మాకు తెలుసు.

ఓ రాజకుమారా! మన్మధుడు ఎంత బలవంతుడో నీకు తెలుసు. సుగ్రీవుడు ఆ మన్మధ బాణములకు చిక్కుకొని, కామ సుఖములలో మునిగి తేలుతున్నాడు. అదికూడా నాకు తెలుసు. కామాసక్తుడైన వాడికి ధర్మము గురించి పట్టించుకోడుకదా! ఆ సుగ్రీవుడు కామాసక్తుడై సిగ్గు లేకుండా, ఇప్పటిదాకా నా దగ్గరే ఉన్నాడు. నీవు అతనిని క్షమించు.

మరొక మాట! నిరంతరమూ తపస్సుచేసుకొనే మహా ఋషులు కూడా కామమునకు లోబడి ప్రవర్తించడం మనకు తెలుసు. అటువంటిది, వానరుడు, చపలస్వభావుడు అయిన సుగ్రీవుడు కామానికి లోబడటం వింత ఏమీ కాదు కదా! ఓ రాజకుమారా! అసలు విషయం ఏమిటంటే, సుగ్రీవుడు ఎంత కామాసక్తుడైనా, తన కర్తవ్యమును పాలించాడు. వానాకాలము ముగియగానే, మీ కార్యము సాధించుటకు వానరులను సమీకరించడానికి, వార్తాహరులను నలుదిక్కులకూ పంపాడు. కాబట్టి నీవు అంత:పురములోని వచ్చి సుగ్రీవునితో మాట్లాడు." అని లక్ష్మణుని సవినయంగా

అంత:పురములోనికి ఆహ్వానించింది తార. తార ఆహ్వానమును మన్నించి లక్ష్మణుడు సుగ్రీవుని అంత:పురములోనికి ప్రవేశించాడు. కనకపు సింహాసనము మీద, తన భార్య రుమతో సహా కూర్చుని ఉన్న సుగ్రీవుని చూచాడు లక్ష్మణుడు. సుగ్రీవునికి, ధనుర్బాణములు ధరించిన లక్ష్మణుడు, దండధరుడైన యముడి మాదిరి కనపడ్డాడు.

శ్రీమద్రామాయణము

కిష్కింధా కాండము ముప్పది మూడవ సర్గ సంపూర్ణము

ఓం తత్సత్ ఓం తత్సత్ ఓం తత్సత్.

కిష్కింధా కాండము

ముప్పది నాలుగవ సర్గ.

లక్ష్మణుని చూడగానే సుగ్రీవుడు తన ఆసనమునుండి కిందికి దిగాడు. అతని తోపాటు అతని భార్యలు రుమ మొదలగు స్త్రీలు కూడా లేచి నిలబడ్డారు. సుగ్రీవుడు చేతులు జోడించి లక్ష్మణుని ఎదురుగా నిలబడ్డాడు. స్త్రీల మధ్య నిలబడ్డ సుగ్రీవుని చూచి లక్ష్మణుడు కోపంతో ఇలా అన్నాడు.

"ఓ సుగ్రీవా! బలవంతుడు, ఉత్తములైన బంధువులు ఉన్నవాడు, జాలి, దయకలవాడు, ఎల్లప్పుడు సత్యమునే పలుకువాడు, అయిన రాజు లోకములో అందరిచేతా పూజింపబడతాడు. ధర్మము తప్పినవాడు, ఇచ్చిన మాటను మరచువాడు, అసత్యము పలుకువాడు అయిన రాజు కంటే క్రూరుడు మరొకడు ఉండడు.

అశ్వమును దానము చేస్తాను అని చెప్పి దానం చేయకుండా ఉన్నవాడు నూరు అశ్వములను చంపిన పాపమును పొందుతాడు. అలాగే గోవును దానం చేస్తాను అని చెప్పి మాటతప్పితే వాడికి వేయి గోవులుచంపిన పాపం అంటుకుంటుంది. అలాగే మిత్రునికి ఇచ్చిన మాట తప్పినవాడికి బంధు మిత్రులను చంపి, తనను తాను చంపుకున్న పాపం అంటుకుంటుంది. తన పని పూర్తి అయిన తరువాత, తనకు సాయం చేసిన మిత్రులకు ప్రత్యుపకారముచేయని కృతఘ్నుని జనం అంతాకొట్టి చంపుతారు.

చేసిన మేలు మరచి పోయే కృతఘ్నుని గురించి బ్రహ్మదేవుడు చెప్పిన మాటలు విను. “గోవును చంపిన వానికి, మద్యము తాగిని వానికి, దొంగతనము చేసిన వానికి, ప్రాయశ్చిత్తము కలదుకానీ, చేసిన మేలు మరచిపోయిన కృతఘ్నునికి ఎలాంటి ప్రాయశ్చిత్తములేదు”. ఇది బ్రహ్మవాక్కు.

ఓ సుగ్రీవా!ముందు నీ పని పూర్తి చేసుకున్నావు. ఇప్పుడు రాముని పని చేయడానికి ఉత్సాహం చూపడం లేదు. నీవు అసత్యము పలికేవాడివి. కృతఘ్నుడవు. దుర్మార్గుడవు. నీవు కోరిన ప్రకారము రాముడు నీ అన్న వాలిని చంపి నీకు రాజ్యమును, నీ భార్యను ఇప్పించాడు. నీవు కూడా నీవు చేసిన ప్రతిజ్ఞ ప్రకారము సీతను వెదకడంలో రామునికి సాయం చెయ్యాలి కదా! కానీ నీవు నీ ప్రతిజ్ఞను నిలుపుకోకుండా, ఇలాస్త్రీలతో సుఖించడం మంచిదా! నీవు ఇలాంటివాడివి అని రామునికి తెలియదు. తెలిస్తే నీతో స్నేహం చేసేవాడే కాదు. నీ వంటి దుర్మార్గుడిని, అసత్యవాదిని, పాపాత్ముడిని,

చెడ్డ బుద్ధి కలవాడిని ఈకిష్కింధకు రాజును చేసేవాడే కాదు.

ఓ సుగ్రీవా! నీవు, రాముడు నీకు చేసినమేలు గుర్తుంచుకొని, ప్రత్యుపకారము చేయకపోతే, నీవుకూడా వాలిని కలుసుకుంటావు. నీకు రాముని ధనుస్సునుండి వెలువడిన బాణము శక్తి ఇంకా తెలిసినట్టు లేదు. అందుకే రామునికి ఇచ్చిన మాట మరిచి హాయిగా కామసుఖాలలో తేలియాడుతున్నావు." అని సుగ్రీవుని తన వాడి అయిన మాటలతో హెచ్చరించాడు లక్ష్మణుడు.

శ్రీమద్రామాయణము కిష్కింధాకాండము
ముప్పదినాలుగవ సర్గ సంపూర్ణము
ఓం తత్సత్ ఓం తత్సత్ ఓం తత్సత్

కిష్కింధా కాండము
ముప్పది ఐదవసర్గ.

లక్ష్మణుడు చెప్పిన మాటలు విని సుగ్రీవుడికి నోట మాట రాలేదు. కాని చతురంగా మాట్లాడటంలో నేర్పరి అయిన తార లక్ష్మణునితో ఇలా అంది. "ఓ లక్ష్మణ కుమారా! నీ నోటి నుండి ఇటువంటి పరుష వాక్యములు రాకూడదు. అటువంటి మాటలు సుగ్రీవుడు వినకూడదు. నీవు అనుకుంటున్నట్టు ఈ సుగ్రీవుడు కృతజ్ఞత లేనివాడు కానీ, శఠుడు కానీ, దారుణమైన పనులు చేయువాడుకానీ, అసత్యములు ఆడువాడు కానీ, కుటిలమైన బుద్ధి కలవాడు కానీ కాడు.

సుగ్రీవునికి రాముడు మహోపకారముచేసాడు. అది నిజము. రాముడు చేసిన ఉపకారమును సుగ్రీవుడు మరచిపోలేదు. ఇదీ నిజమే. రాముని అనుగ్రహము వలననే సుగ్రీవుడు ఈ రాజ్యమును, తన భార్య రుమను, నన్ను పొందగలిగాడు. కొన్ని సంవత్సరముల పాటు వాలి చేతిలో బాధలు పడి నిద్ర, ఆహారము లేకపోవడం వలన, ఒక్కసారి సుఖములు వచ్చి మీద పడేటప్పటికి, సుగ్రీవునికి కాలము తెలియలేదు. ఇదీ నిజమే.

పూర్వము విశ్వామిత్రుని వంటి మహాఋషి మేనక మోహంలో పడి సంవత్సరములు రోజులుగా గడిపాడు. మహాత్ముడైన విశ్వామిత్రుడే కాలమును గుర్తించలేనపుడు, వానరుడు అయిన ఈ సుగ్రీవుడు ఎంత? దొరక్క దొరక్క దొరికిన దేహసుఖములను, కామసుఖములను అనుభవించడంలో అలసిపోయి శరత్కాలము వచ్చినది అనుమాట మరిచిన ఈ వానర రాజును రాముడు క్షమించాలి. కాబట్టి లక్ష్మణకుమారా! నీవు నిజానిజములు తెలుసుకొని తరువాత నిందించు. అంతే కానీ, తాత్కాలిక కోపమునకు వశము కాకు.

ఓ లక్ష్మణా! సుగ్రీవుని బదులుగా నేను నిన్ను వేడుకుంటు న్నాను. నీ కోపమును విడిచి పెట్టు. శాంతము వహించు. సుగ్రీవుడు పట్టిన పట్టు వదిలి పెట్టడు. రామ కార్యము నిర్వహించడంలో సుగ్రీవుడు ఈ రాజ్యమును, సమస్త సంపదలను, అంగదుని, తన భార్య రుమను, నన్ను కూడా విడిచిపెట్టడానికి వెనుకాడడు అని నా నమ్మకము. సుగ్రీవుడు, ఆ రావణుడు సీతను ఎక్కడదాచాడో వెదికి

పట్టి, రావణుని హతమార్చి, సీతను రాముని దగ్గరకు చేర్చగలడు.

రావణుని నివాసమైన ఆ లంకలో శతకోటి సహస్ర రాక్షసులు ఉన్నారట. (అంటే నూరుకోట్లవేల రాక్షసులు---1,000,000,000,000 ఇదీ సంఖ్య), ముప్పదిఆరు ఆయుతముల రాక్షసులు ఉన్నారని ప్రతీతి. (ఆయుతము అంటే పదివేలు). ముందు వీరిని చంపకుండా రావణుని జయించడం, సీతను తీసుకు రావడం సాధ్యము కాదు. నీవు, రాముడు, ఎవరి సాయమూ లేకుండా రాక్షస సేనలను నిర్మూలించడం సాధ్యం కాదు. సుగ్రీవుడు కూడా ఒంటరిగా ఆ రాక్షసులను చంపలేడు. కాబట్టి మీకు సుగ్రీవుని సాయము తో పాటు కోట్ల కొద్దీ వానరులసాయము అత్యావశ్యకము.

రావణుని గురించి, రావణుని బలము గురించి నా భర్త వాలికి బాగా తెలుసు. ఆయనే నాకు పైవిషయములుచెప్పాడు. నేను నా భర్త వాలి నుండి విన్న విషయములను నీకు చెప్పాను. కాబట్టి, మనకు కావలసిన వానర సైన్యములను సమకూర్చుటకు సుగ్రీవుడు వానర ప్రముఖులను నలుదిశలకు పంపాడు. వారు ఈరోజే ఇక్కడకు రావాలి. సుగ్రీవుడు ఇదవరకే చేసిన ఏర్పాటు ప్రకారము కోట్లకొలది వానరులు, భల్లూకములు కిష్కింధకు చేరుకుంటున్నారు. వారందరూ తమరి అధీనంలో ఉంటారు. కాబట్టి నీకోపాన్ని విడిచి పెట్టి శాంతము వహించు.

నేను, రుమ, అంత:పుర స్త్రీలు అందరూ నీ కోపముతో నిండిన ముఖమును చూచి భయంతో వణికిపోతున్నాము. సుగ్రీవునికి కూడా వాలికి పట్టిన గతి పడుతుందని అల్లాడుతున్నాము. కాబట్టి నీ

కోపం ఉపసంహరించుకో." అని వినయంగా ఉన్న విషయం చెప్పింది తార.

శ్రీమద్రామాయణము

కిష్కింధాకాండము ముప్పది ఐదవ సర్గ సంపూర్ణము

ఓం తత్సత్ ఓం తత్సత్ ఓం తత్సత్

కిష్కింధా కాండము

ముప్పది ఆరవసర్గ.

ఎంతో సున్నితంగా, ధర్మబద్ధంగా యుక్తియుక్తంగా పరిస్థితులను వివరించిన తార మాటలను లక్ష్మణుడు అంగీకరించాడు. లక్ష్మణుడు శాంత పడ్డాడు అని ధృవపరచుకున్న సుగ్రీవుడు తన భయాన్ని విడిచిపెట్టాడు. లక్ష్మణుని చూచి ఇలా అన్నాడు.

"ఓ లక్ష్మణకుమారా! నేను రాముని దయచేత ఈ కిష్కింధా రాజ్యాన్ని, నా ఐశ్వర్యాన్ని, నా కీర్తిని, నా భార్యను తిరిగి పొందాను. దానిని నేను ఎన్నటికీ మరచిపోలేను. నాకు ఇంత మహోపకారము చేసిన రామునికి నేను ఎంత ప్రత్యుపకారము చేసినా తక్కువే అవుతుంది. రామునికి కేవలము నేను సహాయకుడుగానే ఉంటాను. రాముడే రావణుని చంపి, సీతను పొందగలడు. ఒకే బాణము చేత ఏడు సాల వృక్షములనుకూల్చిన రామునికి నా సాయం ఎందుకు. రావణ సంహారము కొరకు ముందు రాముడు నడుస్తుంటే నేను ఆయన వెనక వెళతాను.

ఈ లోకంలో తెలిసో తెలియకో అపరాధము చేయని వాడు

ఎవడూ ఉండడు కదా! రాముని పట్ల నేను తెలిసో తెలియకో ఏదైనా అపరాధము చేస్తే నన్ను క్షమించు." అని రెండు చేతులూ జోడించి ప్రార్థించాడు సుగ్రీవుడు.

సుగ్రీవుని మాటలకు లక్ష్మణుడు ఎంతో సంతోషించాడు. సుగ్రీవునితో ఇలా అన్నాడు. "ఓ వానర రాజా! నీ వినయమునకు విధేయతకు చాలా సంతోషించాను. నీవలన రామకార్యము నెరవేరుతుంది అన్న నమ్మకము నాకు ఉంది. నీవు ఇంతటి ధర్మాత్ముడవు, వినయ వంతుడవు అవడం వలననే ఈ కిష్కింధా రాజ్యమునకు రాజువు కాగలిగావు. నీసాయముతో రాముడు రాక్షసులతో యుద్ధము చేసి వారిని చంపగలడు. ఇందులో ఎలాంటి సందేహము లేదు.

నీవు ధర్మమునకనుసరించి పలికిన మాటలు నాకు ఎంతో సంతోషాన్ని కలుగచేసాయి. ఎందుకంటే నీ తప్పును నీవు తెలుసుకొని యుక్తియుక్తంగా మాట్లాడటం నీకే చెల్లింది. దేవతలే నిన్ను రామునికి సహాయకుడిగా పంపారని అనుకుంటున్నాను. ఓ సుగ్రీవా! నీవు నా వెంట వచ్చి రామునికి జరిగినది అంతా చెప్పి, సీతా వియోగముతో బాధపడుతున్న రాముని ఓదార్చు. రాముని బాధ చూడలేక, జరిగింది తెలుసుకోకుండా, తొందరపడి నీతో పరుషంగా మాట్లాడాను. నన్ను క్షమించు." అని అన్నాడు లక్ష్మణుడు.

శ్రీమద్రామాయణము

కిష్కింధా కాండము ముప్పది ఆరవసర్గ సంపూర్ణము

ఓం తత్సత్ ఓం తత్సత్ ఓం తత్సత్

కిష్కింధా కాండము

ముప్పది ఏడవ సర్గ.

లక్ష్మణుని మాటలు విని సుగ్రీవుని మనస్సు సంతుష్టి చెందింది. వెంటనే పక్కనే ఉన్న హనుమంతుని చూచి ఇలాఅన్నాడు.

"హనుమా! మహేంద్రపర్వతము మీద, వింధ్యపర్వతము మీద, కైలాస పర్వతము మీద, మందరపర్వతము మీద, నివసించు చున్న వానరము లందరినీ కిష్కింధలో సమావేశము కావాలని వర్తమానము పంపించు. అలాగే సముద్ర ప్రాంతములలో నివసించు వానరములను, పశ్చిమ దిక్కున ఉన్న ఆదిత్య పర్వతము మీద ఉన్న వానరములను, పద్మాచలము మీద ఉన్న వానరములను, అంజనా పర్వతము మీదున్న వానరములను, మేరు పర్వత శిఖరములలో ఉన్న వానరములను, ధూమ్రగిరి మీద నివసించే వానరములను, మహారుణ పర్వతము మీద నివసించే వానరములను, ఇంకా ఇతర ప్రాంతము లలో భూమి మీద, కొండల మీద, పర్వత శిఖరముల మీద నివసించే సమస్త జాతుల వానములను కిష్కింధలోసమావేశము కావాలని సుగ్రీవాజ్ఞగా తెలియచెయ్యండి. ఇంతకు పూర్వము మనము పంపిన వానర ప్రముఖులను తొందరగా పనిపూర్తిచేసుకొని రమ్మని వర్తమానము పంపు. ఇదంతా పది రోజులలో జరగాలి. నా ఆజ్ఞను ధిక్కరించిన వారికి మరణ దండన విధింపబడుతుంది అని తెలియచెయ్యి. నా అధికార పరిధిలో ఉన్న సమస్త జాతుల వానరములు ఇక్కడకు రావాలి. నా ఆజ్ఞను అందరికీ తెలియ జేయుటకు వేగంగా ఎగురగలిగే వానరములను, అన్ని ప్రదేశములను

క్షుణ్ణంగా తెలిసిన వానరములను నలుదిక్కులకు పంపు. ఇదంతా ఈరోజుజరగాలి.” అని హనుమంతునికి ఆదేశాలు ఇచ్చాడు సుగ్రీవుడు.

సుగ్రీవుని ఆజ్ఞ ప్రకారము వానరములు నలుదిక్కులకు వెళ్లాయి. సముద్రప్రాంతములలోనూ, పర్వత శిఖరముల మీద, కొండ లోయలలోనూ, అడవులలోనూ, సరస్సుల వద్ద నివసించు సమస్త వానరములను రామ కార్యము నిమిత్తము కిష్కింధకు రావలసినదిగా సుగ్రీవుని ఆజ్ఞను తెలియజేసాయి. మృత్యువుతో సమానమైన సుగ్రీవుని ఆజ్ఞను అనుసరించి సమస్త వానరములు కిష్కింధకు ప్రయాణం కట్టాయి.

పర్వత ప్రాంతముల నుండి మూడు కోట్లవానరములు వచ్చాయి. బంగారు ఛాయగల పదికోట్లవానరములు వచ్చాయి. కైలాస శిఖరము నుండి వెయ్యి కోట్ల వానరములు వచ్చాయి. హిమవత్పర్వతము మీది నుండి వెయ్యికోట్ల వానరములు వచ్చాయి. వింధ్య పర్వతము నుండి లెక్కలేనన్ని వానరములు వచ్చాయి. ఇంకా అరణ్యములనుండి, కొండ గుహల నుండి లెక్కలేనన్ని వానరములు వచ్చాయి.

హిమవత్పర్వతము మీద ఉన్న వానరములను పిలవడానికి వెళ్లిన వానరులు అక్కడ ఒక మహావృక్షమును చూచారు. పూర్వము ఆ ప్రదేశములో మహేశ్వరుని గురించి ఒక యజ్ఞము చేయబడింది. ఆ సమయంలో అక్కడ పడిన యజ్ఞశేషములనుండి ఉద్భవించిన ఆ మహా వృక్షములకు కాసిన మధురమైన ఫలములను వారు చూచారు. ఆ ఫలములను తిన్న వారికి ఒకమాసము వరకూ

ఆకలిదప్పులుఉండవు. అది తెలిసిన వానరులు, ఆ ఫలములను, పుష్పములను, ఆ చెట్టు వేళ్లను తీసుకొని వచ్చారు. ఆ మహిమ గల ఫలములను వారు సుగ్రీవునికి కానుకగా ఇచ్చారు.

వానరులందరికీ సుగ్రీవుని ఆదేశాన్ని అందించామని, వానరులందరూ వెంటనే వస్తున్నారనీ సుగ్రీవునికి తెలియజేసారు. ఆ మాటలు విన్న సుగ్రీవుడు ఎంతో సంతోషించాడు. వారు తెచ్చిన కానుకలు స్వీకరించాడు.

శ్రీమద్రామాయణము

కిష్కింధా కాండము ముప్పది ఏడవ సర్గ సంపూర్ణము

ఓం తత్సత్ ఓం తత్సత్ ఓం తత్సత్

కిష్కింధా కాండము

ముప్పది ఎనిమిదవ సర్గ.

హిమాచలము నుండి వానరులు తెచ్చిన కానుకలు తీసుకొని వారిని పంపివేసాడు సుగ్రీవుడు. సుగ్రీవుడు చేస్తున్న ప్రయత్నములను చూచి లక్ష్మణుడు తృప్తి చెందాడు.

"ఓ సుగ్రీవా! ఇంక మనము రాముని వద్దకు పోవుదము. రాముడు మన రాక కొరకు ఎదురు చూస్తూ ఉంటాడు." అని అన్నాడు.

"అవశ్యము లక్ష్మణా! అలాగే వెళ్లెదము." అని అన్నాడు

సుగ్రీవుడు.

తారను మిగిలిన స్త్రీలను లోపలకు పంపివేసాడు. తన అనుచరులకు పల్లకినీ తీసుకు రమ్మని ఆదేశించాడు. వెంటనే వానరులు అందమైన పల్లకిని తీసుకొని వచ్చారు. ఆ పల్లకిలో సుగ్రీవుడు, లక్ష్మణుడు ఎక్కారు. వంది మాగధులు స్తుతిస్తూ ఉండగా, అనుచరులు తెల్లని ఛత్రము పట్టి, వింజామరలు వీచుచుండగా, లక్ష్మణుడు, సుగ్రీవుడు కలిసి పల్లకిలో ఎక్కి రాముని వద్దకు వెళ్లారు. సుగ్రీవుడు పల్లకి దిగి, రాముని ఎదురుగా రెండు చేతులు కట్టుకొని నిలబడ్డాడు. సుగ్రీవుని వెంట వచ్చిన వానర వీరులు కూడా అదేమాదిరి చేతులు కట్టుకొని వినయంగా నిలబడ్డారు.

వారిని అందరినీ రాముడు మిత్రభావంతో చూచాడు. సుగ్రీవుడు రాముని పాదాల మీద పడి నమస్కరించాడు. రాముడు సుగ్రీవుని బుజాలు పట్టుకొని లేవ నెత్తాడు. ప్రేమతోనూ గౌరవంతోనూ కౌగలించుకున్నాడు. సుగ్రీవుని తన పక్కనే కూర్చోపెట్టుకున్నాడు రాముడు. రాముడు సుగ్రీవునితో ఇలా అన్నాడు.

“మిత్రమా! సుగ్రీవా! ధర్మమును, అర్థమును, కామమును ఆయా కాలములందు అనుభవించు వాడు రాజు అనిపించుకుంటాడు. అటువంటి రాజు నిరంతరము జాగరూకతతో ఉంటాడు. కాని ధర్మమును, అర్థమును విడిచి కేవలము కామాసక్తుడైన వాడు మాత్రము, ఆపదలు వచ్చినపుడు మాత్రమే మేలుకుంటాడు. తన తప్పును తెలుసుకుంటాడు. శత్రువులను ఓడిస్తూ, మిత్రులను ఆదరించే వాడు ఉత్తముడైన రాజు.

కాబట్టి ఓ మిత్రమా! మన ఒప్పందము ప్రకారము మనము సీతను వెదకడానికి ప్రయత్నాలు మొదలెట్టాలి. నీ మంత్రులతో ఆలోచించి తగు నిర్ణయం తీసుకో!" అని సుగ్రీవునికి తన తప్పు తెలిసేటట్టు సున్నితంగా మాట్లాడాడు రాముడు.

రాముని మాటలలో ఉన్న అంతరార్థమును గ్రహించిన సుగ్రీవుడు రామునితో ఇలా అన్నాడు.

"ఓ రామా! నేను నీ వలన మహోపకారము పొందాను. నేను పోగొట్టుకున్న రాజ్యమును, ఐశ్వర్యమును, నా భార్యను నీ అనుగ్రహము వలన పొందగలిగాను. మీరు చేసిన ఉపకారమునకు నేను ప్రత్యుపకారము చేయనిచో, నేను ధర్మము తప్పిన వాడిని అవుతాను.

నేను నా ప్రయత్నాలు శరదృతువురాగానే మొదలెట్టాను. వివిధ ప్రాంతముల నుండి వానరసేనలను కిష్కింధకు చేరుకోవాలని ఆదేశాలు ఇచ్చాను. లెక్కకు మించిన వానరములు కిష్కింధకు చేరుకుంటున్నాయి. ఇంకా చాలా మంది వానర వీరులు తమ తమ సైన్యములతో మార్గమధ్యములో ఉన్నారు.

ఓ రామా! శతములు, శతసహస్రములు (లక్షలు), కోట్లు, ఆయుతములు, శంకువు, అర్బుదములు, శతాధిక అర్బుదములు సంఖ్యలో రకరకాల వానరజాతులు కిష్కింధకు చేరుకుంటున్నారు. వీరందరూ నీ అధీనములో ఉంటారు. వీరంతా రావణుని రాజ్యము మీదికి దండెత్తి, రావణుని సంహరించి, సీతను తీసుకురాగలరు." అని

క్లుప్తంగా వినయంగా చెప్పాడు సుగ్రీవుడు.

సుగ్రీవుని మాటలకు రాముడు ఎంతో సంతోషించాడు.

శ్రీమద్రామాయణము
కిష్కింధా కాండము ముప్పది ఎనిమిదవ సర్గ సంపూర్ణము
ఓం తత్సత్ ఓం తత్సత్ ఓం తత్సత్

కిష్కింధా కాండము
ముప్పది తొమ్మిదవ సర్గ.

రెండు చేతులూజోడించి తనముందు నిలబడి పైవిధంగా పలికిన సుగ్రీవుని చూచి రాముడు సంతోషంతో అతనిని కౌగలించుకున్నాడు.

“చంద్రుడు వెన్నెల కురిపించినట్టు నీ వంటి మిత్రుడు తన చర్యలతో నాకు ఆనందము కల్గిస్తున్నాడు అనడంలో ఆశ్చర్యం ఏముంటుంది? నీ గురించి నాకు బాగా తెలుసు. ఏదన్నా ఒక కార్యము తలపెడితే, దానిని నిర్విఘ్నముగా నెరవేరుస్తావు. నీ సాయం ఉంటే నేను యుద్ధములో శత్రువులను అందరినీ జయిస్తాను. ఆ రావణుడు తనకు వినాశ కాలము దాపురించి నా సీతను అపహరించాడు.” అని అన్నాడు రాముడు.

ఇంతలో భూమ్యాకాశాలు దద్దరిల్లేటట్టు పెద్ద పెద్ద శబ్దములు వినిపించాయి. లక్షల కోట్ల సంఖ్యలో వానరములు అక్కడకు వస్తున్నాయి. ముందు వానర సేనానాయకులు నడుస్తూ ఉంటే వారి వెనక వానరాలు వస్తున్నాయి. లక్షకోట్లు వానరములతో వచ్చిన శతబలి అనే వానర వీరుడినిచూచాడు సుగ్రీవుడు. తరువాత వేల కోట్ల వానరములతో తార తండ్రి సుషేణుడు వచ్చాడు. రుమ తండ్రికూడా వేయి కోట్ల వానరములతో వచ్చాడు. హనుమంతుని తండ్రి కేసరి వేల కోట్ల వానరములతో వచ్చాడు. గవాక్షుడు అనే వానర రాజు వేయి కోట్ల వానరములతో వచ్చాడు.

ధూమ్రుడు అనే భల్లూక రాజు రెండు వేల కోట్ల భల్లూకములతో(ఎలుగు బంట్లు) వచ్చాడు. పనసుడు అనే వానర సేనా నాయకుడు మూడుకోట్ల వానరములతో వచ్చాడు. నీలుడు అనే వానర వీరుడు పదికోట్ల వానరములతో వచ్చాడు. గవయుడు అనే వానర సేనాధి పతి ఐదుకోట్ల మంది వానరములతో వచ్చాడు. దరీముఖుడు అనే వానర సేనాని వెయ్యికోట్ల వానరములతో వచ్చాడు.

అశ్వినీ దేవతల కుమారులు అయిన మైందుడు, ద్వివిదుడు అనే వానర శ్రేష్ఠులు ఒక్కొక్కరు వేయి కోట్ల వానరులతో వచ్చారు. గజుడు అనే వానర వీరుడు మూడుకోట్ల వానరులతో వచ్చాడు. జాంబవంతుడు అనే భల్లూకరాజు పదికోట్ల భల్లూకములతో వచ్చాడు. రుమణుడు అనే వానర వీరుడు వందకోట్ల మంది వానరవీరులతో వచ్చాడు. గంధమాధనుడు అనే వానర వీరుడు పదివేల కోట్ల వానరులతో వచ్చాడు.

వాలికుమారుడు అంగదుడు వేయి పద్మములు, నూరు శంకువుల సంఖ్య వానరములతో సహా వచ్చాడు. తారుడు అనే వానర వీరుడు ఐదుకోట్ల వానరములతో వచ్చాడు. ఇంద్రజానువు అనే వానరసేనాని పదకొండుకోట్ల వానరములతో వచ్చాడు. రంభుడు అనే వానర వీరుడు శత,సహస్ర,ఆయుతముల వానరములతో వచ్చాడు. దుర్ముఖుడు అనే వానర సేనాని రెండు కోట్ల వానరములతో వచ్చాడు.

హనుమంతుడు తన అధీనములో ఉన్న వెయ్యికోట్ల వానరములతో వచ్చాడు. నలుడు అనే వానర వీరుడు వందకోట్ల, ఒకవెయ్యి, ఒక వంద వానరములతో వచ్చాడు. వీరే కాకుండా శరభుడు, కుముదుడు, వహ్ని, రంభుడు అనే వానర వీరులు అసంఖ్యాకములైన వానర సేనలతో వచ్చారు.

ఆ వానర సేనకు నాయకులు అందరూ వచ్చి సుగ్రీవునికి తాము వచ్చినట్టు విన్నవించుకున్నారు. ఆ వానర సేనానాయకులను సుగ్రీవుడు రామునికి పేరుపేరునా పరిచయం చేసాడు. తరువాత సుగ్రీవుడు ఆ వానరసేనానాయకులతో ఇలా అన్నాడు. “ఓ వానర సేనానాయకులారా! మీరందరూ మీ మీ సేనలతో ఈ పర్వతముల మీద అనుకూల మైన ప్రదేశములతో విడిది చేయండి. అప్పుడు రాముడు మన బలగముల గురించి తెలుసు కోడానికి వీలవుతుంది.”అని అన్నాడు.

శ్రీమద్రామాయణము

కిష్కింధా కాండము ముప్పది తొమ్మిదవ సర్గ సంపూర్ణము

ఓం తత్సత్ ఓం తత్సత్ ఓం తత్సత్

కిష్కింధా కాండము

నలుబదవ సర్గ.

వానర సేనానాయకులకు ఆ ప్రకారంగా ఆదేశాలు ఇచ్చాడు సుగ్రీవుడు. తరువాత రాముని చూచి ఇలా అన్నాడు.

"ఓ రామా! ఎంతో బలవంతులు, కామరూపులు, ఎక్కడికైనా క్షణంలో పోగలవారూ అయిన వానరులు కోట్ల సంఖ్యలో వచ్చి ఉన్నారు. వీరంతా దైత్యులను, దానవులను, రాక్షసులను సమర్థవంతంగా ఎదిరించగల సామర్థ్యము కలవారు.

ఓ రామా! ఈ వానరులు నేల మీద, నీటి మీద, ఆకాశంలోనూ సంచరించగల సమర్థులు. పైగా వీరికి అలసట అనేది లేదు. పూర్వము ఎన్నోయుద్ధములలో పాల్గొన్న అనుభవము కలవారు. వీరంతా ఇప్పుడు నీ ఆజ్ఞల కోసరము ఎదురుచూస్తున్నారు. నీవు ఏ పని చెబితే ఆ పని చేయడానికి సిద్ధంగా ఉన్నారు. ఇప్పుడు ఏమి చేయాలో చెప్పండి. మన సైనికులకు ఆజ్ఞలు ఇవ్వండి. ఏమి ఆజ్ఞలు ఇవ్వాలో నాకు తెలిసినా, అవి నీ నోటి నుండి వస్తే బాగుంటుంది." అని అన్నాడు సుగ్రీవుడు.

అప్పుడు రాముడు సుగ్రీవునితో ఇలా అన్నాడు. "మిత్రమా! సుగ్రీవా! ప్రస్తుతము మనము సీత గురించి అన్వేషించాలి. ఆమె జీవించి ఉన్నదా లేక మరణించినదా! జీవించి ఉంటే ఎక్కడ ఉంది! ఆ రావణుడు సీతను ఎక్కడ దాచి ఉంచాడు? ఈ విషయములను

మనము కనుక్కోవాలి. సీతను గురించి, రావణుని నివాసము గురించి, సీతను ఉంచిన ప్రదేశమును గురించి తెలిసిన తరువాత, తదుపరి కార్యక్రమమును ఆలోచిస్తాము. సీతను వెదికే కార్యక్రమములో నాకు గానీ, లక్ష్మణునికి గానీ ఎలాంటి అనుభవము సామర&ధ్యము లేవు. అది నీవే నిర్వహించాలి. ఈ అన్వేషణా కార్యక్రమము నిర్వహించుటకు నీవే సమర్ధుడవు. ఎందుకంటే ఏయే ప్రదేశాలు ఎక్కడెక్కడ ఉన్నాయో నీకు బాగా తెలుసు. కాబట్టి నీవే వానరులకు తగు ఆదేశాలు ఇవ్వు." అని అన్నాడు.

అప్పుడు సుగ్రీవుడు వినతుడు అనే వానరసేనానిని పిలిచాడు. "ఓ వానరోత్తమా! నీవు నీ సైన్యముతో తూర్పు దిక్కుకు వెళ్లు. అక్కడ ఉన్న పర్వతములలోనూ గుహలలోనూ అడవులలోనూ నదుల తీరాలలోనూ, సమతల ప్రదేశాలలోనూ సీతను గురించి వెదుకు. గంగా, సరయూ, కాళిందీ, యమునా, కౌశికీ, సరస్వతీ మొదలగు నదీతీరాలలో వెదుకు. విదేహ, మాళవ,కాశీ,కోసల,పౌండ్ర, అంగ దేశములలో అన్ని పట్టణములను గ్రామములను, జనపదములను సీత కొరకు వెదకండి.

అంతే కాదు కొన్ని పర్వతములు సముద్రములో మునిగి ఉంటాయి. అక్కడకూడా వెతకండి. భూమి మీద ఉన్న పర్వత శిఖరము లను వెదకండి. అక్కడ మనుష్యులను చంపి తినే కిరాతులు ఉంటారు. అక్కడ కూడా వెదకండి. సముద్రమధ్యలో ఉన్న ద్వీపములను కూడా విడిచిపెట్టకుండా వెదకండి. కొంతమంది నీటి మధ్యలో ఉంటూ ఉంటారు. వారిని కూడా వదలకండి.

యవద్వీపము ఉంది. అక్కడ ఏడురాజ్యాలు ఉన్నాయి. ఆ

రాజ్యాలలో కూడావెదకండి. తరువాత బంగారు గనులతో విరాజిల్లు సువర్ణ ద్వీపమును, రజితద్వీపమును, వెదకండి. యవద్వీపము అవతల శిశిరము అనే పర్వతము ఉంది. ఆ పర్వత శిఖరము మీద దేవతలు దానవులు నివసిస్తూ ఉంటారు. ఆ పర్వతము మీద కూడా సీత కొరకు వెదకండి.

అక్కడ నుండి, ఎర్రని నీళ్లు గల శోణ నది దగ్గరకు వెళ్లండి. అక్కడ సముద్రమును దాటండి. సముద్రము ఆవల ఉన్న అరణ్యములను సీతకొరకు వెదకండి. సముద్రము మధ్య ఉన్న ద్వీపములలో కూడా వెదకండి. అక్కడ పెద్ద పెద్ద శరీరములతో ఉన్న అసురులు మనుష్యులను, జంతువులను, వాటి నీడను పట్టుకొని తమ వద్దకు లాగుకొని, ఆహారంగా తింటూ ఉంటారు. (ఇప్పటి బెర్ముడా ట్రయాంగిల్ ఇలాంటిదే)

దానిని దాటిన తరువాత ఎర్రని నీళ్లతో కూడిన లోహితము అనే సముద్రము కనిపిస్తుంది. అక్కడ ఒక పెద్ద కూటశాల్మలీ వృక్షము కనిపిస్తుంది. అక్కడే గరుత్మంతుడు నివాసము ఉంటాడు. ఆయన గృహమును విశ్వకర్మ నిర్మించాడు. అక్కడున్న పర్వతముల మీద మందేహులు అనే భయంకరమైన రాక్షస జాతి నివసిస్తూ ఉంటుంది. అక్కడకూడా వెదకండి. తరువాత పాలవంటి నీరు కల క్షీరసముద్రము వద్దకు వెళ్లండి. ఆ సముద్రము మధ్యలో ఋషభ అనే తెల్లని పర్వతము ఉంది. ఆ పర్వతము మీద సుదర్శనము అనే సరస్సు ఉంది. అక్కడకు దేవతలు, చారణులు, యక్షులు, కిన్నరులు, వానరులు క్రీడించడానికి వస్తుంటారు. ఆ పర్వతము మీద కూడా వెదకండి.

క్షీరసముద్రము దాటగానే మీకు జలసముద్రము

కనిపిస్తుంది. అ సముద్రములో బడబాగ్ని ప్రజ్వరిల్లుతూ ఉంటుంది. ఆ సముద్రము ఉత్తర తీరంలో జాతరూపశిలము అనే పెద్ద పర్వతము ఉంది. ఆ పర్వతము మీద భూభారమును మోయుచున్న వేయి పడగల ఆదిశేషువు కనపడతాడు. ఆయనకు మూడు తలలు ఉన్న తాళవబుక్షము కేతనము (పతాకము).

దాని తరువాత మీకు ఉదయ పర్వతము కనపడుతుంది. దాని మీద సౌమనసము అనే శిఖరము ఉంది. అది బంగారు వర్ణంలో ప్రకాశిస్తూ ఉంటుంది. ఆ శిఖరము యోజనము విస్తీర్ణము కలిగి ఉంది. పూర్వము త్రివిక్రమావ తారంలో శ్రీమహావిష్ణువు ఒక పాదమును ఇక్కడ, మరొక పాదమును మేరు పర్వతము మీద మోపాడని అంటారు. సూర్యుని సంచారము ఇక్కడ నుండి మొదలవుతుంది. ఆ పర్వతము మీద వాలఖిల్యులు అనే మునులు తపస్సు చేసుకుంటూ ఉంటారు. అక్కడే సుదర్శన ద్వీపము ఉంది.

ఈ ఉదయ పర్వత శిఖరము ప్రాత:కాలసమయమున సూర్యుని తేజస్సుతో ప్రకాశిస్తూ ఉంటుంది. బ్రహ్మ ఈ పర్వతమును మొట్ట మొదటగా తూర్పు దిక్కున, ఈ భూమికి ద్వారముగానూ, సూర్యుడు ఉదయించడానికి స్థానముగానూ సృష్టించాడు. అందుకే సూర్యుడు ఉదయించు దిక్కును తూర్పు దిక్కు (పూర్వదిక్కు) అని పిలుస్తారు. మీరు వెళ్లి ఆ ఉదయ పర్వతముమీద పూర్తిగా వెదకండి. ఉదయ పర్వతము ఆవలకు ఎవరూ వెళ్లలేరు. అక్కడ సూర్యుడు లేనందు వలన అంధకారంగా ఉంటుంది. ఉదయ పర్వతము గుహలలోనూ శిఖరముల మీదా సీత కోసరం వెదకండి. మీరు ఉదయ పర్వతము వరకు మాత్రమే వెళ్లగలరు. ఉదయ పర్వతము ఆవల

ఏముంటుందో నాకు కూడా తెలియదు. అందుకని మీరు ఉదయ పర్వతమువరకూవెళ్లి, సీతను వెదకి, ఒక నెలలోపు తిరిగి రావాలి. నెలరోజులలోపు మీరు తిరిగా రాకపోతే మీకు మరణదండన విధింపబడుతుంది." అని సుగ్రీవుడు వానర యోధులను ఆదేశించాడు.

శ్రీమద్రామాయణము
కిష్కింధా కాండము నలుబదవ సర్గ సంపూర్ణము
ఓం తత్సత్ ఓం తత్సత్ ఓం తత్సత్

కిష్కింధా కాండము
నలుబది ఒకటవ సర్గ.

ఆ ప్రకారము సుగ్రీవుడు వానరులను తూర్పుదిక్కుకుపంపిన తరువాత, మరి కొంత మంది వానరులను దక్షిణదిక్కుగా పంపాడు. దక్షిణ దిక్కుకు పంపబడిన వానరులలో ప్రముఖులైన అగ్నికుమారుడు నీలుడు, వాయుపుత్రుడు హనుమంతుడు, బ్రహ్మదేవుని కుమారుడైన జాంబవంతుడు, సుహోత్రుడు, శరారి, శరగుల్ముడు, గజుడు, గవాక్షుడు, సుషేణుడు, వృషభుడు, మైందుడు, ద్వివిదుడు, విజయుడు, గంధమాధనుడు, అగ్నిపుత్రులైన ఉల్కాముఖుడు, అనంగుడు, వాలి కుమారుడు అంగదుడు వెళ్లారు. ఆ వానర వీరులందరికీ వాలి కుమారుడు అంగదుని నాయకుడుగా చేసాడు సుగ్రీవుడు. అంగదుని నాయకత్వంలో వానరవీరులు దక్షిణ దిక్కుకు వెళ్లడానికి సిద్ధంగా ఉన్నారు. దక్షిణ దిక్కున ఉన్న ప్రదేశముల గురించి సుగ్రీవుడు ఈ విధంగా చెప్పసాగాడు.

"ఓ వానవీరులారా! దక్షిణ దిక్కున వింధ్యపర్వతము, నర్మదానది, గోదావరీ నది, కృష్ణవేణి అనేమహానది, వరదానది, మేఖల దేశము, ఉత్కలదేశము, దశార్ణదేశము, ఆబ్రవంతి, అవంతి నగరములు ఉన్నాయి అక్కడ అంతా వెదకండి. ఇంకా విదర్భ, ఋష్టిక, మత్స్య, కళింగ, కౌశిక, ఆంధ్ర, పుండ్ర, చోళ, పాండ్య, కేరళ దేశములలో వెదకండి. ఇంకా దట్టమైన దండకారణ్యము, గోదావరీ తీరము పూర్తిగా వెదకండి. దానికి దక్షిణముగ ఉన్న మలయపర్వతము మీద కూడా వెదకండి.

తరువాత మీకు కావేరీ నది కనపడుతుంది. అక్కడే అగస్త్యమహాముని ఆశ్రమము ఉంది. ఆ మహామునిని దర్శించి, ఆయన ఆశీర్వాదము తీసుకొని, తామ్రపర్ణి నదిని దాటండి. తరువాత పాండ్యదేశము చేరుకోండి. అక్కడి నుండి సముద్ర తీరము చేరుకోండి. ఆ సముద్రమధ్యలో అగస్త్యుడు నిలిపిన మహేంద్రపర్వతము ఉంది. ఆ పర్వతము సముద్రములోనికి చొచ్చుకొని ఉన్నది. మహేంద్రుడు పర్వదినములలో ఆ పర్వతము వద్దకు వస్తుంటాడు.

సముద్రము ఆవలి ఒడ్డున నూరు యోజనముల వైశాల్యము గల ఒక ద్వీపము ఉంది. ఆ ద్వీపమునకు మానవులు వెళ్లలేరు. మీరు ఆద్వీపమునకు పోయి వెదకండి. రావణుడు ఆ ద్వీపములోనే ఉంటాడు. అందుకని అక్కడ సీతను ఉంచే అవకాశము ఉంది. దక్షిణ సముద్ర మధ్యలో ఒక స్త్రీ ఉంది. ఆమె పేరు అంగారక. ఆమె ప్రాణులయొక్క నీడను బట్టి ఆ ప్రాణులను తన వద్దకు లాగి తింటూ ఉంటుంది. దక్షిణ దిక్కున ఉన్న నేను చెప్పిన ప్రదేశములలో సీతను వెదకండి.

ఈ ద్వీపమును దాటిన తరువాత సముద్రము నూరు యోజనములు విస్తరించి ఉంది. సముద్రమధ్యలో పుష్పితకము అనే పర్వతము ఉంది. ఆ పర్వతము ఆకాశము అంత ఎత్తులో ఉంది. ఆ పర్వతము మీత చంద్రుడు నివాసము ఉంటాడు. దుర్మార్గులు, నాస్తికులు, ఆపర్వతమును చూడలేరు. మీరు ఆ పర్వతమునకు నమస్కరించండి. తరువాత ఆపర్వతము మీద కూడా వెదకండి.

ఆ పర్వతమునకు పదునాలుగు యోజనముల దూరంలో సూర్యవంతము అనే పర్వతము ఉంది. ఆ పర్వతము దాటిన తరువాత మీకు వైద్యుతము అనే పర్వతము ఉంది. ఆ పర్వతమును దాటి ముందుకు వెళ్లండి. తరువాత మీకు కుంజరము అనే పర్వతము కనిపిస్తుంది. ఆ పర్వతము మీద అగస్త్యుని గృహము ఉంది. ఆ గృహమును విశ్వకర్మ బంగారంతో నిర్మించాడు.

తరువాత మీకు భోగవతీ నగరము కనిపిస్తుంది. ఆ నగరము సర్పములకు నివాసము. ఆ నగరంలో వాసుకి నివసిస్తూ ఉంటాడు. మీరు ఆ భోగవతీనగరంలో కూడా వెదకండి. భోగవతీ నగరమును దాటిన తరువాత మీకు ఋషభ అనే పర్వతము కనిపిస్తుంది. ఆ పర్వతము ఋషభాకారంలో ఉంటుంది కాబట్టి ఆ పేరు వచ్చింది. ఆ పర్వతము మీద ఉన్న అరణ్యములలో రకరకాలైన చందనపు చెట్లు ఉన్నాయి. ఆ వనమును గంధర్వులు రక్షిస్తుంటారు. ఆ పర్వతము మీద శైలూషుడు, గ్రామణి, శిక్షుడు, శుకుడు, బభ్రువు అనే ఐదుగురు గంధర్వులు నివసిస్తూ ఉంటారు.

ఆ పర్వతము తరువాత మీకు పితృలోకములు కనిపిస్తాయి. మీరు అక్కడకు వెళ్లవద్దు. అది యమలోకము. అంతా చీకటిగా ఉంటుంది. శరీరంతో ప్రాణులు అక్కడకు వెళ్లలేరు. కాబట్టి మీరూ అక్కడకు వెళ్లవద్దు.

నేను చెప్పిన ప్రదేశములన్నింటినీ సీతకోసం వెదకండి. ఆమెజాడ తెలుసుకోండి. మీరు ఈ పనిని నెలరోజులలో పూర్తిచేయాలి. ఈ పని మీరు చేస్తే మీకు నా తో సమానమైన గౌరవము లభిస్తుంది. మీరు ఎన్ని అపరాధములు చేసినా క్షమిస్తాను. కాబట్టి మీరందరూ వెంటనే సీతను వెదకడం కోసరం బయలుదేరండి." అని అన్నాడు సుగ్రీవుడు.

శ్రీమద్రామాయణము

కిష్కింధా కాండము నలుబది ఒకటవ సర్గ సంపూర్ణము

ఓం తత్సత్ ఓం తత్సత్ ఓం తత్సత్

కిష్కింధా కాండము

నలుబది రెండవ సర్గ.

కొంతమంది వానరప్రముఖులను దక్షిణ దిక్కుకు పంపిన తరువాత తార తండ్రి, తనకు మామగారు అయిన సుషేణుని నాయకత్వములో కొంతమంది వానరులను పశ్చిమదిక్కుగా పంపాడు. తన కన్నా పెద్ద వాడు తనకు మామగారు అయిన సుషేణునికి నమస్కరించి సుగ్రీవుడు ఇలా అన్నాడు.

"మీనాయకత్వంలో రెండులక్షల వానరములను తీసుకొని మీరు పశ్చిమ దిక్కుగా వెళ్లండి. మీకు సాయంగా అర్చిష్మంతుడు, అర్చి, మాల్యుడు ఉంటారు. మీరు సౌరాష్ట్ర, బాహ్లిక,చంద్రచిత్ర దేశములలో సీతకోసం వెదకండి. అక్కడి నుండి పశ్చిమ సముద్రము వైపుగా వెళ్లండి. పశ్చిమ సముద్ర తీరంలో ఉండే పర్వతములను గుహలను, అరణ్యములను సీత కోసరం, రావణుని కోసరం వెదకండి. సముద్రతీర పట్టణములైన మురచీ, జటాపురము, అవంతీనగరము, అంగలేపాపురము, మొదలగు నగరములను వెదకండి.

అక్కడినుండి పడమరగా వెళ్లండి. అక్కడ సింధునది సముద్రంలో కలిసేచోట ఒక పెద్ద పర్వతము ఉంది. దాని పేరు సోమగిరి. దానిమీద సింహములు, ఏనుగులు నివసిస్తూ ఉంటాయి. మీరు ఆ పర్వతశిఖరమును ఆమూలాగ్రం వెదకండి. తరువాత మీరు పశ్చిమ సముద్రములో ఉన్న పారియాత్ర పర్వతమునకు వెళ్లండి. ఆ పర్వతశిఖరము మీద ఇరువది నాలుగుకోట్లమంది గంధర్వులు నివసిస్తూ ఉంటారు. వారి వద్దకు మాత్రం వెళ్లకండి. ఆ పర్వతము మీద ఉన్న వృక్షములకు కాసిన ఫలములు తినకండి. గంధర్వులు ఆ చెట్లను రక్షిస్తూ ఉంటారు. మీరు సాధారణ వానరులుగా పోయి సీత కోసం వెదకండి. ఆ గంధర్వులు మిమ్ములను ఏమీ చేయరు.

అక్కడకు దగ్గరలో నూరుయోజనముల ఎత్తుగల ఒక మహాపర్వతము ఉంది. ఆ పర్వతము మీద గుహలలో మీరు వెదకండి. సముద్రమును నాలుగవ వంతు ఆక్రమించే చక్రవంతము అనే పర్వతము ఉంది. ఆ పర్వతము మీద విశ్వకర్మ వేయి అంచులు కల

చక్రమును ఒక దానిని నిర్మించాడు. ఆచక్రాన్ని హయగ్రీవుడు అనే దానవుడు రక్షిస్తూ ఉండేవాడు. శ్రీమహావిష్ణువు ఆ దానవుని సంహరించి ఆ చక్రమును, పంచజనుడు అనే వానిని చంపి పాంచజన్యమును అనే శంఖమును స్వీకరించాడు. ఆ పర్వతము మీద ఉన్న గుహలయందు, అడవులయందు సీత కోసం వెదకండి.

తరువాత సముద్ర గర్భంలో వరాహము అనే పర్వతము ఉంది. అక్కడే ప్రాగ్జ్యోతిష పురము అనే పట్టణము ఉంది. ఆ పట్టణాన్ని నరకుడు అనే దానవుడు పరిపాలిస్తున్నాడు. వరాహ పురమును దాటిన తరువాత మీకు సర్వసౌవర్ణము అనే పర్వతము కనిపిస్తుంది. ఆ పర్వతము మీద రకరకాల క్రూరమృగములు సంచరిస్తూ ఉంటాయి. దాని తరువాత మేఘము అనే పర్వతము ఉంది. దాని మీదనే దేవతలు మహేంద్రునికి పట్టాభిషేకము నిర్వహించారు.

ఆ మేఘ పర్వతము తరువాత మీకు అరవై వేల బంగారు పర్వతములు కనిపిస్తాయి. ఆ పర్వతముల మధ్య మేరు పర్వతము ఉంది. ఆ పర్వతము మీద ఉన్న ప్రతి వస్తువు మీద, దేవ, గంధర్వ, దానవుల మీదా తన కిరణములు పడి, బంగారు రంగులో ప్రకాశిస్తూ ఉంటాయి అని మేరు పర్వతమునకు సూర్యుడు ఒక వరము ప్రసాదించాడు. ఆ పర్వతము మీద విశ్వే దేవతలు, అష్టవసువులు, సప్తమరుత్తులు, ఇతర దేవతలు కలిసి సూర్యుని సేవిస్తూఉంటారు. ఆ మేరు పర్వతము మీద విశ్వకర్మ వరుణుని కొరకు ఒక దివ్యమైన భవనమును నిర్మించాడు. ఆ భవనంలో వరుణుడు నివాసము ఉంటాడు.

మేరు పర్వతమునకు పదివేలయోజనముల దూరంలో అస్తాద్రి అనే పర్వతము ఉంది. అక్కడే సూర్యుడు అస్తమిస్తాడు. మేరు పర్వతము అస్తాద్రి మధ్యలో పదితలలు కలిగిన పెద్ద బంగారు తాటిచెట్టు ఉంది. మీరు ఆయాప్రదేశములలో సీత కోసరం వెదకండి.

ఆ ప్రాంతములోనే ధర్మాత్ముడు అయిన మేరుసావర్ణ అనే ఋషి తపస్సుచేసుకుంటున్నాడు. మీరు ఆఋషికి నమస్కరించి సీత గురించి ఆయనను అడగండి.

మీరు నేను చెప్పిన విధంగా అస్తాద్రి వరకూ ప్రయాణించి సీత కోసం వెదకండి. మరలా ఒక నెలలోపు తిరిగిరండి. మాసము దాటిన వారికి మరణదండన తప్పదు. మీ అందరికీ మా మామగారు సుషేణుడు నాయకత్వము వహిస్తాడు. మీరు ఆయన మాటను నా మాటగా శిరసావహించండి. మీరు సీత జాడ తెలుసుకుంటే. నాకు మహోపకారము చేసిన వారు అవుతారు. నేను కూడా రాముని ఋణం తీర్చుకున్నవాడిని అవుతాను." అని సుగ్రీవుడు సుషేణునితోనూ, వానర సేనానాయకులతోనూ అన్నాడు. సుషేణుడు వానరవీరులతో కలిసి సీతను వెదుకుతూ పశ్చిమదిక్కుకు వెళ్లడానికి సమాయత్తము అయ్యాడు.

శ్రీమద్రామాయణము

కిష్కింధా కాండము నలుబది రెండవ సర్గ సంపూర&ణము

ఓం తత్సత్ ఓం తత్సత్ ఓం తత్సత్

కిష్కింధా కాండము

నలుబది మూడవసర్గ.

పడమట దిక్కుకు సుషేణుని పంపిన తరువాత, శరబలుడు అనే వానర శ్రేష్ఠుని చూచి సుగ్రీవుడు ఇలా అన్నాడు.

"శరబలా! నీ మంత్రులతోనూ, ఒక లక్షమంది వానరులతోనూ మీరు ఉత్తర దిక్కుగా బయలుదేరండి. ఉత్తర దిక్కు పూర్తిగా సీత కోసం వెతకండి. మహాత్ముడైన రాముడు నాకు ఎంతో ఉపకారము చేసాడు. మనము సీతను వెతికి ఆయన వద్దకు చేరిస్తే మనము కూడా రామునికి ప్రత్యుపకారము చేసి ఋణము తీర్చుకున్నవారము అవుతాడు. రామ కార్యము నిర్వర్తించినందుకు మన జన్మలు కూడా సఫలమవుతాయి.

మీరు అడవులలో, పర్వతములమీద, కొండ గుహలలోనూ వెతకండి. ఉత్తర దిక్కుగా ఉన్న మ్లేచ్ఛ, పుళింద, శూరసేన, ప్రస్థల, భరత, కురు, మద్రక, కాంభోజ, యవన, శక, బాహ్లీక, ఋషిక, పౌరవ, టంకణ,(టిబెట్ కావచ్చు) చీన, పరమచీన,(నేటి చైనా కావచ్చు) నీహార, వరద మొదలగు దేశములలో వెదకండి.

తరువాత మీరు సోమాశ్రమమునకు, కాల పర్వతమునకు వెళ్లండి. ఆ పర్వతము అణువు అణువునా సీత కోసం వెదకండి. కాల పర్వతమును దాటి సుదర్శన పర్వతమునకు వెళ్లండి. దాని తరువాత దేవసఖ అనే పేరుగల పర్వతము ఉంది. ఆ పర్వతము మీద ఉన్న అరణ్యాలలో సీతకొరకు వెదకండి.

దేవసఖ పర్వతమునకు నూరు యోజనముల దూరంలో శూన్యప్రదేశము కనిపిస్తుంది. అక్కడ పర్వతములు గానీ, అడవులు గానీ, సరోవరములు గానీ లేవు. ఆ శూన్యప్రదేశమును దాటితే మీరు కైలాస పర్వతమును చేరగలరు. అక్కడ కుబేరుని భవనము ఉంది. అక్కడే పద్మ సరస్సు ఉంది. ఆ సరస్సులో అందమైన హంసలు, పద్మములు, కలువలు కనువిందుగా కనిపిస్తాయి. ఆభవనములో ముల్లోకములలో పూజింపబడేవాడు, యక్షులకు రాజు, ధనముల కలవాడు అయిన వైశ్రవణుడు అనే రాజు నివసిస్తుంటాడు. అక్కడకూడా మీరు రావణుని గురించి, సీతను గురించి వెదకండి.

దాని తరువాత మీరు క్రౌంచపర్వతము వద్దకు వెళ్లండి. అది ఎవరికినీ ప్రవేశించడానికి శక్యము కాదు. మహాత్ములు అయిన ఋషులు కైలాసపర్వతముమీద తపస్సు చేసుకుంటూ ఉంటారు. మీరు కైలాస పర్వతమును, క్రౌంచపర్వతమును పూర్తిగా వెతకండి.

క్రౌంచపర్వతము పక్కన మానసపర్వతము ఉంది. అక్కడ ఏ రకమైన వృక్షములు ఉండవు కానీ పక్షులు ఎగురుతూ ఉంటాయి. మానవులు, దేవతలు, రాక్షసులు అక్కడకు వెళ్లలేరు. క్రౌంచ పర్వతము దాటిన తరువాత మీరు మైనాక పర్వతమును చేరుకుంటారు. ఆ పర్వతముమీద మయుడు అనే దానవుడు ఒక భవనమును నిర్మించుకొని నివసిస్తూ ఉంటాడు. మీరు ఆ మైనాక పర్వతము మీదపూర్తిగా వెదకండి.

మైనాక పర్వతమును దాటిన తరువాత మీకు సిద్ధులు

నివసించే ఆశ్రమము కనిపిస్తుంది. అక్కడ సిద్ధులు, వైఖానసులు, వాలఖిల్యులు నివసిస్తూ ఉంటారు. మీరు వారికి సీత గురించి చెప్పి ఆమె జాడతెలుసుకోండి. అక్కడ వైఖానసులకు సంబంధించిన ఒక సరస్సు ఉంది. పద్మములతో నిండిన ఆ సరస్సులో హంసలు విహరిస్తూ ఉంటాయి.

ఆ సరస్సు దాటిన తరువాత కేవలము ఆకాశము మాత్రము ఉంటుంది. అక్కడ సూర్య చంద్రులు ప్రకాశించరు. అంతా శూన్యము. అక్కడ విశ్రాంతి తీసుకుంటున్న సిద్ధుల తపశ్శక్తి వలన ఆ ప్రదేశం అంతా కాంతిమంతమవుతుంది.

మీరు ఆ ప్రదేశమును దాటిన తరువాత మీరు శైలోద అనే నదిని చేరుకుంటారు. అక్కడే ఉత్తర కురుదేశము ఉంది. అక్కడ ఎన్నో నదులు ప్రవహిస్తూ ఉంటాయి. అక్కడ మణులు, రత్నములు, ముత్యములు దొరుకుతాయి. అక్కడ ఉన్న వృక్షములు అన్ని ఋతువుల లోనూ ఫలములతో పుష్పములతో నిండుగా ఉంటాయి. అక్కడ గంధర్వులు, సిద్ధులు, కిన్నరులు, నాగులు, విద్యాధరులు విహరిస్తూ ఉంటారు. అక్కడ ఎవరూ వాయించ కుండానే రకరకాలైన వాద్యముల ధ్వనులు వినబడుతూ ఉంటాయి. అక్కడ సంతోషమే కానీ దు:ఖమునకు తావు లేదు.

ఆ పర్వతమును దాటిన తరువాత ఉత్తర సముద్రము వస్తుంది. దాని మధ్యలో సోమగిరి అనే పర్వతముఉంది. ఆ పర్వతము నుండి కాంతి ప్రసరిస్తూ ఉంటుంది. అక్కడ ఏకాదశ రుద్ర స్వరూపుడు అయిన పరమశివుడు, బ్రహ్మ నివసిస్తూ ఉంటారు. మీరు కురుదేశమును దాటి ఆవలకు వెళ్లకండి. సోమగిరి మీదికి దేవతలు

కూడా వెళ్లలేరు. మీరుకూడా సోమగిరిని చూచి తిరిగి రండి.

ఉత్తర దిక్కుగా ఉన్న నేను చెప్పిన ప్రదేశములలో సీతకోసం వెదకండి. మీరు సీత జాడ తెలుసుకుంటే మనము రామునికి ఎంతో ప్రియము చేసిన వాళ్లము అవుతాము. మీరంతా సీత జాడ తెలుసుకుంటారు అని ఆశిస్తున్నాను." అని సుగ్రీవుడు వానర వీరులతో అన్నాడు.

శ్రీమద్రామాయణము

కిష్కింధా కాండము నలుబది మూడవ సర్గ సంపూర్ణం.

ఓం తత్సత్ ఓం తత్సత్ ఓం తత్సత్

కిష్కింధా కాండము

నలుబది నాలుగవ సర్గ.

సుగ్రీవుడు వానర ప్రముఖులను నలుదిక్కులకు సీతను వెదకడానికి పంపడాన్ని నిశితంగాచూస్తున్నాడు రాముడు. ఇంతలో దక్షిణ దిక్కుగా వెళ్లడానికి నియమించిన వానర ప్రముఖులలో ఒకడుగా ఉన్న హనుమంతుని పిలిచి సుగ్రీవుడు ఇలా అన్నాడు.

" ఓ హనుమా! నీవు బాగా ఎగురగలవు. భూమి మీద గానీ, ఆకాశంలో గానీ, నీ మార్గానికి అడ్డు లేదు. పైగా నీకు దేవ, గంధర్వ, నాగ, నరలోకముల గురించి బాగుగా తెలియును. నీవు గమన వేగంలో నీ తండ్రి వాయుదేవునితో సమానుడవు. ఆ లోకంలో ఉన్న ప్రాణులలో నీతో సమానమైన ప్రాణి లేదు. కాబట్టి సీతను అన్వేషించ

డంలో ఏది మంచి మార్గమో నీవే ఆలోచించు. ఎందుకంటే, వానరులలో కల్లా బాగుగా ఆలోచించగల సమర్థుడివి నీవే! నీకు అమితమైన దేహబలము, బుద్ధి బలము, దేశకాలములను బట్టి ప్రవర్తించు తెలివితేటలు నీకు పుష్కలంగా ఉన్నాయి. కాబట్టి ఈ కార్యము నిర్వహించుటకు నీవే సమర్థుడివి." అని అన్నాడు సుగ్రీవుడు.

సుగ్రీవుని మాటలు విని రామునికి కూడా హనుమంతుని మీద గొప్పనమ్మకం కలిగింది. పైగా హనుమంతుడు దక్షిణ దిక్కుగా పోతున్నాడు. రావణుడు కూడా సీతను దక్షిణ దిక్కుగా తీసుకువెళ్లాడు అని జటాయువు వలన తెలిసింది. కాబట్టి హనుమంతుడే సీతను కనుగొనే అవకాశం మెండుగా ఉంది. పైగా సుగ్రీవుడు కూడా ప్రత్యేకించి హనుమంతుని మీదనే ఎక్కువ విశ్వాసము ఉంచాడు. పైగా హనుమంతుడు కార్యదీక్ష కలవాడు అనితెలుస్తూ ఉంది.

ఇదివరకు హనుమంతుడు సాధించిన కార్యములను బట్టి, రాజైన సుగ్రీవుడు హనుమంతుని మీద ఉంచిన నమ్మకమును బట్టి, కష్టకాలములో కూడా సుగ్రీవుని విడిచిపెట్టని హనుమంతుని ధర్మనిరతిని బట్టి హనుమంతుడు ఈ కార్యమును సాధించగలడని నమ్మకము కుదిరింది రామునికి. హనుమంతుని వలన తనకార్యము సాధింపబడుతుంది అని నిశ్చయించుకున్నాడు రాముడు.

తనవేలికి ఉన్న ఉంగరము తీసాడు. దాని మీద రాముని పేరు చెక్కబడి ఉంది. "ఓ హనుమంతుడా! నీవు సీతను చూచినపుడు నీవు మాయా రూపములో ఉన్న రాక్షసుడివి అని సీత భయపడే అవకాశము ఉంది. అందుకని, నా పేరు చెక్కబడిన ఈ ఉంగరము నీ

దగ్గర ఉంచుకో. నీవు నా వద్దనుండి వచ్చావని సీతకు నమ్మకం కలిగించడం కోసరం ఈ ఉంగరము సీతకు చూపించు. ఆమె నిన్ను నమ్ముతుంది. ఓ వానరవీరా! నీ ఉత్సాహము, నీ పరాక్రమము, బలము, సుగ్రీవుడు నీ గురించి చెప్పిన మాటలు విన్న తరువాత ఈ కార్యము నీ వలననే సాధ్యమవుతుంది అని నాకు నమ్మకం కలిగింది. అందుకని ఈ ఉంగరము నీకు ఇస్తున్నాను.” అని తన పేరు ముద్రించిన ఉంగరమును హనుమంతునికి ఇచ్చాడు రాముడు.

హనుమంతుడు ఆ ఉంగరమును భక్తితో స్వీకరించాడు. రామునికి పాదాభివందనము చేసాడు. ఆ ఉంగరమును భద్రంగా దాచుకున్నాడు.

తరువాత వానర సైన్యముతో అంగదుని పర్యవేక్షణలో వానర సైన్యము దక్షిణ దిక్కుగా ప్రయాణం అయింది. “ఓ సింహబలుడవైన వాయు పుత్రా! నేను నీ బలముపై ఆధారపడి ఉన్నాను. నీ పరాక్రమంతో సీత జాడ తెలుసుకో!” అని రాముడు మనసులోనే అనుకున్నాడు.

శ్రీమద్రామాయణము

కిష్కింధా కాండము నలుబది నాల్గవ సర్గ సంపూర్ణము

ఓం తత్సత్ ఓం తత్సత్ ఓం తత్సత్

కిష్కింధా కాండము

నలుబది ఐదవ సర్గ.

సీతను వెదకడానికి నాలుగు దిక్కులకు ప్రయాణమైన వానర సేనలు ఉత్సాహంతో బయలుదేరుతున్నాయి. ఎవరికి వారు తామే సీత జాడ కనుక్కోగలము అనే ధీమా వ్యక్తం చేస్తున్నారు. శతబలుడు తన సేనలతో ఉత్తర దిక్కుగా బయలుదేరాడు. వినతుడు తూర్పుదిక్కుగా వెళ్లాడు. హనుమంతుడు, తారుడు, అంగదునితో కలిసి దక్షిణ దిక్కుగా వెళ్లాడు. సుషేణుడు పశ్చిమ దిక్కుగా వెళ్లాడు. అందరూ అన్ని దిక్కులకు ప్రయాణమయ్యారు.

వానరులంతా తమ సహజసిద్ధమైన చపలత్వంతో అరుచుచూ, కేకలు పెట్టుచూ, ఎగురుతూ వెళుతున్నారు. వారంతా "ఆ దుర్మార్గుడు రావణుని చంపి సీతను తీసుకొని వస్తాము" అని శపథాలు చేస్తూ వెళుతున్నారు.

మరికొందరైతే "ఆ రావణుని చంపడానికి ఇంత మంది కావాలా! నేను ఒక్కడినే రావణుని చంపుతాను. రాక్షసులందరినీ చంపుతాను, సీతను తీసుకొని వస్తాను" అని ప్రగల్భాలు పలుకుతున్నాడు.

మరి కొందరు "మీరంతా ఇక్కడే ఉండండి. నేను ఒక్కడినే వెళ్లి సీత పాతాళంలో ఉన్నా సరే తీసుకొని వస్తాను." అని జబ్బలు చరుస్తున్నాడు.

మరి కొందరు "నేనుపెద్దపెద్దచెట్లనే పెకలిస్తాను. కొమ్మలు

విరుస్తాను. పర్వతాలను నుగ్గునుగ్గు చేస్తాను. సముద్రాలను ఇంకింపచేస్తాను." అని మీసాలు మెలేస్తున్నారు.

ఇంకా ఒక్కొక్కళ్లు తమ బలా బలాల గురించి చెప్పుకుంటున్నారు. ఒకడు "నే నూరుయోజనముల దూరం ఎగరగలను" అని అంటే మరొకడు నేను ఇంకా ఎక్కువ దూరము ఎగురగలను అని గంతులేస్తున్నాడు.

మరొకడైతే "ఈ ముల్లోకాలలో నాకు అడ్డులేదు. రానీ ఎవడొస్తాడో చూస్తాను" అని తన వీరత్వాన్ని ప్రదర్శిస్తున్నాడు. బలగర్వితులైన వానరులు ఇలా తమ బలా బలముల గురించి ఒకరితో ఒకరు చెప్పుకుంటున్నారు.

శ్రీమద్రామాయణము కిష్కింధా కాండము
నలుబది ఐదవ సర్గ సంపూర్ణము
ఓం ఓం తత్సత్ ఓం తత్సత్ ఓం తత్సత్

కిష్కింధా కాండము
నలుబది ఆరవ సర్గ.

సుగ్రీవుడు వానరవీరులతో చెప్పిన మాటలన్నీ శ్రద్ధగా విన్నాడు రాముడు. రామునికి ఒక సందేహం కలిగింది. కిష్కింధలో ఉన్న సుగ్రీవునికి భూమండలం గురించిన ఇంతటి పరిజ్ఞానము ఎలా కలిగింది అని విస్మయం కలిగింది. సుగ్రీవుని చూచి ఇలా అన్నాడు. "మిత్రమా! నీవు వానర నాయకులతో వారు ఎక్కడెక్కడ వెదకాలి అన్న

విషయాన్ని ఎంతో విపులంగా చెప్పావు కదా! నీకు ఈ భూమండలం లోని వివిధ ప్రదేశాల గురించి ఎలా తెలుసు?" అని అడిగాడు.

సుగ్రీవునితో ఇలా చెప్పసాగాడు. "రామా! ఇదివరకు నీకు వాలి, దుందుభి సంగతి చెప్పాను కదా. మహిష రూపములో వచ్చిన దుందుభి అనే దానవుని తరుముతూ నా అన్న వాలి వెళ్లాడు. దుందుభి మలయపర్వతము గుహలో ప్రవేశించాడు. వాలి కూడా దుందుభిని తరుముతూ ఆగుహలో ప్రవేశించాడు. నేను గుహద్వారము వద్ద నా అన్న వాలి కోసరము వేచి ఉన్నాను.

ఒక సంవత్సరము గడిచిపోయినది. వాలి బయటకు రాలేదు. కాని ఆ గుహ లో నుండి రక్తము ప్రవాహంలాగా ప్రవహిం చింది. ఆ దుందుభి నా అన్న వాలిని చంపేసాడు అని దు:ఖించాను. నాకు ఆ దుందుభి మీద కోపం వచ్చింది. నా అన్న వాలిని చంపిన వాడు బయటకు రాకూడదు. ఆ గుహలోనే చావాలి అనే ఉద్దేశంతో ఆ గుహ ముఖద్వారమును రాళ్లతోనూ బండలతోనూ మూసివేసాను.

నేను కిష్కింధకు తిరిగి వచ్చాను. వాలి లేడు కాబట్టి వాలి భార్య తారను, నా భార్య రుమను, వాలి రాజ్యమును యధేచ్ఛగా అనుభవిస్తున్నాను. కొన్నాళ్లకు వాలి తిరిగి వచ్చాడు. నాకు భయం వేసింది. నేను సింహాసనము నుండి లేచి వాలికి నమస్కరించి వాలి సింహాసనమును వాలికి తిరిగి ఇచ్చివేసాను. కాని వాలి నా మీద కోపగించాడు. నన్ను చంపడానికి ప్రయత్నించాడు. నేను నా మంత్రులతో సహా పారిపోయాను. వాలి నన్ను వెంబడించాడు.

నేను పరుగెడుతున్నాను. వాలి నన్ను తరుముతున్నాడు. నేను అనేక నదులు, పర్వతములు, అరణ్యములు దాటి పరుగెడుతున్నాను. నాలుగు దిక్కులు పరుగెత్తాను. భూమండలము మొత్తము చుట్టేసాను. తూర్పుదిక్కున ఉదయ పర్వతము వరకు పరుగెత్తాను. క్షీర సాగరమును చూచాను. తరువాత దక్షిణదిక్కుగా పరుగెత్తాను. వింధ్య పర్వతములు దాటి పరుగెత్తాను. అక్కడి నుండి పడమటి దిక్కుకు, అక్కడి నుండి ఉత్తర దిక్కుకు పరుగెత్తాను. మేరు పర్వతమును దాటి ఉత్తర సముద్రమును చేరుకున్నాను. నా వెంట నా మంత్రులు కూడా పరుగెడుతున్నారు. నా మంత్రి హనుమంతుడు నన్ను చూచి ఇలా అన్నాడు.

"రాజా! ఇలా ఎంత కాలము పరుగెడతారు. మనము ఒక సురక్షితమైన ప్రదేశమును చేరుకోవాలి. నాకు ఇప్పుడే జ్ఞాపకము వచ్చింది. మతంగ మహా ముని వాలికి శాపం ఇచ్చాడు. వాలి మతంగ ముని ఆశ్రమ ప్రాంతములలో ప్రవేశిస్తే, అతను మరణిస్తాడు. ఆ మతంగ ముని ఆశ్రమ ప్రాంతము మనకు సురక్షిత ప్రాంతము. మనము అక్కడకు పోదాము." అని అన్నాడు.

హనుమంతుని మాట ప్రకారము మేమందరమూ ఋష్యమూక పర్వత ప్రాంతము చేరుకున్నాము. అక్కడే మతంగ ముని ఆశ్రమము ఉంది. వాలి నన్ను తరుముతూ ఋష్యమూక పర్వతము వరకూ వచ్చి, భయపడి వెనుదిరిగి పోయాడు. ఆ సందర్భములో నేను ఈ భూమండలము అంతా తిరిగి చూచాను. అందువలన నాకు అన్ని ప్రదేశములు అన్నీతెలుసు." అని అన్నాడు సుగ్రీవుడు.

సుగ్రీవుడు పడ్డ బాధలకు రామునికి సంతోషమూ, దు:ఖము రెండూ కలిగాయి.

శ్రీమద్రామాయణము
కిష్కింధా కాండము నలుబది ఆరవ సర్గ సంపూర్ణము.
ఓం తత్సత్ ఓం తత్సత్ ఓం తత్సత్.

కిష్కింధా కాండము
నలుబది ఏడవ సర్గ.

సుగ్రీవునిచే ఆజ్ఞాపింప బడ్డ వానర వీరులు నలుదిక్కులకు వెళ్లారు. సుగ్రీవుడు చెప్పి చోటులన్నీ వెదికారు. పర్వతములు, నదులు, సరస్సులు, అరణ్యములు, కొండ గుహలు గాలించారు. ఎక్కడా సీత గానీ, రావణుడు గానీ కనపడలేదు. సుగ్రీవుడు విధించిన మాసము రోజులు గడిచిపోయినవి. కాని సీత జాడ తెలియలేదు. అందరూ మరలా కిష్కింధకు చేరుకున్నారు. ప్రసవణ పర్వతము మీద ఉన్న సుగ్రీవుని వద్దకు వచ్చారు. తూర్పుదిక్కుకు పోయిన వినతుడు, పడమట దిక్కుకు పోయిన సుషేణుడు, ఉత్తర దిక్కుకు పోయిన శత బలుడు తమ తమ వానర సేనలతో తిరిగి వచ్చారు. రాముని తో కూర్చుని ఉన్న సుగ్రీవుని వద్దకు పోయి ఇలా విన్నవించుకున్నారు.

"రాజా! మీరు ఆదేశించినట్టు మేము అందరమూ అన్ని దిక్కులకూ పోయి నదులు, పర్వతములు, అరణ్యములు, గుహలు, అన్నీ వెదికాము. వెదికిన చోటనే మరలా మరలా వెదికాము. కానీ సీత జాడ

తెలియలేదు. కాని మన అంగదుని నాయకత్వంలో హనుమంతుడు మొదలగు వారు ఇంకా తిరిగి రాలేదు. ఈ మూడు దిక్కులలో సీత కనపడలేదు. కాబట్టి తప్పకుండా దక్షిణ దిక్కున ఆమె జాడ తెలియ గలదు. బుద్ధిమంతుడైన హనుమంతుడు సీత జాడ కనుగొనగలడు." అని వినయంగా చెప్పారు.

శ్రీమద్రామాయణము
కిష్కింధా కాండము నలుబది ఏడవ సర్గ సంపూర్ణము
ఓం తత్సత్ ఓం తత్సత్ ఓం తత్సత్

కిష్కింధా కాండము
నలుబది ఎనిమిదవ సర్గ.

అందరూ అన్ని దిక్కులకు వెళితే అంగదుని నాయకత్వంలో హనుమంతుడు మొదలగు వానర వీరులు దక్షిణదిక్కుగా బయలు దేరారు. వారి వెదకడం వింధ్యపర్వతముల వద్దనుండి మొదలయింది. వానర వీరులందరూ వింధ్యపర్వతముల మీద ఉన్న శిఖరములను, గుహలను, అరణ్యములను, నదులను, సరోవరములను అన్నింటినీ వెతికారు. కాని సీత జాడ కనపడలేదు. కాని వారు తమ పట్టుదల వీడలేదు. అలా వెదుకుతూనే ఉన్నారు. ఒక ప్రదేశము నుండి మరొక ప్రదేశమునకు మారుతూ వెతుకుతున్నారు.

ఆ ప్రకారంగా వెతుకుతుంటే ఒక చోట చెట్లకు పండ్లు కానీ కాయలు కానీ లేవు. అక్కడ ఏ విధమైన జంతువులు లేవు. నిర్మానుష్యంగా ఉంది. సందడి లేదు. జంతువుల అరుపులు

వినిపించడం లేదు. పూల మొక్కలు లేవు. ఓషధీ లతలు లేవు. సరోవరములు లేవు. నీరు లేదు.

కాని అక్కడ ఒక మహర్షి తపస్సు చేసుకుంటూ ఉండే వాడు. ఆయన పేరు కండు మహర్షి. ఆయన నినత్యసత్యవ్రతుడు. ధర్మ తత్పరుడు. ఆయన కుమారుడు, పది సంవత్సరముల బాలుడు, ఆ అరణ్యములో మరణించాడు. కండు మహర్షికి కోపం వచ్చింది. ఆ అరణ్యము మనుషులకు కానీ, జంతువులకు కానీ, పక్షులకు కానీ, వృక్షములకు కానీ జీవించడానికి యోగ్యము కాకుండా శపించాడు.

అటువంటి ప్రదేశములోకి ప్రవేశించారు వానర వీరులు. అక్కడ కూడా వెతుకుతున్నారు. సీత కానీ, సీతను అపహరించిన రావణుడు కానీ కనపడలేదు. కాని వారికి ఒక రాక్షసుడు కనిపించాడు. వాడు పర్వతము మాదిరి ఆకారము కలవాడు. భయంకరంగా ఉన్నాడు. వాడితో యుద్ధం చేయడానికి వానర వీరులు సన్నద్ధం అయ్యారు. తన మీదికి వస్తున్న వానరులను చూచి ఆ రాక్షసుడికి కోపం వచ్చింది.

"ఈ రోజు మీరందరూ నా చేతిలో చచ్చారు" అంటూ తన పిడికిలి పైకెత్తి వారి వెంట పడ్డాడు.

"అమ్మయ్య వీడే రావణుడు" అని అనుకున్నారు. వాలి కుమారుడు అయిన అంగదుడు ఆ రాక్షసుడిని తన చేతితో చాచి ఒక దెబ్బ కొట్టాడు. అంగదుడి దెబ్బకు వాకి మొహం నుండి ముక్కుల నుండి రక్తం కారింది. వాడు కొండమాదిరి కిందపడ్డాడు. చచ్చాడు.

రావణుడు చచ్చాడు కాబట్టి సీతను అక్కడే దాచి ఉంటాడు అని అనుకొని వానరులందరూ వాడు ఉన్న గుహను అంతా వెతికారు. వారికి సీత కనపడలేదు. పక్కనే ఉన్న మరొక గుహలోకి ప్రవేశించారు. ఆ గుహలో కూడా వెదికారు కానీ వారికి సీత కనపడలేదు. అలసి పోయారు. వారందరూ గుహ నుండి బయటకు వచ్చి ఒక చెట్టు కింద కూర్చున్నారు.

శ్రీమద్రామాయణము
కిష్కింధా కాండము నలుబది ఎనిమిదవ సర్గ సంపూర్ణము
ఓం తత్సత్ ఓం తత్సత్ ఓం తత్సత్

కిష్కింధా కాండము
నలుబది తొమ్మిదవ సర్గ.

ఎంత వెతికినా సీత కనపడలేదని వానరులందరూ దీనంగా ఆ చెట్టుకింద కూర్చున్నారు. అంగదుడు వారి వద్దకు పోయి వారికి ఉత్సాహకరమైన మాటలు చెప్పి వారిని మరలా సీతను వెదకడానికి సమాయత్తం చేసాడు.

"వానర వీరులారా! మనము అందరమూ పర్వతములు, వనములు, కొండలు గుహలు అన్నీ వెదికాము. కానీ సీత జాడ కానీ, రావణుని నివాసము కానీ కనిపెట్టలేకపోయాము. మనము బయలు దేరి చాలా కాలము అయినది. సుగ్రీవుడు ఇచ్చిన సమయం అయిపోవచ్చింది. సీత జాడ తెలియలేదు. అసలే సుగ్రీవుడు చండ

శాసనుడు. చెప్పిన సమయానికి తిరిగా రాకపోతే మనకు మరణ దండన తప్పదు.

కాని మనము సుగ్రీవునికన్నా రామునికే ఎక్కువ భయపడాలి. ఎందుకంటే రాముడు సీతావియోగంతో దు:ఖిస్తున్నాడు. కాబట్టి దిగులు చెందకుండా వెదకండి. మనకు తప్పకుండా సీత జాడ దొరుకుతుంది. కార్యసిద్ధి కలగాలంటే నేర్పు, ఓర్పు, ఉత్సాహము ముఖ్యమైన లక్షణములు. కాబట్టి మనము రెట్టించిన ఉత్సాహముతో వెదుకుదాము. తప్పకుండా మనకు సీత జాడ లభిస్తుంది. నాకు తోచినది నేను చెప్పాను. తరువాత మీ ఇష్టము." అని అన్నాడు అంగదుడు.

అప్పటికే బాగా అలసిపోయి ఉన్న గంధమాదనుడు ఇలా అన్నాడు. "అంగదుడు బాగా చెప్పాడు. మనము ఈ శరీరంలో ప్రాణం ఉన్నంతవరకూ సీతను గురించి వెదుకుదాము. వెదికిన చోటునే మరలా మరలా వెదుకుదాము." అని అన్నాడు.

వెంటనే వానరు లందరూ ఉత్సాహంతో లేచారు. నలుదిక్కులకు పోయి వెదకడం మొదలెట్టారు. కొంత మంది పర్వతములు ఎక్కారు. మరి కొంత మంది అరణ్యములలో వెదుకుతున్నారు. ఎంత వెదికినా సీత జాడ కనపడలేదు. కొంచెపు సేపు అలసట తీర్చుకొని మరలా వెదకడం మొదలెట్టారు.

హనుమంతుడు మొదలగు వానర వీరులు పర్వత గుహలలో వెదకడం ఆరంభించారు.

శ్రీమద్రామాయణము
కిష్కింధా కాండము నలుబది తొమ్మిదవ సర్గ సంపూర్ణము
ఓం తత్సత్ ఓం తత్సత్ ఓం తత్సత్

కిష్కింధా కాండము
ఏబదియవ సర్గ.

హనుమంతుడు, తారుడు, అంగదుడు తమ తమ వానర సమూహములతో కలిసి వింధ్య పర్వత గుహలను వెదుకు తున్నారు. గజుడు, గవాక్షుడు, గవయుడు, శరభుడు, గంధమాదనుడు, మైన్దుడు, ద్వివిదుడు, హనుమంతుడు, జాంబవంతుడు, అంగదుడు, తారుడు, జట్టు జట్టుగా విడిపోయి ఆ పర్వత గుహలను వెదుకు తున్నారు.

అలా వెదుకుతూ వారు ఒక దానవునిచేత రక్షింపబడుతున్న ఋక్షబిలము అనే గుహను చూచారు. అప్పటికే వారికి బాగా ఆకలిగా, దాహం వేస్తూ ఉంది. ఎక్కడా నీటి చుక్క దొరకలేదు. ఆహారము దరిదాపుల్లో దొరకడం లేదు. ఆ సమయంలో నీటిలో స్నానం చేసి ఒళ్లంతా తడి తడిగా నీళ్లు కారుతున్న చక్రవాక పక్షులు ఆ గుహలో నుండి బయటకు ఎగురుతూ రావడం వారికి కనిపించింది.. వారు ఆ బిలములోనికి వెళ్లడానికి ప్రయత్నించారు. కాని వారికి ఎటునుండి వెళ్లాలో తెలియడం లేదు. ఆ బిలమునకు ద్వారము కనిపించలేదు.

అప్పుడు హనుమంతుడు మిగిలిన వానరవీరులతో ఇలా అన్నాడు. "మనము అందరమూ సీత కోసం వెదికి వెదికి అలసిపోయినాము. కాని సీత జాడ తెలియలేదు. ఇక్కడ వృక్షములు పచ్చగా ఉన్నాయి. నీటిలో తడిసిన పక్షులు బయటకు వస్తున్నాయి. ఈ బిలము లోపల నీటి సరోవరము ఉండవచ్చును. మనము ఈ బిలము లోనికి ప్రవేశించి మన దాహము తీర్చుకుందాము."అని అన్నాడు. హనుమంతుని మాట విని అందరూ దారీ తెన్నూ లేని, ఆ బిలము లోనికి అతి కష్టం మీద ప్రవేశించారు. లోపల అంతా చీకటిగా ఉంది. ఒకరిని ఒకరు పట్టుకుంటూ, ఆ గుహలో వారు ఒక యోజన దూరము వెళ్లారు. కాని వారికి జలాశయముకనిపించలేదు. నిరాశ చెందారు.

ఆ సమయంలో వారికి ఒక వెలుగు కనిపించింది. వారు ఆ వెలుగు కనిపించిన చోటికి వెళ్లారు. వారికి బంగారము వలె ప్రకాశించు చున్న వృక్షములు, పుష్పించిన లతలు కనపడ్డాయి. అక్కడ రత్నములతో అలంకరింప బడిన వేదికలు ఉన్నాయి. అక్కడ పద్మములతో నిండి ఉన్న సరోవరము కనపడింది. ఆ వానరులు చుట్టు చూచారు. అక్కడ బంగారముతో నిర్మింపబడిన గృహములు, కనపడ్డాయి. ఫలపుష్పములతో నిండి ఉన్న చెట్లు ఆ ఇళ్ల చుట్టు ఉన్నాయి. ఆ ఇళ్లలో తినడానికి మధురమైన పదార్థములు, పానీయములు అమర్చబడి ఉన్నాయి. బంగారు నాణెములు రాసులు రాసులుగా పోసి ఉన్నాయి. ఆ వానరులు ఇవి అన్నీ చూచి ఆశ్చర్య పోయారు.

అక్కడ ఎవరన్నా ఉన్నారా అని ఆ వానరులు వెదుకుతుంటే వారికి ఒక స్త్రీ కనపడింది. ఆమె నార చీరలు ధరించి, జింక చర్మము మీద కూర్చుని ఉంది. ఆమె దివ్యమైన తేజంతో ప్రకాశిస్తూ ఉంది. వానరులందరూ ఆమె చుట్టు నిలబడ్డారు. అప్పుడు హనుమంతుడు ఆమెను చూచి ఆమెకు భక్తితో నమస్కరించి ఇలా అన్నాడు. "అమ్మా! మీరు ఎవరు? ఇక్కడ ఎందుకు ఉన్నారు? ఈ బిలము ఎవరిది? ఈ భవనములు, సంపదలు ఎవరివి?" అని అడిగాడు.

శ్రీమద్రామాయణము
కిష్కింధా కాండము ఏబదియవ సర్గ సంపూర్ణము
ఓం తత్సత్ ఓం తత్సత్ ఓం తత్సత్

కిష్కింధా కాండము
ఏబది ఒకటవ సర్గ.

హనుమంతుడు ఆ తాపసితో ఇంకా ఇలా అన్నాడు. "మాతా! మేము ప్రస్తుతము ఆకలి దప్పులతో బాధ పడుతున్నాము. ఈ బిలములో చీకటిలో యోజన దూరం నడిచాము. అందరమూ బాగా అలసిపోయి ఉన్నాము. ఈ బిలములో జలము దొరుకుతుందని ఆశతో వచ్చాము. కాని ఇక్కడ ఇన్ని పదార్థములను చూడగానే మాకు ఆశ్చర్యం కలిగింది. ఈ బంగారు గృహములు. ఈ వృక్షములు ఎవరివి? ఎలా పుట్టాయి. మీరే సృష్టించారా! లేక మరి ఎవ్వరి తపోబలము వలన ఉ ద్భవించాయా! మాకు ఏమీ అర్థం కావడం లేదు. మాకు వివరంగా చెప్పండి" అని వినయంగా అడిగాడు హనుమంతుడు.

హనుమంతుని మాటలు విన్న ఆ తాపసి హనుమంతునితో ఇలా చెప్పింది. “ఓ వానరములలో గొప్పవాడా! మయుడు అనే దానవుడు ఉన్నాడు. అతనికి అన్ని మాయలు తెలుసు. ఆ మయుడు పూర్వము దానవులకు శిల్పిగా ఉండేవాడు. ఈ భవనములను ఆయనే నిర్మించాడు. ఆ మయుడు ఈ గుహలో వేలకొలది సంవత్సరములు బ్రహ్మదేవుని గురించి తపస్సు చేసి, ఆయన వలన వరములను పొందాడు. ఆ మయుడు ఇక్కడ ఈ భవనములను నిర్మించుకొని ఇక్కడే సుఖంగా కాలం గడిపాడు.

ఆ మయుడు హేమ అనే దేవ కన్య ప్రేమలో పడ్డాడు. ఆ విషయం తెలిసిన ఇంద్రుడు తన వజ్రాయుధముతో ఆ మయుని చంపాడు. మయుడు మరణించిన తరువాత బ్రహ్మ దేవుడు ఆ మయునికి చెందిన ఈ గృహములను, సంపదలను దేవ కన్య హేమకు ఇచ్చాడు.

ఇంక నా పేరు స్వయంప్రభ. నా తండ్రి మేరుసావర్ణుడు. దేవకన్య హేమ నాకు మంచి స్నేహితురాలు. ఆమె ఆదేశము ప్రకారము ప్రస్తుతము నేను ఈ భవనములను, సంపదలను కాపాడుతున్నాను.

ఇంతకూ మీరు ఎవరు? ఏ పనిమీద ఈ వింధ్యపర్వత ప్రాంతములకు వచ్చారు? ఈ అడవులలో ఎందుకు, ఎవరి కోసరం తిరుగుతున్నారు? ఇక్కడకు ఎలా వచ్చారు?

ఇవన్నీ తరువాత చెబుదురు కానీ మీరంతా మంచి ఆకలి,

దప్పికతో ఉన్నట్టున్నారు. ఇక్కడ ఉన్న ఫలములను, తినుబండారములను తృప్తిగా తిని, మధురమైన పానీయములను తాగి సేదతీరండి. తరువాత మీ గురించి నాకు చెప్పండి." అని ఆ తాపసి చెప్పింది.

శ్రీమద్రామాయణము
కిష్కింధా కాండము ఏబది ఒకటవ సర్గ సంపూర్ణము
ఓం తత్సత్ ఓం తత్సత్ ఓం తత్సత్

కిష్కింధా కాండము
ఏబది రెండవ సర్గ.

ఆ తాపసి అనుమతి పొందిన ఆ వానరులు అక్కడ ఉన్న మధురమైన ఫలములను, తినుబండారములను తృప్తిగా తిని, మధురమైన పానీయములను సేవించి భుక్తాయాసంతో పడుకున్నారు. తాపసి తమను అడిగిన విషయం మర్చిపోయారు.

అది చూచి ఆ తాససి స్వయంప్రభ వారి దగ్గరకు వచ్చి "మీ ఆకలి తీరినదా! విశ్రాంతి తీసుకున్నారా! ఇప్పుడైనా మీ గురించి నాకు చెబుతారా!" అని అడిగింది. అప్పుడు హనుమంతుడు స్వయంప్రభతో తమ గురించి చెప్పసాగాడు.

"ఓ మాతా! నా పేరు హనుమంతుడు. మాది కిష్కింధ. వీరంతా నా సహచరులు. మేము వానరులము. అయోధ్యను పరిపాలించు మహారాజు దశరథుని కుమారుడు రాముడు. ఆయన తన భార్య సీతతో వనవాసము చేస్తున్నాడు. దండకారణ్యములో,

జనస్థానములో, రామలక్ష్మణులు ఆశ్రమములో లేని సమయమున, రావణుడు అనే రాక్షసుడు ఒంటరిగా ఉన్న సీతను అపహరించాడు. రాముడు మా వానర రాజు సుగ్రీవునితో మైత్రి చేసుకున్నాడు. సీతను వెతికిపెట్టమని సుగ్రీవుని అడిగాడు. ఆ సుగ్రీవుని ఆజ్ఞమేరకు, వాలి కుమారుడు అంగదుని నాయకత్వంలో, అగస్త్యుడు సంచరించిన ఈ దక్షిణ దిక్కున మేము సీతకోసరం, రావణుని కోసరం వెదుకు తున్నాము. అలా వెదుకుతుంటే మాకు ఆకలి దప్పిక వేసాయి. ఈ గుహలో నుండి నీటితో తడిసిన పక్షులు రావడం చూచి, ఈ గుహలో నీరు ఉండవచ్చని తెలిసి ఈ గుహలో ప్రవేశించాము. నిన్ను చూచాము. నీ వలన మాకు ఆకలి దప్పిక తీరాయి. ఆకలితో మరణించబోవుచున్న మమ్ములను ఆహారము ఇచ్చి కాపాడావు. మేము నీకు ఏమి ప్రత్యుపకారము చేయగలము." అని అడిగాడు హనుమంతుడు.

హనుమంతుని యుక్తియుక్తములైన మాటలు విన్న ఆ స్వయంప్రభ ఇలా పలికింది. "నేను తాపసిని. మీ వలన నాకు కావాల్సిన ఉపకారము ఏమీ లేదు. మీకు ఆకలి తీరింది అంతే చాలు." అని పలికింది స్వయంప్రభ.

అప్పుడు హనుమంతుడు ఆమెతో ఇలా అన్నాడు. "మాతా! మీరు ధర్మమూర్తులు. మా రాజు సుగ్రీవుడు మాకు ఇచ్చిన గడువు మేము ఈ బిలములో దిక్కుతోచకుండా తిరగడంలో గడిచిపోయింది. గడువు లోపల చెప్పిన పని పూర్తిచేయనందుకు, మారాజు సుగ్రీవుడు మాకు మరణ దండన విధిస్తాడు. మేము సీతాన్వేషణము అనే గొప్ప కార్యమును నిర్వర్తించవలసి ఉంది. కాని ఈ గుహలో చిక్కుకు

పోవడం వల్ల ఆ పని చేయలేకపోయాము. ఏం చెయ్యాలో మాకు తోచడం లేదు. మాకు ఆహారం ఇచ్చి కాపాడావు. ఈ ఆపదనుంచి కూడా నువ్వే మమ్ములను కాపాడాలి." అని అన్నాడు హనుమంతుడు.

హనుమంతుని మాటలకు ఆ తాపసి నవ్వి ఇలా పలికింది. "ఈ బిలములో ప్రవేశించిన వాడు ప్రాణాలతో బయటకు వెళ్లలేడు. మీరంతా కళ్లుమూసుకోండి. నేను నా తపఃప్రభావంతో మిమ్ములను ఈ బిలము దాటిస్తాను. కళ్లు తెరిస్తే మాత్రం మీరు ఈ బిలము దాటలేరు." అని చెప్పింది.

ఆ వానరులందరూ గబగబా తమ చేతులతో తమ కళ్లను గట్టిగా మూసుకున్నారు. స్వయంప్రభ తన తపోబలంతో ఆ వానరులను బిలము బయటకు తీసుకొని వచ్చింది. అప్పుడు ఆ తాపసి ఆ వానరులతో ఇలా అంది. "మీరు ఉన్నది వింధ్యపర్వతము. అది ప్రస్రవణ పర్వతము. అది మహాసముద్రము. ఇంక నేను నా స్వస్థానమునకు వెళ్లెదను." అని పలికి స్వయంప్రభ తన బిలంలోకి వెళ్లిపోయింది.

శ్రీమద్రామాయణము కిష్కింధా కాండము
ఏబది రెండవ సర్గ సంపూర్ణము ఓం తత్సత్ ఓం తత్సత్ ఓం తత్సత్

కిష్కింధా కాండము

ఏబది మూడవ సర్గ.

అంగదుని సారధ్యంలో బయలు దేరిన వానర వీరులు అందరూ సాగర తీరం చేరుకున్నారు. వారందరికీ వింధ్యపర్వత బిలంలోనే సుగ్రీవుడు ఇచ్చిన ఒక నెల రోజులు గడువు తీరిపోయింది. తాపసి తపో మహిమ వల్ల సాగర తీరం చేరుకున్నారు. వారందరూ వింధ్యపర్వత ప్రాంతంలో కూర్చుని ఏమి చెయ్యాలో తోచక చింతిస్తున్నారు. పుష్పించిన లతలను చూచి వారు వసంత ఋతువు ప్రవేశించినది అని తెలుసుకున్నారు. తమకు సుగ్రీవుడు ఇచ్చిన గడువు ముగిసి పోయింది అని చింతిస్తున్నారు.

అప్పుడు అంగదుడు వారిని చూచి ఇలా అన్నాడు. "మనము అందరము సీతను వెదకడానికి సుగ్రీవుని ఆజ్ఞ మేరకు బయలు దేరాము. మనకు ఇచ్చిన గడువు ఒక మాసం రోజులు. ఆ మాసం రోజులు మనము ఆ బిలంలో ఉండగానే గడిచిపోయింది. అది మీకు తెలుసు. మనం ఆశ్వయుజ మాసంలో బయలు దేరాము. ఇప్పుడు చైత్రమువచ్చింది.

మీరంతా సుగ్రీవునికి విశ్వాస పాత్రులు. ధర్మం తెలిసిన వారు. నీతి మంతులు. ఇప్పటి దాకా మీరు చేపట్టిన కార్యములు అన్నింటిలోనూ మంచి ఫలితములను సాధించారు. సుగ్రీవుని ఆజ్ఞప్రకారము నేను మీకు నాయకుడు అయ్యానే గానీ, దిశానిర్దేశం చెయ్యడంలో మీరే సమర్ధులు. సుగ్రీవుని ఆజ్ఞ మీరినందుకు మనకు

మరణం తప్పదు. కాబట్టి మనం అందరం మరణించవలసిందే. కిష్కింధకు పోయి మరణ దండన పొందే కంటే ఇక్కడే ప్రాయోపవేశం చేసి మరణించడం మంచిది.

సుగ్రీవుడు చాలా తీక్షణ స్వభావము కలవాడు. ఎట్టి పరిస్థితులలోనూ కాలాతిక్రమణ చేసిన మనలను క్షమించడు. సీత గురించిన వార్తను మనము తీసుకుని వెళ్లకుంటే మనకు మరణ దండన తప్పదు. కాబట్టి మనకు ప్రాయోపవేశమే ప్రస్తుత కర్తవ్యము. సుగ్రీవుని చేతిలో చిత్రహింసలు పడి మరణించేకంటే సుఖంగా ప్రాయోపవేశం చెయ్యడం మంచిది కదా!

మీరు ఇంకొక విషయం మరిచి పోతున్నారు. నేను వాలి కుమారుడను. సుగ్రీవునికి నా మీద లోలోపల కోపం ఉంది. రాముని ప్రోద్బలంతో సుగ్రీవుడు నన్ను యువరాజును చేసాడే కానీ, నా మీద ఉన్న ప్రేమతో చెయ్యలేదు. కాబట్టి సుగ్రీవుడు నన్ను ఊరికే వదలడు. నా తండ్రి మీద ఉన్న తన కోపాన్ని, పగను ఇప్పుడు నా మీద చూపిస్తాడు. నాకు తీక్షణ మైన శిక్ష విధించి నన్ను చంపిస్తాడు. వాలి కుమారుడిగా బతికి, కిష్కింధలో దిక్కులేని చావు చచ్చేకంటే. ఇక్కడ పవిత్రమైన సముద్రతీరంలో ప్రాయోపవేశం చేసి మరణించడం మంచిది అని నా అభిప్రాయము.” అని అన్నాడు అంగదుడు.

యువరాజైన అంగదుని మాటలు విని వానరులు ఇలా అన్నారు. “నీవు చెప్పింది నిజము. రాముడు సీతను చూడవలెనని కోరికతో ఉన్నాడు. రాముడి కోరిక తీర్చవలెనని సుగ్రీవుడు పట్టుబట్టి ఉన్నాడు. మనము సీత జాడ తెలుసుకోకుండా వెళితే మనకు దండన

తప్పదు. అదీ కాకుండా మనము గడువులోపల వెళ్లడం లేదు. సుగ్రీవుడు మనకు ఇచ్చిన గడువు ఎప్పుడో తీరిపోయింది. రాముడికి సంతోషము కలిగించాలనే మిషమీత సుగ్రీవుడు మనలను తీవ్రంగా దండిస్తాడు. చంపిస్తాడు. తప్పుచేసిన వాళ్లము ప్రభువు దగ్గరకుపోవడం మంచిది కాదు. మనము అందరం సుగ్రీవునికి మంత్రులము. ఆయనే మనలను ఈ కార్యము మీద పంపాడు. కాబట్టి మనము సీతను వెదికి ఆమె జాడ తెలుసుకొని వెళ్లాలి కానీ ఒట్టి చేతులతో వెళ్లకూడదు." అని అన్నారు.

ఆ మాటలు విన్న తారుడు అనే వానరుడు ఇలా అన్నాడు. "మనము ఇక్కడే ఉంటే సుగ్రీవుని వలన భయం ఉండదు. ఈ లోపల మనము సుగ్రీవుని బారి నుండి మరణ దండన తప్పించుకొనే ఉపాయం ఆలోచించాలి." అని అన్నాడు. తారుని మాటలకు అంతా సంతోషించారు.

ఈ మాటలు విన్న హనుమంతుడు నిరాశతో నిస్పృహతో ఉన్న అంగదునికి కర్తవ్యబోధ చేయాలని అనుకున్నాడు. ముందు అంగదుని భేదోపాయముతో మిగిలిన వానరుల నుండి విడదీసి, తరువాత దండోపాయముతో బయపెట్టి, కిష్కింధకు తీసుకొని వెళ్లవలెనని అనుకున్నాడు. ఆ ప్రకారము అంగదునితో ఇలా అన్నాడు.

"ఓ అంగదా! నీవు వాలి పుత్రుడవు. యుద్ధం చేయడంలో నీ తండ్రి వాలి కంటే సమర్థుడవు. ఈ వానర రాజ్యమును పాలించుటకు అన్ని అర్హతలు నీకు ఉన్నాయి. కానీ ఈ వానరులకు ధైర్యము లేదు. చపలచిత్తులు. ఏదో మాట్లాడుతుంటారు. వీరికి తమ

భార్యబిడ్డలను వదిలి వచ్చామే అని దిగులు. అందుకని ఏమేమో మాట్లాడుతున్నారు. వీరు నీ ఆజ్ఞలను పాటించరు. ఈ జాంబవంతుడు, నీలుడు, సుహోత్రుడు నీతో కలవరు. నేను కూడా వారితోనే ఉంటాను. సుగ్రీవుడు మనము ఎక్కడ ఉన్నా మనలను వెదికి వెదికి చంపుతాడు. అప్పుడు నీవు ఎన్ని చెప్పినా సుగ్రీవుడు వినడు.

బలవంతుడు బలము లేని వాడితో విరోధము పెట్టుకో వచ్చును కానీ బలహీనుడు బలవంతునితో వైరముపెట్టుకోరాడు. సుగ్రీవుని కంటే మనము దుర్బలులము. సుగ్రీవునితో విరోధం పెట్టుకోవడం మంచిది కాదు. మనము ఇక్కడే ఉంటే, మనలను లక్ష్మణుడు తన బాణములతో హతమారుస్తాడు. లక్షణుని వద్ద నారాచబాణములు అనేకం ఉన్నాయి. మనం ఎక్కడ ఉన్నా అవి మనలను చీలుస్తాయి.

ఈ వానరులందరూ తమ తమ భార్యా పిల్లలను తలచుకుంటూ నిన్ను వదిలేస్తారు. ఎవరి దోవన వారు వెళతారు. వీరు భయస్తులు. ఊరికే బయపడతారు. భయం మనసులో ప్రవేశిస్తే గడ్డిపరక కదిలినా భయంగానే ఉంటుంది. కాబట్టి భయాన్ని వదిలిపెట్టు. సుగ్రీవుని గురించి అనవసరంగా భయపడకు.

మనం అందరం సుగ్రీవుని వద్దకు వెళతాము. జరిగిన విషయాలు చెబుదాము. సుగ్రీవుడు అంత దుర్మార్గుడు కాదు. దయ కల వాడు. నీవు యువరాజువు. కాబోయే రాజువు. సుగ్రీవుడు ధర్మం తప్పి నడవడు. మంచి మనసు కలవాడు. సత్యవ్రతుడు. సుగ్రీవుడు నీకు అపకారం చెయ్యడు. పైగా సుగ్రీవునికి నీ తల్లి తార అంటే ఎంతో

ప్రేమ అభిమానము. తార కోసరం ఏమైనా చేస్తాడు. పైగా సుగ్రీవునికి సంతానము లేదు. నీవు ఒక్కడివే సుగ్రీవుడికి వారసుడివి. కాబట్టి సుగ్రీవుని వలన నీకు వచ్చిన నష్టము ఏమీలేదు. మనం సుగ్రీవుని వద్దకు పోదాము.” అని హనుమంతుడు అన్నాడు.

శ్రీమద్రామాయణము

కిష్కిధా కాండము యాభయి నాలుగవ సర్గ సంపూర్ణము.

ఓం తత్సత్ ఓం తత్సత్ ఓం తత్సత్

కిష్కింధా కాండము

యాభయి ఐదవ సర్గ.

తన ప్రభువు సుగ్రీవునికి అనుకూలంగా, ధర్మసమ్మతంగా హనుమంతుడు మాట్లాడిన మాటలు విన్నాడు అంగదుడు. హనుమంతునితో ఇలా అన్నాడు.

“హనుమా! సుగ్రీవుడు నీవు అనుకున్నంత మంచి వాడు కాదు. అతనిలో మంచితనము ఏకోశానా లేదు. అతని మనసు శుద్ధమైనది కాదు. అతనిలో ఋజువర్తన లేదు. కపటి. హనుమా! సుగ్రీవుడు నా తండ్రి దుందుభిని వెతుకుతూ బిలములోకి వెళితే ఆయన కోసరం వేచి ఉండక, బిలమును మూసి వేసి, రాజ్యమును హరించాడు. అంతే కాకుండా వాలి భార్య, నా తల్లి అయిన తారను కూడా భార్యగా స్వీకరించాడు. అటువంటి వాడు ధర్మాత్ముడు ఎలా

అవుతాడు? అన్నభార్య తల్లి వంటిది కదా. అటువంటి అన్నభార్య తారను, అన్న బతికి ఉండగానే, భార్యగా స్వీకరించడం ధర్మమా!

అంతే కాదు. అగ్నిసాక్షిగా సుగ్రీవుడు రామునితో మైత్రి చేసుకున్నాడు. సుగ్రీవునికి ఇచ్చిన మాట ప్రకారము రాముడు నా తండ్రి వాలిని చంపి సుగ్రీవునికి కిష్కింధకు రాజును చేసాడు. కాని సుగ్రీవుడు ఏం చేసాడు? చేసిన మేలు మరిచి, శరత్కాలము వచ్చినా, రాముని పని గురించి ఆలోచించలేదు. ఇటువంటి వాడు ఎవరు చేసిన ఉపకారమును గుర్తుంచుకుంటాడు.

హనుమా! శరదృతువువచ్చిన తరతువాత ఎంత కాలానికీ సుగ్రీవుడు రాకపోతే, లక్ష్మణుడు వచ్చి చంపుతానని బెదిరిస్తే, లక్ష్మణుని బాణాలకు భయపడి మనలను సీతను వెదకడానికి పంపాడే కానీ, ధర్మం అంటే భయం ఉండి కాదు.

సుగ్రీవుడు అధర్మపరుడు, పాపాత్ముడు, చేసిన మేలు మరిచేవాడు, చంచలస్వభావుడు. అటువంటి వాడిని ఎవరైనా నమ్ముతారా! ముఖ్యంగా వానరులు ఎవరూ సుగ్రీవుని నమ్మరు. నేను సుగ్రీవుని అన్న కొడుకును. తన కొడుక్కు రాజ్యం ఇవ్వకుండా నాకు రాజ్యం ఇస్తాడని నేను ఎలా అనుకోను. పైగా నేను తన శత్రువు కొడుకును. గుణవంతుడైనా గుణహీనుడైన స్వంత పుత్రుడే రాజు అవుతాడు కానీ, శత్రువు కొడుకును ఐన నేను రాజు ఎలా అవుతాను.

నేను సుగ్రీవుని చేతిలో చంపదగిన వాడిని కానీ రాజు కాదగినవాడిని కాను. పైగా నా వల్ల అపరాధము జరిగింది. నేను సుగ్రీవుడు ఇచ్చిన సమయము అతిక్రమించాను. ఒక వేళ సుగ్రీవుడు నన్ను క్షమించినా, కిష్కింధలో దుర్బలుడుగా జీవించలేను. క్రూరుడు, భ్రాతృఘాతకుడు అయిన సుగ్రీవుడు నన్ను రహస్యముగా బంధించి, చంపిస్తాడు. వాడి చేతిలో బంధింపబడి చావడం కంటే ఇక్కడే ప్రాయోపవేశము చెయ్యడం ఉత్తమం.

నేను ఇక్కడే ఉంటాను. కిష్కింధకు రాను. మీరంతా వెళ్లిపొండి. నేను ఇక్కడే మరణిస్తాను. మీరు కిష్కింధకు వెళితే, రామ లక్ష్మణులకు, సుగ్రీవునికి నా నమస్కారాలు చెప్పండి. నా తల్లి రుమను అడిగినట్టు చెప్పండి. నా తల్లి తారను ఓదార్చండి. నా తల్లి తారది జాలి గుండె. నేను మరణించాను అని తెలిస్తే తట్టుకోలేదు. తాను కూడా మరణిస్తుంది. ” అని అన్నాడు అంగదుడు.

అంగదుని మాటలు విన్న వృద్ధ వానరులకు దు:ఖము ముంచుకొచ్చింది. మేము కూడా వెళ్లము. నీతో పాటు ఉంటాము అన్నారు. అందరూ నేల మీద దర్భలు పరుచుకొని ప్రాయోపవేశమునకు ఉపక్రమించారు. వానరులందరూ అంగదుని చుట్టుచేరి, సుగ్రీవుని తిడుతూ ప్రాయోపవేశము చెయ్యడానికి నిశ్చయించుకున్నారు.

సముద్రతీరంలో దర్భలు పరిచారు. తూర్పుముఖంగా కూర్చున్నారు. ఆచమనం చేసారు. రాముని గురించి మాట్లాడుకున్నారు. రాముడు అడవులకు రావడం, జనస్థానంలో ఉండగా రాముడు

రాక్షసులను చంపడం, రావణుడు సీతను అపహరించడం, జటాయువు చావడం, సుగ్రీవునితో స్నేహం, వాలి మరణం ఇవన్నీ తలచుకుంటున్నారు. అందరూ ఆ దర్భాసనముల మీద పడుకున్నారు.

శ్రీమద్రామాయణము
కిష్కింధా కాండము యాభైఅయిదవ సర్గ సంపూర్ణము.
ఓం తత్సత్ ఓం తత్సత్ ఓం తత్సత్

కిష్కింధా కాండము
యాభై ఆరవ సర్గ.

అంగదుని నిర్ణయం ప్రకారము వానరులందరూ ప్రాయోపవేశము చేస్తున్నారు. ఆ సమయంలో జటాయువు సోదరుడు సంపాతి అనే పక్షి రాజు వింధ్యపర్వతగుహలలో నివసిస్తున్నాడు. ఈ వానరుల కోలాహలము విని, సంపాతి గుహలో నుండి బయటకు వచ్చాడు. సంపాతి ఆ వానరులను చూచి చాలా సంతోషించాడు. చాలా రోజుల తరువాత తనకు మంచి రుచికరమైన ఆహారము దొరికింది అనుకున్నాడు.

సంపాతి ఆ వానరులను చూచి " ఎవరెవరి కర్మఫలములను బట్టి వారికి ఆహారము దొరుకుతుంది. నా అదృష్టంకొద్దీ ఈ రోజు మీరు అందరూ నాకు ఆహారము అవుతున్నారు. ముందు ఏ వానరుని భక్షించాలో చెప్పండి. కోరుకునే అవకాశము మీకే ఇస్తున్నాను." అని అన్నాడు సంపాతి.

కిష్కింధా కాండము

సంపాతి మాటలు విన్న అంగదుడు హనుమంతుని చూచి దు:ఖంతో ఇలా అన్నాడు. "హనుమా! మనము చావాలని అనుకున్నాము. సాక్షాత్తు యమధర్మరాజు ఈ పక్షిరూపంలో మనవద్దకు వచ్చాడు. మనము రాముని కార్యము సాధించలేకపోయాము. రాజాజ్ఞను పాటించలేకపోయాము. ఇప్పుడు ఈ ఆపద వచ్చింది.

రామునికి జటాయువు ఎలాంటి సాయం చేసాడో మీకంతా తెలుసు. ధర్మాత్ముడు అయిన జటాయువు సీతను రక్షించడం కోసరం తన ప్రాణాలనే బలి పెట్టాడు. ఒక్క జటాయువే కాదు, జంతువులు అన్నీ రామునికి ఎంతో కొంత సాయం చేసాయి. మోరలెత్తి రావణుడు వెళ్లిన మార్గము చూపించాయి. కాబట్టి మనం కూడా రాముని కొరకు మన ప్రాణాలను విడిచిపెడదాము. సీతాన్వేషణలో మన ప్రాణాలను త్యాగం చేద్దాము.

ఆ నాడు జటాయువుకు సుగ్రీవుని భయం లేదు. ఎలాంటి స్వార్ధం లేకుండా రావణునితో యుద్ధం చేసి రామునికి సాయం చెయ్యడం కోసరం తన ప్రాణాలు త్యాగం చేసాడు. ఉత్తమగతిని పొందాడు. కాబట్టి మనం కూడా రాముని కార్యము కొరకు ప్రాణత్యాగము చేసి ఉత్తమగతులను పొందుతాము. రాముని కొరకు ఆయన తండ్రి దశరథుడు మరణించాడు. రాముని కొరకు జటాయువు మరణించాడు. మనమూ అదేమార్గాన్ని అనుసరిద్దాము." అని అన్నాడు అంగ దుడు.

ఆ మాటలు విన్నాడు సంపాతి. వారి మాటలలో తన అన్న

జటాయువు ప్రసక్తి రావడం గమనించాడు. తాను కూడా దు:ఖిస్తూ ఇలా అన్నాడు.

"జటాయువు నా సోదరుడు. నేను నా సోదరుని నా ప్రాణం కన్నా అధికంగా ప్రేమిస్తాను. నా సోదరుడు జటాయువు గురించి మాట్లాడే మీరు ఎవరు? జటాయువు చావడం ఏమిటి? జటాయువుకు రావణునికి యుద్ధం జరగడం ఏమిటి? ఎందుకు జరిగింది? జటాయువు మిత్రుడు దశరథమహారాజు ఎలా మరణించాడు? జటాయువు గురించిన సమాచారము చాలా కాలము తరువాత ఇప్పుడే వింటున్నాను. మీరు నా సోదరుని గురించి మాట్లాడటం నాకు చాలా ఆనందంగా ఉంది. దండకారణ్యంలో జనస్థానంలో సుఖంగా జీవిస్తున్న నా సోదరుడు జటాయువు ఎలా మరణించాడో వివరంగా చెప్పండి. ఆయన మిత్రుడు దశరథుని గురించి చెప్పండి. మిత్రులారా! సూర్యుని కిరణముల వేడికి నా రెక్కలు కాలిపోయాయి. నేను కదలలేను. నన్ను ఈ పర్వతశిఖరము మీది నుండి కిందికి దింపండి." అని అన్నాడు సంపాతి.

శ్రీమద్రామాయణము

కిష్కింధా కాండము యాభైఆరవ సర్గ సంపూర్ణము

ఓం తత్సత్ ఓం తత్సత్ ఓం తత్సత్

కిష్కింధా కాండము

యాభైఏడవ సర్గ.

సంపాతి మాటలు వానరులు నమ్మలేదు. "వీడెవడో రాక్షసుడు. కామరూపంలో ఉన్నాడు. వీడిని కిందికి దించితే మనలనందరినీ తినేస్తాడు." అని అనుమానపడ్డారు. అందుకని సంపాతిని పర్వతశిఖరము మీదినుండి కిందికి దింపాలా వద్దా అని ఆలోచిస్తున్నారు.

వారికి మరో ఆలోచన కూడా వచ్చింది. "ఎటూ తాము చావడానికే ప్రాయోపవేశం చేస్తున్నారు. అటువంటిది తాము ఈ రాక్షసుడి చేతిలో చావడం మేలుకదా. తొందరగా చావాలనే కోరిక ఈ విధంగా నెరవేరుతుంది." అని కూడా అనుకున్నారు.

ఇలా ఆలోచించిన తరువాత, అంగదుడు సంపాతిని ఆ పర్వత శిఖరము మీది నుండి కిందికి దింపి నేలమీద పెట్టారు. అప్పుడు అంగదుడు సంపాతితో తమ వృత్తాంతము ఇలా చెప్పసాగాడు.

"ఓ పక్షిరాజా! పూర్వము ఋక్షజుడు అనే వానర రాజు ఉండేవాడు. ఆయన నా పితామహుడు. (తాతగారు). వాలి, సుగ్రీవుడు ఆయనకు ఔరసపుత్రులు. వాలి నా తండ్రి. నా తండ్రి తన పరాక్రమంతో ఈ లోకంలో పేరు ప్రఖ్యాతులు సంపాదించాడు. ఇక్ష్వాకు వంశంలో దశరథుడు అనే మహారాజు జన్మించాడు. ఆయన కుమారుడు రాముడు. తండ్రి ఆజ్ఞ పాటించడానికి రాముడు, తన భార్య సీత, సోదరుడు లక్ష్మణునితో అరణ్యవాసం చేస్తూ దండకారణ్యానికి వచ్చాడు.

రావణుడు అనే రాక్షసుడు రాముని భార్య సీతను జనస్థానము నుండి బలవంతంగా తీసుకుపోయాడు. రావణుడు సీతను తీసుకుపోతుంటే జటాయువు అనే పక్షిరాజు చూచాడు. సీతను రక్షించాలని రావణునితో యుద్ధం చేసాడు. కాని రావణుడు జటాయువు రెక్కలు ఖండించి చంపాడు. రామకార్యంలో మరణించిన జటాయువు ఉత్తమగతులు పొందాడు. రాముడు సీతను వెతుకుతూ నా పినతండ్రి సుగ్రీవుని వద్దకు వచ్చాడు. రాముడు సుగ్రీవునితో స్నేహం చేసాడు. సుగ్రీవునికి ఇచ్చినమాట ప్రకారము రాముడు నా తండ్రి వాలిని చంపాడు. సుగ్రీవుడు కిష్కింధకు రాజయ్యాడు.

సుగ్రీవుని ఆజ్ఞప్రకారము మేము సీతను వెదుకుతూ ఇక్కడకు వచ్చాము. కాని సీత జాడను తెలుసుకోలేకపోయాము. సీతను వెదుకుతూ, నీరు దొరుకుతుందేమో అని మేము ఒక బిలము లోకి ప్రవేశించాము. ఆ బిలములో మేము ఆహారము, నీరు కొరకు వెదుకుతండగానే సుగ్రీవుడు మాకు ఇచ్చిన ఒక మాసము కాలము దాటి పోయింది. ఇప్పుడు మేము కిష్కిందకు పోతే సమయపాలన చేయనందుకు సుగ్రీవుడు మమ్ములను చంపుతాడు. రాముడికి, లక్ష్మణునికి సుగ్రీవునికి కోపం తెప్పించి మేము కిష్కిందలో బతకలేము. అందుకని మేము ఇక్కడ ప్రాయోపవేశము చేస్తున్నాము." అని చెప్పాడు అంగదుడు.

శ్రీమద్రామాయణము
కిష్కింధా కాండము యాభైఏడవ సర్గ సంపూర్ణము
ఓం తత్సత్ ఓం తత్సత్ ఓం తత్సత్

కిష్కింధా కాండము

యాభై ఎనిమిదవ సర్గ.

అంగదుడుచెప్పిన మాటలు విని సంపాతికి కన్నీళ్లు ఆగలేదు. సోదరుడు జటాయువు మరణాన్ని తలుచుకొని ఏడుస్తున్నాడు. సంపాతి ఆ వానరులతో ఇలా అన్నాడు.

"రాముని కోసరం, సీతను కాపాడటం కోసరం, తన ప్రాణాలు అర్పించాడు అని మీరు చెబుతున్న జటాయువు నా తమ్ముడు. నాకు ఈ విషయము ఇంతకు ముందే కొద్దిగా తెలుసు. ఇప్పుడు మీ నుండి పూర్తిగా రూఢిపరచుకున్నాను. ఇప్పుడు నాకు రెక్కలు లేవు. అందుకని నా తమ్ముడి మరణానికి నేను రావణుని మీద ప్రతీకారము తీర్చుకోలేను.

పూర్వము వృత్రాసుర వధ జరిగినకాలంలో నేను, నా తమ్ముడు జటాయువు, పోటీలు పడి సూర్యమండలము వైపుకు ఎగురుతున్నాము. సూర్యవేడికి నా తమ్ముడు జటాయువు సొమ్మసిల్లాడు. నేను నా రెక్కలతో నా తమ్ముడు జటాయువుకు రక్షణ కల్పించాను. అప్పుడు సూర్యుని వేడికి నా రెక్కలు కాలిపోయాయి. నేను వింధ్యపర్వతము మీద పడ్డాను. నా తమ్ముడు జటాయువు ఎక్కడ పడ్డాడో తెలియదు. ఇప్పుడు మీ మాటల వలన నా తమ్ముడి గురించి తెలిసింది." అని అన్నాడు సంపాతి.

అప్పుడు అంగదుడు సంపాతితో ఇలా అన్నాడు. “రావణుడు సీతను అపహరించాడు అని జటాయువు వలన రామునికి తెలిసింది. కాని ఆ రావణుడు ఎక్కడ ఉంటాడో చెప్పకుండానే జటాయువు మరణించాడు. ఆ రావణుని నివాసము గురించి నీకు ఏమైనా తెలిస్తే మాకు చెప్పు. దాని వలన మేము సీత యొక్క జాడ కనుక్కోడానికి వీలు కలుగుతుంది.” అని అన్నాడు అంగదుడు.

ఆ మాటలకు సంపాతి ఇలా చెప్పాడు. “నా తమ్ముడు జటాయువు రాముని కోసరం తన ప్రాణాలు అర్పించాడు. నాకు రెక్కలు లేవు కాబట్టి నేను కేవలం మాట సాయం చేస్తాను. నాకు వరుణలోకము, భూలోకము, స్వర్గలోకము పాతాళలోకము, దేవాసుర యుద్ధము, అమృతాన్ని మథించడం అన్నీ నాకు తెలుసు. రావణుడు సీతను తీసుకుపోవడం నేను కూడా చూచాను. అప్పుడు సీత “రామా రామా” అని అరుస్తూ ఉంది.

ఇంక ఆ రావణుని గురించి చెబుతాను వినండి. రావణుడు విశ్రవసుని కుమారుడు, కుబేరునికి తమ్ముడు. ఆ రావణుడు లంకానగరంలో నివసిస్తున్నాడు. ఇక్కడికి నూరుయోజనముల దూరంలో సముద్రమధ్యలో ఒక ద్వీపము ఉంది. ఆ ద్వీపములో విశ్వకర్మచే నిర్మింప బడిన లంక అనే నగరము ఉంది. ఆ నగరము చాలా విలాస వంతంగా ఉంటుంది. బంగారు ద్వారములు, బంగారు అరుగులు, పెద్ద పెద్ద భవనములు ఆ నగరంలో ఉన్నాయి. ఆ నగరం చుట్టు శత్రువులకు ప్రవేశించరాని పెద్ద ప్రాకారము ఉంది.

కిష్కింధా కాండము

రావణుడు సీతను ఆ లంకా నగరంలో బంధించి ఉంచాడు. మీరు లంకా నగరం వెళ్లగలిగితే అక్కడ సీతను చూడగలరు. కాని మీరు నూరు యోజనములు సముద్రము దాటి వెళ్లాలి. అక్కడి నుండి సముద్రమధ్యలో ఉన్న లంకను చేరాలి. మీరు తొందరగా వెళ్లండి. మీరు సీతను చూడగలరు అని నా దివ్యదృష్టికి గోచరమవుతూ ఉంది.

నాకు మా పక్షుల గురించి బాగా తెలుసు. కొన్ని పక్షులు కేవలం ధాన్యము తిని జీవించేవి భూమికి సమాంతరంగానే ఎగురుతాయి. రెండవ జాతి పక్షులు అంటే కాకులు మొదలగునవి ఇంకొంచెం పైగా ఎగురగలవు. క్రౌంచ పక్షులు మొదలగునవి ఇంకా పైన ఎగురగలవు. ఇంక నాలుగవ జాతి పక్షులు అయిన గ్రద్దలు మొదలగునవి ఆకాశంలో చాలా ఎత్తులో ఎగురగలవు. ఇంకా హంసలుమొదలగు పక్షులు ఇంకా ఎత్తులో ఎగురగలవు.

వినతకు గరుడుడు, అరుణుడు జన్మించారు. వారిది ఇంకా ఎత్తున ఎగురగల పక్షి సంతతి. మేము అరుణుని సంతతివారము. రావణుడు నా సోదరుడు జటాయువును చంపాడు. కాబట్టి నేను రావణుని మీద ప్రతీకారము తీర్చుకోవాలి. మేము ఆకాశంలో ఎంత ఎత్తున ఎగురుతున్నా, నేల మీద ఉన్న ఎంత చిన్న వస్తువునైనా నిశితంగా చూడగలము. నాకు లంకలో ఉన్న సీత స్పష్టంగా కనపడుతూ ఉంది.

మేము మాకు సహజంగా ఉన్న తీక్ష్ణమైన చూపు చేత నూరుయోజనముల దూరంలో ఉన్న ఏ వస్తువునైనా చూడగలము.

ఎందుకంటే మేము ఆకాశంలో ఎగురుతూ ఎంతో కింద భూమి మీద ఉన్న సూక్ష్మమైన జంతువులను కూడా చూడగల శక్తిని మాకు ఆ భగవంతుడు ఇచ్చాడు. మీరు ముందుగా సముద్రమును దాటే ఉపాయమును ఆలోచించండి. సముద్రమును దాటితే గానీ లంకా నగరము చేరలేరు.

మీరు నన్ను సముద్రము వద్దకు తీసుకొని వెళ్లండి. చనిపోయిన నా సోదరుడు జటాయువుకు జలతర్పణము విడవాలి." అని అన్నాడు సంపాతి.

సంపాతి చెప్పిన మాటలకు వానరులు ఎంతో సంతోషించారు. రెక్కలు కాలిపోయిన సంపాతిని ఎత్తుకొని అందరూ సముద్ర తీరమునకు వెళ్లారు.

శ్రీమద్రామాయణము
కిష్కింధా కాండము యాభైఎనిమిదవ సర్గ సంపూర్ణము
ఓం తత్సత్ ఓం తత్సత్ ఓం తత్సత్

కిష్కింధా కాండము
యాభైతొమ్మిదవ సర్గ.

సంపాతి చెప్పిన మాటలు వానరుల చెవులకు ఇంపుగా తోచాయి. వారు ఆనందంతో ఉరకలు వేసారు. వారందరిలోకి పెద్ద వాడైన జాంబవంతుడు లేచి సంపాతితో ఇలా అన్నాడు.

"సీత ఎక్కడ ఉంది? సీతను ఎవరు చూచారు? సీతను అపహరించిన వాడు ఎవరు? ఇవన్నీ నీకు ఎలా తెలుసు? మాకు తెలియజెయ్యి. పైవివరాలు మాకు తెలియజేస్తే నీవు మాకు మహోపకారము చేసినవాడివి అవుతావు. ఇంతకూ సీత రాముని భార్యఅని తెలిసీ, రాముని బాణము శక్తీ, మహిమ తెలిసీ సీతను అపహరించిన ఆ మూర్ఖుడు ఎవరు? " అని అన్నాడు జాంబవంతుడు.

. దానికి సంపాతి ఇలా చెప్పసాగాడు. "సీతను అపహరించడం గురించి నాకు ఎలా తెలిసిందో, నాకు ఎవరు చెప్పారో, ఇప్పుడు సీత ఎక్కడ ఉందో, మీకు వివరంగా చెబుతాను. వినండి. మీకు ఇదివరకే చెప్పాను కదా. నేను సూర్యకిరణముల వేడికి తాళలేక, రెక్కలు కాలిపోయి ఈ పర్వతము మీద పడిపోయాను. కదలలేక పడిఉన్నాను. పైగా నేను వృద్ధుడను. నా బలము, పరాక్రమము నశించిపోయాయి. కదలలేను.

అట్టి పరిస్థితిలో నా కుమారుడు సుపార్శ్వుడు నాకు ప్రతి దినము ఆహారము తెచ్చి పెట్టేవాడు. గంధర్వులకు కామము అధికము. పాములకు కోపము ఎక్కువ. లేళ్లకు భయం ఎక్కువ. అలాగే పక్షులమైన మాకు ఆకలి అధికము. ఒక రోజు నా కుమారుడు నాకు ఆహారము ఏమీ తేలేదు. సూర్యాస్తమయ సమయానికి వట్టి చేతులతో వచ్చాడు. నాకు ఆకలితో కడుపు నకనకలాడిపోతోంది. ఆకలికి తట్టుకోలేక నేను నా కొడుకును ఆహారం తేలేదని తిట్టాను. నా కొడుకు నన్ను తిట్టవద్దని ప్రార్థించాడు. తాను ఆహారము తీసుకురాకపోవడానికి కారణం ఈ విధంగా చెప్పాడు.

“తండ్రీ! నేను ప్రతి దినము వలె ఆహారము కొరకు మహేంద్రపర్వత శిఖరము మీద కూర్చుని ఉన్నాను. నా తల వంచి సముద్రములో ఉన్న చేపలను పట్టడానికి ప్రయత్నిస్తున్నాను. ఆ సమయంలో ఒకడు పెద్ద రాక్షసుడు, నలట్లికొండ మాదిరి ఆకారముతో ఉన్నవాడు, ఒక స్త్రీని తన చేతులతో ఎత్తుకొని ఆకాశంలో తీసుకు పోతున్నాడు. వాడిని నేను చూచాను.

సముద్రంలో జంతువులను పట్టుకొనే బదులు, వీరిద్దరినీ ఆహారంగా తీసుకు పోవచ్చుకదా అని ఆ రాక్షసుని అడ్డగించాను. వాడు తనను పోనివ్వమని నన్ను వేడుకున్నాడు. తనకు దారి ఇవ్వమని బతిమాలే వాడిని చంపడం నాకు ఇష్టం లేదు. వాడిని వదిలి పెట్టాను. వాడు ఆ స్త్రీని తీసుకొని వాయువేగంతో వెళ్లిపోయాడు.

ఆ సమయంలో ఆకాశంలో సంచరించు సిద్ధులు నా వద్దకు వచ్చి నాతో ఇలా అన్నారు. “ఆమె ఎవరో కాదు. దశరథ మహారాజు కుమారుడు, రాముని భార్య. ఆమెను రావణుడు అనే రాక్షసుడు అపహరించుకొని పోతున్నాడు. నీవు వాడిని విడిచిపెట్టావు.” అని అన్నారు.

ఇదంతా జరిగేటప్పటికి సూర్యాస్తమయము అయింది. అందుకని నేను నీకు ఏమీ ఆహారము తీసుకురాలేకపోయాను.” అని అన్నాడు నా కుమారుడు.

నాకు వెంటనే పోయి ఆ రావణుని చంపి సీతను రక్షించవలెనని కోరిక కలిగింది. కానీ రెక్కలు లేక జీవచ్ఛవంలా పడి

ఉన్న నాకు అది సాధ్యంకాదు కదా! అందువలన సీతను రక్షించలేక పోయాను.

కాని నేను మీకు కొంత ఉపకారము చేయగలను. రామునికి సాయం చెయ్యడం అంటే నాకు కూడా ఇష్టమే కదా! సుగ్రీవుడు వానర రాజు. రాముడు గొప్ప పరాక్రమ వంతుడు. రామ బాణమునకు తిరుగు లేదు. కానీ మీ వానరుల సాయం లేనిది వారు ఏమీ చేయలేరు. మీ బుద్ధికి పదును పెట్టండి. కార్యరంగములోకి దూకండి. కార్యసాధకులకు అసాధ్యము ఏమీ లేదు."అని అన్నాడు సంపాతి.

శ్రీమద్రామాయణము
కిష్కింధా కాండము యాభైతొమ్మిదవ సర్గ సంపూర్ణము
ఓం తత్సత్ ఓం తత్సత్ ఓం తత్సత్

కిష్కింధా కాండము
అరవయ్యవ సర్గ.

వానర నాయకులు అందరూ సంపాతితో కలిసి చనిపోయిన జటాయువుకు జలతర్పణములు విడిచారు. తరువాత తీరుబడిగా అందరూ సంపాతి చుట్టు కూర్చున్నారు. అప్పుడుసంపాతి వారితో ఇలా అన్నాడు.

"ఇప్పుడు నేను మీకు సీత ఎక్కడ ఉన్నదీ అనే విషయం

నాకు ఎలా తెలుసో చెబుతాను. సావధానంగా వినండి. నేను సూర్యుని వేడికి రెక్కలు కాలిపోయి వింధ్య పర్వతము పడిపోయాను అని మీకు చెప్పాను కదా! నాకు ఏమీ తెలియడం లేదు. నేను ఎక్కడ ఉన్నది కూడా తెలియదు. తెలివి తప్పి పడి ఉన్నాను. నాకు తెలివి వచ్చి చుట్టు చూచాను. నేను దక్షిణ సముద్ర తీరము దగ్గర ఉన్న వింధ్యపర్వతము మీద ఉన్నట్టు, నాకు దగ్గరలో నిశాకరుడు అనే ఋషి ఆశ్రమము దగ్గర ఉన్నట్టు తెలుసుకున్నాను.

(ఇక్కడ మీకు ఒక సందేహము రావచ్చు. దక్షిణ దిక్కుగా వెదకమంటూ అంగదుని వింధ్యపర్వతము దగ్గర నుండి వెదక మన్నాడు సుగ్రీవుడు. మనకు తెలిసీ వింధ్యపర్వతము భారతదేశము మధ్యభాగంలో ఉంది. పంపానది కేరళ ప్రాంతంలో ఉంది. కిష్కింధ కూడా అక్కడే ఉండి ఉండవచ్చు. సీతను గోదావరీ తీరం నుండి రావణుడు అపహరించాడు అని మనము చదువుకున్నాము. ఒకదానికి ఒకటి సంబంధం లేకుండా ఉంది కదూ. ఈ శ్లోకంలో మన సందేహాలు అన్నీ తీర్చాడు వాల్మీకి మహర్షి.

హృష్టపక్షిగణాకీర్ణ: కన్దరోదరకూటవాన్।
దక్షిణస్యోదధేస్తీరే విన్ధ్యో అయమితి నిశ్చిత:॥

దక్షిణస్య=దక్షిణదిక్కున ఉన్న
ఉదధే:=సముద్రము యొక్క
తీరే= తీరమున ఉన్న
విన్ధ్య: ఇతి= వింధ్య అను పర్వతము అని
నిశ్చితి= నిశ్చయించుకున్నాను.

కాబట్టి ఇప్పటి దాకా మనము అనుకున్నట్టు భారతదేశ మధ్యలో ఉండే వింధ్యపర్వతము కాదు. దక్షిణ సముద్ర తీరములో

మరొక వింధ్యపర్వతము ఉంది అని తెలుస్తూ ఉంది. రామాయణ కథ త్రేతాయుగానికి సంబంధించింది. అప్పుడు ఉన్న భౌగోళిక పరిస్థితులు ఇప్పుడు లేవు. కొన్ని నగరాలు పట్టణాలు పర్వతాలు కాలగర్భంలో కలిసిపోయాయి. కొన్ని కొత్త కొత్తవి వెలిసాయి. కాబట్టి ఈనాడు ఉన్న భారతదేశంతో మనం ఆనాటి భారతదేశాన్ని పోల్చడం సరికాదు అని నా భావన.)

నేను ఆ పర్వతము మీద ఎనిమిది వేల సంవత్సరములు ఉన్నాను. అతికష్టం మీద నేను ఆ వింధ్యపర్వతశిఖరము నుండి కిందికి దిగి వచ్చాను. నాకు ఆ ఋషిని చూడవలెనని కోరిక పుట్టింది. ఒకచెట్టు కింద కూర్చుని ఆ ఋషి కొరకు ఎదురుచూస్తున్నాను. అప్పుడు ఆ ఋషి సముద్రములో స్నానం చేసి వస్తుండగా చూచాను. ఏనుగులు, సింహాలు, పాములు, పులులు మొదలగు క్రూరజంతువులు ఆయనను చుట్టు ముట్టి వస్తున్నాయి. ఆ ఋషి ఆశ్రమము లోనికి వెళ్లగానే అవి అన్నీ ఎవరి దోవన అవి వెళ్లిపోయాయి.

ఆ ఋషి దారి మధ్యలో చెట్టుకింద కూర్చుని ఉన్న నన్ను చూచాడు. లోపలకు వెళ్లిన కొంచెంసేపటికి బయటకు వచ్చాడు. నా వద్దకు వచ్చి నన్ను చూచాడు.

"నేను ఇదివరకు నిన్ను చూచాను. నువ్వు సంపాతి కదూ. నీ రెక్కలు కాలిపోయి వికృతంగా ఉండడం వలన నిన్ను వెంటనే గుర్తించలేకపోయాను. నీ తమ్ముడు జటాయువు కదూ! ఇంతకు పూర్వము మీరు నన్ను కలిసేవాళ్లు.

ఇంతకూ నీ రెక్కలు ఎందుకు కాలిపోయాయి? నీవు వికృతంగా ఎందుకు అయ్యావు. వివరంగా చెప్పు." అని అడిగాడు ఆ ఋషి..

శ్రీమద్రామాయణము
కిష్కింధా కాండము అరువదవ సర్గ సంపూర్ణము
ఓం తత్సత్ ఓం తత్సత్ ఓం తత్సత్

కిష్కింధా కాండము
అరువది ఒకటవ సర్గ.

అప్పుడు నేను సూర్యమండలము వైపు వెళ్లడం, సూర్యుని వేడికి నా రెక్కలు కాలిపోవడం, అన్ని విషయాలు ఆ ఋషికి వివరంగా చెప్పాను. కాలిన గాయములతో నా ఒళ్లు స్వాధీనం తప్పిందని చెప్పాను. అసలు అలా ఎందుకు చేసారు అని ఆ ఋషి అడిగాడు. అప్పుడు నేను ఆ ఋషితో ఈ విధంగా చెప్పాను.

"నేను, నా తమ్ముడు జటాయువు, ఒక సారి పందెం వేసుకున్నాము. నాకు ఎక్కువ బలం ఉందంటే నాకు ఎక్కువ బలం ఉందని గర్వించాము. సూర్యునితో పాటు ఉదయాద్రి నుండి అస్తాద్రివరకూ ఎగరాలని, హిమాచలము మీద ఉన్న ఋషుల ముందు, ఇద్దరం పోటీ వేసుకొన్నాము.

ఇద్దరం ఆకాశంలోకి ఎగిరాము. సూర్యుని అనుసరించి ఎగురుతున్నాము. దగ్గర దగ్గరగా సూర్యుని సమీపానికి వెళ్లాము. సూర్యుని సమీపానికి వెళ్లేటప్పటికి మా ఇద్దరికీ తీవ్రంగా చెమట

పట్టింది. భయం వేసింది. మూర్ఛవచ్చినట్టయింది. అక్కడ ఉన్న మాకు ఏ దిక్కూ తెలియడం లేదు. అంతా మండుతున్న అగ్నిగోళం లాగా ఉంది. నాకు మనస్సు పనిచేయడం మానేసింది. కేవలం నేత్రాలతో చూస్తూ వెళుతున్నాను.

అప్పుడు మాకు సూర్యుడు భూమిప్రమాణంలో కనపడ్డాడు. నేను నా తమ్ముడు జటాయువు వంక చూచాను. అతను భూమి మీదికి జారిపోతున్నాడు. నాకుకూడా భయం వేసింది. నా తమ్ముడితో నేను కూడా భూమి మీదికి జారిపోయాను. నా తమ్ముడి దగ్గరగా వెళ్లి నా రెక్కలను నా తమ్ముడికి రక్షణగా నిలిపాను. నా రెక్కల రక్షణలో జటాయువు శరీరం కాలిపోలేదు. కాని, నారెక్కలమీద సూటిగా సూర్యరశ్మిపడటం వలన నా రెక్కలు పూర్తిగా కాలిపోయాయి.

నేను వింధ్యపర్వత ప్రాంతంలో పడిపోయాను. నా తమ్ముడు జటాయువు దండకారణ్యంలో జనస్థానంలో పడ్డట్టు ఊహించాను. ఇప్పుడు నాకు ఎవరూ లేరు. ఒంటరి వాడను. ఈ విధంగా బతకడం వృధా. అందుకని చనిపోదలచుకున్నాను." అని ఆ ఋషితో నా వృత్తాంతము సవిస్తరంగా చెప్పాను.

శ్రీమద్రామాయణము

కిష్కింధా కాండము అరువది ఒకటవ సర్గ సంపూర్ణము

ఓం తత్సత్ ఓం తత్సత్ ఓం తత్సత్

కిష్కింధా కాండము

అరువది రెండవ సర్గ.

నేను ఆ ఋషితో నా విషయం గురించి చెప్పి దు:ఖిస్తున్నాను. అప్పుడు ఆ ఋషి కొంచెం ఆలోచించి ఇలా అన్నాడు. “నీకు కాలక్రమేణా రెక్కలు, బుద్ధి, జ్ఞానము అన్నీ వస్తాయి. అధైర్యపడకు. దానికి ముందు నేను చెప్పేది విను. నేను ఈ విషయాలన్నీ నా దివ్యదృష్టితో గ్రహించాను. ఇక్ష్వాకు వంశంలో దశరథుడు అనే మహారాజు పుడతాడు. ఆయనకు నలుగురు కుమారులు కలుగుతారు. అందులో రాముడు పెద్దవాడు. తండ్రి అయిన దశరథుని ఆదేశము మేరకు రాముడు, తన భార్య సీత, తమ్ముడు లక్ష్మణునితో కలిసి అరణ్యములకు వెళతాడు. అప్పుడు కొన్ని కారణముల వలన రావణుడు అనే రాక్షస రాజు రాముని భార్యను జన స్థానము నుండి అపహరిస్తాడు. సీత రావణుని సంపదలకు భోగములకు విలాసములకు లొంగదు. ఈ విషయాన్ని తెలుసుకొన్న దేవేంద్రుడు అమృతముతో సమానమయిన పరమాన్నమును సీతకు ఇస్తాడు. ఆ పరమాన్నమును దేవేంద్రుడు ఇచ్చాడు అని తెలుసుకొన్న సీత, ఆ పరమాన్నములో కొంత భాగమును తీసి నేల మీద పెట్టి “ఇది నా భర్తరామునికి, నా మరిది లక్ష్మణునకు, వారు జీవించి భూమి మీద ఉన్నా, చచ్చి స్వర్గాన ఉన్నా, వారికి చెందుతుంది.” అని పలుకుతుంది.

తరువాతి కాలంలో సీతను వెతుకుతూ రాముడు పంపగా వచ్చిన వానరులు నిన్ను కలుస్తారు. వారికి నీవు సీత గురించి చెప్పాలి. అందుకని నీవు ఇక్కడే ఉండి వారి రాక కోసరము నిరీక్షిస్తూ ఉండాలి. నేను నా తపోబలముతో నీకు ఇప్పుడే రెక్కలు తెప్పించగలను. కానీ

నీకు రెక్కలు వస్తే నీవు ఇప్పుడే ఎగిరిపోతావు. నీవు ఇక్కడ వానరుల కోసరం వేచి ఉండటం అవసరము. ఎందుకంటే రామ దూతలకు సాయం చెయ్యడం లోకోపకారము చెయ్యడం వంటిది. నాకు కూడా అప్పటి దాకా బతికి ఉండి రాముని లక్ష్మణుని చూడవలెనని కోరికగా ఉంది. కానీ శరీరం సహకరించదు కదా! అందుకని ఈ శరీరాన్ని వదిలిపెడుతున్నాను." అని ఆ ఋషి నాతో సీతను గురించి చెప్పాడు.

శ్రీమద్రామాయణము

కిష్కింధా కాండము అరువది రెండవ సర్గ సంపూర్ణము

ఓం తత్సత్ ఓం తత్సత్ ఓం తత్సత్

కిష్కింధా కాండము

అరువది మూడవ సర్గ.

"ఓ వానరులారా! ఆ తరువాత ఆ ఋషి నాతో ఇంకా కొన్ని మాటలు చెప్పి తన ఆశ్రమమునకు వెళ్లిపోయాడు. అప్పటి నుండి నేను ఈ వింధ్యపర్వతము మీద కూర్చుని మీ కొరకు ఎదురు చూస్తున్నాను. ఆ మహర్షి చనిపోయి నూరు సంవత్సరముల కాలము గడిచిపోయినది. నాకు అప్పుడప్పుడు ఈ దుర్భర జీవితము గడపలేక చనిపోవాలని అనుకొన్నాను. కానీ, ఆ ఋషి చెప్పిన మాటలు మీకు చెప్పాలి కదా! అందుకని మీ రాక కోసం ఎదురు చూస్తూ, జీవించి ఉన్నాను.

దశరథ మహారాజు నాతమ్ముడు జటాయువు కే కాదు నాకు కూడా మిత్రుడు. సీత దశరథుని కోడలు అని తెలిసి కూడా నా

కుమారుడు ఆమెను కాపాడలేకపోయాడు. రావణుని విడిచిపెట్టాడు. అందుకని నేను నా కుమారుని తిట్టాను. కాని ఏమి చేసేది. జరగాల్సింది జరిగిపోయింది."అని వానరులతో మాట్లాడుతూ ఉండగానే సంపాతికి రెక్కలు మొలిచాయి.

"ఓ వానరోత్తములారా! ఆ మహాఋషి ఆజ్ఞప్రకారము ఆయన చెప్పిన మాటలు మీకు చెప్పగానే నాకు ఆ ఋషి ప్రభావము వలన రెక్కలు మొలిచాయి. ఇప్పుడు నేను ఎక్కడి కంటే అక్కడకు ఎగిరిపోగలను. నా బలము పరాక్రమము నాకు తిరిగి లభించాయి. నేను ఇప్పుడు నవయువ్వనంలో ఉన్నంత ఉత్సాహంగా ఉన్నాను. మీరు అన్నివిధాలా ప్రయత్నం చేయండి. సీత మీకు లభిస్తుంది. ఆ మహాఋషి మహిమ వలన నాకు రెక్కలు ఎలా వచ్చాయో, మీకు కూడా సీత జాడ లభిస్తుంది. సందేహము లేదు." అని చెప్పి ఆ పక్షిరాజు సంపాతి తనకు నిజంగా ఎగిరే సామర్ధ్యము వచ్చిందా అని పరీక్షించుకోడానికి ఒక్కసారి తన రెక్కలు టపటపలాడించి పైకి ఎగిరాడు. సంతోషంగా ఎగురుకుంటూ వెళ్లిపోయాడు. వానరులు సముద్రం ఎలా దాటాలా, లంకకు ఎలా చేరాలా అని ఆలోచిస్తున్నారు.

శ్రీమద్రామాయణము

కిష్కింధా కాండము అరువది మూడవ సర్గ సంపూర్ణము

ఓం తత్సత్ ఓం తత్సత్ ఓం తత్సత్

కిష్కింధా కాండము

అరువది నాలుగవ సర్గ.

ఇప్పుడు వానరులకు సీత ఎక్కడ ఉందో తెలిసింది. సీత రావణుని రాజ్యమైన లంకలో ఉంది. ఆ లంక దక్షిణ సముద్ర మధ్యలో ఉన్న దీవిలో ఉంది. ఆ దీవి సముద్ర తీరము నుండి నూరు యోజనముల దూరములో ఉంది. ఆ దీవికి ఎలా చేరాలి? అదే ఇప్పుడు వారి ముందు ఉన్న ప్రశ్న. అందరూ సముద్ర తీరంలో నిలబడి సముద్రం వంక చూస్తున్నారు. ఆకాశము భూమి కలిసినట్టుఉన్న ఆ సముద్రమును చూస్తుంటేఆ వానరులకు దిగులు పుట్టింది. ఈ సముద్రాన్ని ఎలా దాటాలి! ఇదే వారి అందరి మనసుల్లో మెదిలే ప్రశ్న.

వారికి నాయకుడు అయిన అంగదుడు వారిని చూచి ఇలా అన్నాడు. "మనము ఇలా సముద్రాన్ని చూస్తూ దిగులుపడితే ప్రయోజనము లేదు. ఏదో ఒకటి చెయ్యాలి. మన మనసులో దిగులు, భయం ప్రవేశిస్తే మనము ఏమీ చెయ్యలేము. ఆ దిగులు భయం మనలను మింగేస్తుంది. కాబట్టి ధైర్యం తెచ్చుకోండి. ఏమి చెయ్యాలో ఆలోచించండి. " అని పలికాడు అంగదుడు.

కాసేపు అటు ఇటు చూచాడు. మరలా ఇలా అన్నాడు.

"మనలో ఈ సముద్రమును దాటగల సమర్థుడు ఎవరు? ఎవరు నూరుయోజనముల దూరము కల ఈ సముద్రమును దాటగలరు? రాముని కార్యము నెరవేర్చగల సమర్థుడు ఎవరు? అతడే మనలను అందరనూ సుగ్రీవుని బారినుండి కాపాడగలడు.

మరలామన భార్యాబిడ్డలను చూడటానికి కారణం కాగలడు. లేకపోతే మనం అందరం ఇక్కడ చావడం తప్పదు. మీలో ఎవరికి ఈ నూరు యోజనముల విస్తీర్ణము కల సముద్రము దాటగల సమర్ధత ఉంది?" అని పలికి అందరి వంకా చూచాడు.

వానరులలో ఎవరూ మాట్లాడలేదు. అంతా మౌనంగా ఉ న్నారు. మరలా అంగదుడు ఈ విధంగా అన్నాడు. "మీరంతా ఎందుకు ఊరుకున్నారు. ఎవరూ ఎందుకు ముందుకు రావడం లేదు. మీరంతా సామాన్యులు కారు. ఇదివరకు ఎన్నో ఘనకార్యాలు సాధించారు. మీరంతా వీరులు, పరాక్రమ వంతులు. మీకు సాటిరాగల వారు ఈ లోకంలో లేరు. కాబట్టి ఎవరెవరు ఎంతెంత దూరము ఎగరగలరో చెప్పండి!" అని అడిగాడు అంగదుడు.

శ్రీమద్రామాయణము
కిష్కింధా కాండము అరువది నాల్గవ సర్గ సంపూర్ణము
ఓం తత్సత్ ఓం తత్సత్ ఓం తత్సత్

కిష్కింధా కాండము
అరువది ఐదవ సర్గ.

తరువాత ఒక్కొక్కరూ లేచారు. తమ తమ బలాబలాల గురించి చెప్పసాగారు. గజుడు అనే వానరుడు లేచి నేను పది యోజనముల దూరము ఎగురగలను అని అన్నాడు. గవాక్షుడు నేను ఇరువది యోజనముల దూరము ఎగురగలను అని అన్నాడు. శరభుడు ముప్పది యోజనములు, ఋషభుడు నలుబది

యోజనములు, గంధమాధనుడు యాభైయోజనములు, మైందుడు అరువది యోజనములు, ద్వివిదుడు డెబ్బది యోజనములు, సుషేణుడు ఎనుబది యోజనములు ఎగురగలము అని వరుసగా లేచి చెప్పారు. వారు చెప్పినది అంతా విన్న జాంబవంతుడు లేచి ఇలా అన్నాడు.

"ఇదివరకు నేను కూడా ఎంతో కొంత ఎగురగలను. కానీ ఇప్పుడు వార్ధక్యములో ఉన్నాను. అందుకని ఎగురలేను. కాని ఇది రామ కార్యము. సుగ్రీవుని ఆజ్ఞ. కాబట్టి ఏదో ఓపిక చేసుకొని నేను తొంబది యోజనములు ఎగురగలను. పూర్వము నాకు ఇంకా ఎగిరే శక్తి ఉండేది. పూర్వము బలి చక్రవర్తి చేసిన యజ్ఞములో, బలి చక్రవర్తి త్రివిక్రమునికి మూడు అడుగులు దానం ఇచ్చాడు. ఆ త్రివిక్రముని చుట్టు నేను ప్రదక్షిణం చేసాను. అప్పుడు అంత శక్తి ఉండేది. వార్ధక్యము వలన నా శక్తి అంతా తగ్గిపోయింది. కాని కేవలము తొంబది యోజనములు ఎగరడం వలన రామ కార్యము సిద్ధించదు కదా! " అని అన్నాడు, జాంబవంతుడు.

తరువాత అంగదుడు లేచాడు. "నేను మంచి యవ్వనములో ఉన్నాను. నాకు నూరుయోజనములు దూకే శక్తి ఉంది. కానీ తిరిగి రావడానికి నా శక్తి చాలుతుందో లేదో తెలియడం లేదు. " అని అన్నాడు అంగదుడు.

అంగదుని మాటలు విన్న జాంబవంతుడు ఇలా అన్నాడు. "అంగదా! నీ శక్తి నాకు తెలియదా! నీకు అమోఘమైన శక్తి ఉంది. నీవు

నూరు కాదు ఇంకా ఎక్కువ దూరము ఎగుర గలవు తిరిగి రాగలవు. కాని నీవు మా నాయకుడవు. మాకు మార్గదర్శకుడవు. నీవు మమ్ములను ఆజ్ఞాపించాలి కానీ నీవు కార్య రంగములోకి దిగకూడదు. నిన్ను పంపడం మంచి పద్ధతి కాదు. మేమందరమూ కలిసి నిన్ను రక్షించుకోవాలి కానీ, నిన్ను ప్రమాదములోని నెట్టకూడదు. నీవు లేకపోతే మాకు ఆజ్ఞలు ఇచ్చే వాళ్లు ఎవరు? మూలము స్థిరముగా ఉన్నప్పుడే కదా చెట్టుకు మంచి ఫలములు కాస్తాయి. మా నాయకుడివి నీవు క్షేమంగా ఉంటేనే మేము రామ కార్యమును చేయగలుగుతాము. కాబట్టి నీవు వెళ్లకూడదు. "అని పలికాడు జాంబవంతుడు.

ఆ మాటలు విన్న అంగదుడు ఇలా అన్నాడు. "జాంబవంతా! అందరి కంటే ఎక్కువ దూరం ఎగురగలిగిన వాడను నేనే కదా. నేనూ వెళ్లక, ఇతర వానరులూ వెళ్లక పోతే, రామ కార్యము ఎలా సఫలము కాగలదు. అటువంటప్పుడు మనకు మరలా మరణమే శరణ్యము. మనము సీతజాడ తెలుసుకొని వెళితే సుగ్రీవుడు మనలను ఆదరిస్తాడు. వట్టిచేతులతో వెళితే మనమీద ఆగ్రహిస్తాడు. నీవు అన్నీ తెలిసిన వాడవు. మా అందరికంటే వయస్సులో పెద్దవాడవు. ఈ పరిస్థితులలో ఏమి చెయ్యాలో నీవే నిర్ణయించు." అని అన్నాడు అంగదుడు.

ఆ మాటలు విన్న జాంబవంతుడు ఇలా అన్నాడు. "అంగదా! రామ కార్యము గురించి నీవు దిగులు చెందనవసరము లేదు. రామ కార్యము సాధించగల వానిని నేను ఉత్సాహపరుస్తాను. ఉద్యుక్తుడిని చేస్తాను. ." అని అన్నాడు.

వానరులందరూ తమ బలాబలముల గురించి చెబుతూ ఉంటే హనుమంతుడు దూరంగా కూర్చుని ఏదో ఆలోచిస్తున్నాడు. జాంబవంతుడు దూరంగా కూర్చుని ఉన్న హనుమంతుని వద్దకు వెళ్ళాడు.

శ్రీమద్రామాయణము
కిష్కింధా కాండము అరువది ఐదవ సర్గ సంపూర్ణము
ఓం తత్సత్ ఓం తత్సత్ ఓం తత్సత్

కిష్కింధా కాండము
అరువది ఆరవ సర్గ.

జాంబవంతుడు దూరంగా కూర్చుని ఉన్న హనుమంతుని వద్దకు వెళ్లాడు. హనుమ పక్కనే కూర్చుని ఇలా అన్నాడు. "హనుమా! ఇక్కడ ఉన్న వానరులలో కెల్లా వీరుడవు నీవే కదా. పైగా సమస్త శాస్త్రములు చదివినవాడవు. అందరూ వారి బలాబలాలు గురించి చెబుతూ ఉంటే నీవు ఏంది ఇలా ఒంటరిగా కూర్చుని ఆలోచిస్తున్నావు.

ఓ హనుమా! నీ గురించి నీకు సరిగా తెలియదు. నీవు తేజస్సులోనూ, బలంలోనూ, పరాక్రమం లోనూ రామలక్ష్మణులతోనూ, రాజైన సుగ్రీవునితోనూ సమానుడవు. పక్షులలో కెల్లా గరుడుడు ఉత్తముడు. ఆ గరుత్మంతుడు సముద్రము మీద ఎగురుతూ సముద్రగర్భములో ఉన్న పెద్ద పెద్ద పాములను పైకి లాగడం నేను ప్రత్యక్షంగా చూచాను. గరుత్మంతుని రెక్కలకు ఎంత బలమూ, శక్తి

ఉన్నాయో నీ భుజాలకు కూడా అంతే శక్తి, బలం ఉన్నాయి. బలంలో కానీ ఎగిరే శక్తిలో కానీ నీవు గరుడునికి ఏ మాత్రం తీసిపోవు. ఇది నిజం.

నీ తల్లి సామాన్యురాలు కాదు. నీ తల్లి పుంజికస్థల అనే అప్సరస. పుంజికస్థలకు అంజన అనే పేరుకూడా ఉంది. ఆమె శాప వశమున కుంజరుడు అనే వానర ప్రభువుకు కుమార్తెగా వానర స్త్రీగా జన్మించింది. ఆమె వానర స్త్రీగా జన్మ ఎత్తినా, మనుష్య రూపముతోనే లోకోత్తర సుందరిగా ప్రకాశించింది. కేసరి అను వానరుని వివాహమాడింది.

ఒక నాడు ఆమె పర్వత శిఖరము మీద విహరిస్తూ ఉంది. వాయుదేవుడు మంద్రంగా వీస్తున్నాడు. ఆ సున్నితమైన గాలికి ఆమె వేసుకున్న పమిట తొలగిపోయింది. అప్పుడు వాయు దేవుడు ఆమెను, ఆమె అంగాంగ సౌందర్యమును చూచి మోహించాడు. వాయు దేవునిలో కామ వాంఛ తలెత్తింది. వాయుదేవుడు ఆమెను కౌగలించు కున్నాడు.

అప్పుడు ఆమె భయపడింది. "ఎవరు వాడు! నా పాతివ్రత్యమును భంగపరచు వాడు ఎవరు?" అని అడిగింది.

"అంజనా! నేను వాయుదేవుడను. నిన్ను ఏమీ చేయను. భయపడకు. నేను నిన్ను కౌగలించుకున్నాను. నా మనస్సులో నిన్ను కోరుకున్నాను. మానసికంగా నీతో సంగమించాను. నీ పాతివ్రత్యము నకు భంగము కలగ కుండా, నా వలన నీకు ఒక కుమారుడు

జన్మిస్తాడు. నా కుమారుడు నాతో సమానమైన పరాక్రమము వేగము కలవాడు. ఎగరడంలో, దుమకడంలో నాతో సమానమైన బలపరాక్రమములు కలవాడు." అని అన్నాడు.

తరువాత వాయుదేవుడు వెళ్లిపోయాడు. నీ తల్లి అంజన పక్కనే ఉన్న ఒక గుహలో నిన్ను ప్రసవించింది. పుట్టగానే నీకు అమిత మైన బల పరాక్రమములు వాయువుతో సమానమైన వేగము సంక్రమించాయి. అప్పుడే సూర్యుడు తూర్పుదిక్కున ఉదయిస్తున్నాడు. నీ తల్లి నీకు బాలసూర్యుడిని చూపించింది. బాలసూర్యుని చూచి నీవు ఫలము అనుకున్నావు. బాలసూర్యుని పట్టుకొనవలెనని నీవు ఆకాశం లోకి ఎగిరావు. నీవు మూడు వందల యోజనముల దూరము ఎగిరావు. సూర్యుని తేజస్సు నిన్ను ఆక్రమించింది. కాని నీవు భయపడలేదు. అలా ఎగురుతూనే ఉన్నావు.

సూర్యుని మీదికి వెళుతున్న నిన్ను చూచి ఇంద్రుడు తన వజ్రాయుధాన్ని నీ మీద ప్రయోగించాడు. ఆ వజ్రాయుధము నీ ఎడమ వైపు గడ్డానికి తగిలింది. అక్కడ నీ గడ్డము కొంచెము పగిలింది. అందువలన నీకు హనుమంతుడు అనే పేరు సార్ధకము అయింది.

నిన్ను ఇంద్రుడు తన వజ్రాయుధముతో కొట్టడం చూచాడు వాయుదేవుడు. తన కుమారుని కొట్టాడు అన్న కోపంతో ముల్లోకము లలో వాయువును బంధించాడు. మూడు లోకములు గాలి లేక అల్లల్లాడిపోయాయి. అప్పుడు దేవతలందరూ వాయుదేవుని ప్రార్ధించారు. బ్రహ్మదేవుడు కూడా నీ తండ్రి వాయుదేవుని వద్దకు

వచ్చాడు. నీకు ఏ అస్త్రములతో కానీ, శస్త్రములతో కానీ చావులేకుండా నీకు వరం ఇచ్చాడు. నీకు వజ్రాయుధముతో కూడా ఎలాంటి అపకారము జరగలేదు కాబట్టి, నువ్వు కోరినపుడు నీకు మరణం వచ్చేట్టు వరం ప్రసాదించాడు.

నీవు కేసరికి క్షేత్రజ న్యాయమున పుత్రుడవు. కాని వాయుదేవునికి ఔరస పుత్రుడవు. మహా బలవంతుడవు. వాయుదేవునితో సమానమైన బలము, వేగము కల వాడవు. ప్రస్తుతము మా అందరిలోకీ బలవంతుడివి, పరాక్రమ వంతుడివి, వేగముగా ఎగురగలవాడివి నీవు ఒక్కడివే. కాబట్టి నీవు విజృంభించు. సముద్రాన్ని దాటు. సీతను చూడు. మాకందరికీ మేలు చేకూర్చు. నీ వేగము పరాక్రమము చూడాలని మా అందరికీ కోరికగా ఉంది. హనుమంతా! అంజనీ పుత్రా! లే! నీ శక్తిని చూపించు. సముద్రాన్ని లంఘించు." అని హనుమంతుని జాంబవంతుడు ఉత్సాహపరిచాడు.

జాంబవంతుని మాటలతో హనుమంతుడు పొంగిపోయాడు. తనేమిటో తన శక్తి ఏమిటో తెలుసుకున్నాడు. తన శరీరాన్ని పెంచాడు. అలా పెరిగిపోతున్న హనుమంతుని చూచి వానరులందరూ జయజయధ్వానాలు చేసారు.

శ్రీమద్రామాయణము

కిష్కింధా కాండము అరువది ఆరవ సర్గ సంపూర్ణము

ఓం తత్సత్ ఓం తత్సత్ ఓం తత్సత్

కిష్కింధా కాండము

అరువది ఏడవ సర్గ.

హనుమంతునికి తాను నూరు యోజనముల దూరము ఎగరాలని తెలుసు. అందుకు తగ్గట్టు తన శరీరాన్ని పెంచాడు. వేగాన్ని అందుకోడానికి ముందుకు దూకబోతున్నాడు. త్రివిక్రముని వలె ప్రకాశిస్తున్న హనుమంతుని చూచి వానరులు హర్షధ్వానాలు చేసారు. ఆనందంతో పెద్దగా అరుస్తున్నారు.

హనుమంతుడు కూడా సంతోషంతో తన తోకను విదిలించాడు. ఒక్కసారి ఆవులించాడు. తన కన్నా పెద్దవారికి నమస్కరించాడు.

"నా తండ్రి వాయుదేవుడు తన బలముతో పర్వతశిఖరములను కూడా ఎగురగొట్టగలడు. నేను వాయుదేవుని ఔరస పుత్రుడను. ఎగరడంలో ఆయనకు సమానుడను. మేరు పర్వతము చుట్టు లెక్కలేనన్ని సార్లు చుట్టిరాగలను. ఈ సముద్రమును అవలీలగా దాటగలను. నేను ఎగిరే వేగానికి సముద్రములో ఉన్న జలచరములు అన్నీ పైకి లేస్తాయి. నేను కూడా గరుడుని కన్నా అత్యంత వేగంగా ఎగురగలను. సూర్యోదయము అయిన తరువాత నేను సూర్యుని వద్దకు వెళ్లి, భూమి మీదకు వచ్చి మరలా సూర్యాస్తమయము లోపు ఆయనకు ఎదురు వెళ్లగలను. ఆకాశంలో ఎగిరే అన్ని పక్షులను అధిగమించగలను. భూమిని బద్దలు కొట్టగలను. పర్వతములను పడగొట్టగలను. మహాసముద్రములనే దాటగలను. నేను ఎగిరే వేగానికి వృక్షములు లతలు

కిందపడిపోతాయి.

ఓ వానరులారా! ఆకాశాన్ని మింగుతూ ఎగురుతున్న నన్ను మీరు కనులారా చూడండి. నేను మేఘములను ఎగురగొడుతూ ఎగురుతాను. నేను ఎగిరేటప్పుడు నన్ను నా తండ్రి వాయువు, గరుత్మంతుడు తప్ప ఇంకెవరూ నన్ను అనుసరించలేరు. నేను నూరుయోజనములు కాదు, పదివేల యోజనముల దూరము కూడా ఎగురగలను అని అనుకొంటున్నాను. నేను దేవేంద్రుని ఓడించి అమృతమును తేగలను. లంకా పట్టణమునే పెకలించి తేగలను." అని ఆత్మవిశ్వాసంతో పలుకుతున్న హనుమంతుని చూచి వానరులు, జాంబవంతుడు సంతోషంతో హర్షధ్వానాలు చేసారు. వారు కూడా హనుమంతుని కీర్తించడం మొదలెట్టారు.

"ఓ హనుమంతా! వీరుడా! కేసరీ కుమారుడా! వేగవంతుడా! మారుతాత్మజుడా! నీవే ఈ పనిచేయగల సమర్థుడవు. మా శోకమును పోగొట్టగల వీరుడవు. మేము నీ శుభాన్ని కోరుతున్నాము. నీ క్షేమం కొరకు ఆ భగవంతుని ప్రార్థిస్తాము. మహాఋషుల అనుగ్రహముచేతా, పెద్ద వారైన వానరుల ఆశీర్వచనములచేతా నీవు సముద్రమును దాటగలవు. నీవు వచ్చువరకూ మేము ఒంటి కాలిమీద నిలబడి నీ రాక కొరకు ఎదురుచూస్తుంటాము. శుభంగా వెళ్లిరా!" అని హనుమంతుని స్తుంతించారు వానరులు.

హనుమంతుడు ఆ వానరులతో ఇలా అన్నాడు. "ఓ వానరవీరులారా! మీ అందరి శుభాశీస్సులతో నేను ఈ సముద్రాన్ని అవలీలగా లంఘిస్తాను. నా వేగాన్ని ఎవరూ తట్టుకోలేరు. నేను ఎత్తైన

ఈ మహేంద్రపర్వతము మీద ఎక్కి ఎగురుతాను. నా వేగానికి ఈ పర్వతము కదిలిపోతుంది.” అని మిక్కిలి ఆత్మవిశ్వాసంతో అన్నాడు.

తరువాత హనుమంతుడు మహేంద్రపర్వతము మీదికి ఎక్కాడు. తన కాళ్లతో మహేంద్రపర్వతశిఖరమును తన్నాడు. మహా వేగంతో పైకి లేచాడు. ఆ వేగానికి తట్టుకోలేక మహేంద్ర పర్వతము మీద ఉన్న వృక్షములు కూలిపోయాయి. జంతువులు భయపడి పరుగెత్తిపోయాయి. బండరాళ్లు కిందికి దొర్లాయి.

హనుమంతుడు లంకవైపుకు సాగిపోయాడు.

శ్రీమద్రామాయణము

కిష్కింధా కాండము అరవై ఏడవ సర్గ సంపూర్ణము.

కిష్కింధా కాండ సర్వం సంపూర్ణము.

ఓం తత్సత్ ఓం తత్సత్ ఓం తత్సత్.